

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



నిఖత్ పసిడి పంచ్

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో విజయం

10

శుక్రవారం | 21-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 216 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి మ.2.48 తదుపరి విదియ, నక్షత్రం: అనూరాధ మ.1.56 తదుపరి జ్యేష్ఠ వర్జ్యం: రా.8.11-9.59, దుర్ముహూర్తం: ఉ.8.40-9.25, మ.12.23-1.07, అమృతఘడియలు: ఉ.6.56-8.43, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.27, సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైతన్నా.. మీ కోసం

అన్నదాత కోసం 24 నుంచి ప్రత్యేక కార్యక్రమం

- సాగు బాగుకు పంచసూత్రాల అమలు: సీఎం
- వారం పాటు రైతు ఇంటికి నేతలు, అధికారులు
- అగ్రిటెక్‌పై అవగాహన కార్యక్రమాలు
- 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు
- శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు
- ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం
- పురుగుమందుల అధిక వాడకంతో జరిగే నష్టాలను వివరించాలి
- సేంద్రియ ఉత్పత్తులకు విదేశాల్లో ఉన్న డిమాండ్ గురించీ చెప్పాలి
- వ్యవసాయ అనుబంధ శాఖలకు సీఎం నిర్దేశం
- మంత్రి అచ్చెన్న, అధికారులు, సిబ్బంది సహా 10 వేల మందితో టెలికాన్ఫరెన్స్



కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలోని చిన్నదాసరిపల్లెలోని వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రాత్రి అరటి తోటలో రైతులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో పెనుమార్పులతో సాగును లాభసాటి చేసేందుకు కూటమి ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఈ నెల 24వ తేదీ నుంచి 'రైతన్నా.. మీకోసం' పేరిట పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టనుంది. ఆ రోజు నుంచి 29వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి రైతు ఇంటికీ వెళ్తారు. వచ్చే నెల 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహిస్తారు. వీటిలో వ్యవసాయ-మార్కెటింగ్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడితో, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతుసేవా కేంద్రాల సిబ్బంది సహా 10 వేల మందితో సీఎం చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతల సంక్షేమానికి, సాగు విధానంలో తీసుకురావలసిన మార్పులపై ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై ఆయన ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఇదే

మిగతా 12వ పేజీలో...

జనవరి నుంచి కాగ్నిజెంట్!

- తాత్కాలిక భవనంలో 800 మందితో ప్రారంభం?
- రాష్ట్రవాసులను విశాఖకు బదిలీ చేయాలని నిర్ణయం
- ఉద్యోగుల అభిప్రాయం కోసం సర్వే
- అభిప్రాయాలు తెలిపేందుకు నేటి వరకే గడువు

13

టెట్‌కు 1,97,823 దరఖాస్తులు

- వారిలో ఇన్‌సర్వీస్ టీచర్లు 17,883 మంది
- రెండు రోజుల్లో ముగియనున్న గడువు



కల్తీ నెయ్యి వెనుక కథేంటి?

- టీటీడీ మాజీ చైర్మన్ వైవీపై ప్రశ్నల వర్షం
- ఎవరి సిఫారసుతో 'నందిని'ని మార్చారు?
- పరీక్షల తర్వాత 'భోలేబాబా'ను ఆపలేదేం?
- కొందరి కోసం షరతులు మార్చారా!?
- పీఏ అప్పన్నకు అన్ని ఆస్తులు ఎక్కడివి?
- సూటిగా సమాధానాలు చెప్పని వైవీ
- ఇంట్లో పలు టీటీడీ డాక్యుమెంట్లు స్వాధీనం
- మొబైల్ ఫోన్ నుంచి డేటా కాపీ

అమరావతి/తిరుపతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కాంట్రాక్టులు ఎవరెవరి సిఫారసు మేరకు కుదిరాయి? కొందరికి అనుకూలంగా ఉండేలా షరతులు మార్చడంలో అప్పటి టీటీడీ చైర్మన్‌గా మీ పాత్ర ఏమిటి? మైసూర్‌లోని ప్రయోగశాల నాణ్యత రిపోర్టులు ఇచ్చిన తర్వాత కూడా భోలే బాబా సంస్థ నుంచి నెయ్యి సరఫరా ఎందుకు కొనసాగించారు? అంత భారీస్థాయిలో నెయ్యి సేకరణకు

మిగతా 12వ పేజీలో...

యాలకుల టెండర్ రద్దు

- చెన్నై కంపెనీలపై టీటీడీ చట్టపరమైన చర్యలు
- రెండేళ్లు బ్లాక్‌లిస్ట్.. డీబార్.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు తగదు

బిల్లులపై గవర్నర్లు సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చు

- మంత్రి మండలి సలహా పాటించడం తప్పనిసరి కాదు
- గవర్నర్లు నిరవధికంగా బిల్లులను తొక్కి పెట్టడం కుదరదు
- అయితే అసెంబ్లీకి పంపాలి... లేదంటే ఢిల్లీకి పంపాలి
- గడువు మీరితే బిల్లు పాసైనట్లే అనడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదు
- కారణం లేకుండా పెండింగ్‌లో పెడితే కోర్టులు కలుగజేసుకోవచ్చు
- రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలపై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేవనెత్తిన 14 ప్రశ్నలకు సమాధానాలు

> "గవర్నర్లు, రాష్ట్రపతి తమ విధుల నిర్వహణలో కోర్టులకు జవాబుదారీ కాదు అని చెబుతున్న ఆర్టికల్ 361 కోర్టులకు శిరోధార్యం. కానీ, గవర్నర్లు ఆర్టికల్ 200 కింద నిర్ణయం తీసుకోవడంలో సుదీర్ఘంగా ఏ చర్యా లేకుండా ఉంటే కోర్టులకు ఉన్న పరిమిత న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించుకోకుండా ఈ 361 ఆర్టికల్ అడ్డుకోలేదు. విధుల నిర్వహణలో గవర్నర్‌కు వ్యక్తిగతంగా రక్షణ ఉంటుంది కానీ ఆయన కార్యాలయం కోర్టు విచారణ పరిధిలోనే ఉంది.
>
> - సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. అటువంటి సమయంలో సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను న్యాయస్థానం ఆదేశించవచ్చని చెప్పింది. శాసన సభలు ఆమోదించి పంపించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలిపే అంశానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం

మిగతా 2వ పేజీలో...

AADHAAR

ఇకపై అంతటా ఆధార్!

- సినిమా హాళ్లు, సభలు, ఆఫీసులు.. ఎక్కడికెళ్లినా గుర్తింపు తనిఖీ
- 'ఆఫ్‌లైన్ ఆధార్'పై కేంద్రం కసరత్తు
- యూఐడీఏఐ సర్వర్‌తో అనుసంధానం కాకుండానే యాప్ ద్వారా ధ్రువీకరణ
- అధికార వర్గాల వెల్లడి

2

హైదరాబాద్‌లోనూ 'రప్పా రప్పా'

బేగంపేట నుంచి ర్యాలీగా నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

- వైసీపీ కార్యకర్తల నానా హంగామా
- గుంపులు, గుంపులుగా చేరిన శ్రేణులు
- రోడ్లపై వెళ్లే సామాన్యులకు ఇబ్బందులు
- పోలీసులపైకి దూసుకొచ్చిన వైనం
- నాంపల్లిలో భారీగా ట్రాఫిక్ జామ్
- భయంతో ముందుగానే షాపుల మూత
- కోర్టు నుంచి బయటికి వస్తుండగా తోపులాట.. కిందపడిన న్యాయవాదులు
- పోలీసులు భారీ బందోబస్తు పెట్టినా వైసీపీ శ్రేణుల అత్యుత్సాహం

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్టే జరిగింది. వైసీపీ శ్రేణులు, జగన్ అభిమానులు హైదరాబాద్‌లో రచ్చ రచ్చ చేశారు. పొరుగు రాష్ట్రంలోనూ 'రప్పా రప్పా' ప్లకార్డులు ప్రదర్శిస్తూ, కాబోయే సీఎం జగన్, జై జగన్ నినాదాలతో నానా హంగామా చేశారు. గుంపులు, గుంపులుగా చేరి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు జగన్ హాజరైన సమయంలో అయితే మరింత రెచ్చిపోయారు. ఓ దశలో కోర్టు వైపు వెళ్లేందుకు దూసుకెళ్లగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి నాంపల్లి వరకూ ముందస్తు ప్రణాళిక ప్రకారం వైసీపీ కార్యకర్తలు చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. బేగంపేట నుంచి జగన్ ర్యాలీగా నాంపల్లి వచ్చారు. గురువారం ఉదయం 11.37 గంటలకు నాంపల్లి కోర్టుకు చేరుకున్నారు. నాంపల్లి కోర్టులోని మొదటి గేటు నుంచి సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జాయింట్

మిగతా 14వ పేజీలో...

మీరేమైనా చెప్పదలచుకున్నారా?

- జగన్‌కు సీబీఐ కోర్టు జడ్జి ప్రశ్న
- ఏమీ లేదన్న ఏ-1
- యూరప్ పర్యటన వ్యవహారంలో కోర్టుకు హాజరైన మాజీ సీఎం
- కోర్టు హాలులో 25 నిమిషాలు గడిపిన వైసీపీ అధినేత
- ఎదురుపడినా పలుకరించుకోని వైఎస్ జగన్, సునీత



హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టు సమీపంలో '2029లో రప్పా రప్పా' అని రాసి ఉన్న ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న వైసీపీ కార్యకర్త

భారత్‌కు అమెరికా జావెలిన్ క్షిపణి

- యుద్ధ ట్యాంకు విధ్వంసక వ్యవస్థ విక్రయానికి అగ్రరాజ్యం ఆమోదం
- రూ. 825 కోట్ల ఒప్పందం

2



నితీశ్ దశావతారం

- బిహార్ సీఎంగా పదోసారి ప్రమాణం చేసిన నితీశ్‌కుమార్
- బీజేపీ నుంచి 14, జేడీయూ నుంచి 8 మంది మంత్రులుగా ప్రమాణం
- కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్ శ్రేయసి సింగ్‌కు క్యాబినెట్‌లో చోటు
- హాజరైన మోదీ, షా, చంద్రబాబు సహా బీజేపీ, ఎన్డీయే సీఎంలు
- ప్రభుత్వానికి తేజస్వీ అభినందనలు, ప్రశాంత్ కిశోర్ మౌన వ్రతం

2

వలస వెళ్లినా.. చదువు ఆగదు!

- పనుల నిమిత్తం వలస వెళ్లిన కుటుంబాల్లోని పిల్లలకు సర్కారు రక్ష
- రాష్ట్రవ్యాప్తంగా 236 సీజనల్ హాస్టళ్లు
- చిన్నారులకు విద్య, వసతి, భోజనం
- ఇతర రాష్ట్రాల పిల్లలకూ అవకాశం
- వారి మాతృ భాషలోనే విద్యా బోధన
- బడి బయట పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ
- గుంటూరులో అధికంగా బిహార్ పిల్లలు



ప్రత్యేక పాఠశాలల్లో వలస విద్యార్థులు

కూటికోసం.. కూలికోసం.. వలస బాటపట్టే కుటుంబాల్లోని చిన్నారులకు అనేక కష్టాలు!. ముఖ్యంగా విద్యకు దూరమై.. భవితను ప్రశ్నార్థకం చేసుకుంటున్నవారు ఎందరో ఉంటున్నారు. అలాంటి చిన్నారులను రాష్ట్ర ప్రభుత్వం అక్కున చేర్చుకుంటోంది. సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసి.. చిన్నారులకు వసతి, భోజనంతోపాటు విద్యను అందిస్తోంది. ఇతర రాష్ట్రాల చిన్నారులకు కూడా ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోంది.

13

జనజీవనంలో కలవకుంటే నిర్మూలనే



మారేడుమిల్లి అడవుల్లో నక్సల్స్ ఎన్‌కౌంటర్ తర్వాత స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్, ఏడీజీ లడ్డా

- మావోయిస్టులను మళ్లీ హెచ్చరిస్తున్నాం
- రాష్ట్రంలో నక్సలిజాన్ని నిర్వీర్యం చేస్తాం
- మార్చి వరకు 'ఆపరేషన్ సంభవ్'
- ఆ గడువులోగా నక్సల్ రహిత రాష్ట్రం
- రంపచోడవరంలో డీజీపీ గుప్తా వెల్లడి

13

హిడ్మా అంత్యక్రియలు పూర్తి

- పువర్తికి భారీగా తరలివచ్చిన ఆదివాసీలు

కేటీఆర్ విచారణకు ఓకే

- ఏసీబీకి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పచ్చజెండా
- ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కీలక పరిణామం
- చార్జిషీటు దాఖలుకు ఏసీబీ సన్నాహాలు

12

'సెన్‌యార్' తుఫాన్ ముప్పు!

3

- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం
- 24కు వాయుగుండంగా, 26కు తుఫాన్‌గా మారొచ్చు
- 29 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- కోతకు వచ్చిన పంటను భద్రపర్చుకోండి: ఐఎండీ



విశ్రాంత ఎంఈవోపై సైబర్ వల!

- రిటైర్మెంట్ సొమ్ము సహా రూ.34.6 లక్షలు స్వాహా
- రూ.3 కోట్ల స్కాంలో మీకు 75 లక్షలు ముట్టాయి
- ఆ కేసు నుంచి బయటపడాలంటే సగం సొమ్ము ఇవ్వాలి
- నిజమేనని నమ్మి మూడు విడతల్లో 34.6 లక్షలు జమ
- సొమ్ము తిరిగిరాక పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో కేసు నమోదు

14

రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు తగదు

(మొదటిపేజీ తరువాయి)



కీలక నిర్ణయాన్ని వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143వ నిబంధన కింద 14 ప్రశ్నలతో న్యాయ సలహా(ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) కోరిన నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. 111 పేజీలతో 11 ప్రశ్నలకు సమాధానం ఇస్తూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తమిళనాడుకు చెందిన పది బిల్లులను గవర్నర్ తొక్కిపట్టినప్పటికీ అవి ఆమోదం పొందినట్లు పరిగణిస్తున్నామని ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తీర్పును కేంద్ర ప్రభుత్వం సవాలు చేయకుండా మీకు ఆ అధికారాలు ఉన్నాయా చెప్పండంటూ సుప్రీంకోర్టును రాష్ట్రపతి ద్వారా న్యాయ సలహా కోరింది. దీనికి సమాధానంగా సుప్రీం... రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే చర్యలు న్యాయస్థానాల పరిశీలనకు అతీతం కాదని చెబుతూనే రాజ్యాంగ అధినేతలకు బిల్లుల ఆమోదం కోసం గడువు విధించడం సరైంది కాదని స్పష్టం చేసింది.

గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. అవి...

1) ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియజేయడం.
2) ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం.
3) బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం

ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. "బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు కానీ, ఆమోదాన్ని నిలిపివేసే సమయంలో కానీ గవర్నర్ తన సొంత విచక్షణ ప్రకారం వ్యవహరించవచ్చు. అలాంటి సమయాల్లో మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. అయితే, సుదీర్ఘకాలం వివరించలేని కారణాల వల్ల ఒక బిల్లుపై నిర్ణయం తీసుకోకపోతే సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవలసిందిగా కోర్టు గవర్నర్‌కు పరిమితమైన ఆదేశాలు జారీ చేయవచ్చు. 361 అధికరణ కింద వారికి రక్షణ కవచం ఉన్నప్పటికీ సుదీర్ఘమైన ఆలస్యం జరిగినప్పుడు హేతుబద్ధమైన సమయంలో బిల్లులను ఆమోదించేందుకు, తిరిగి పంపేందుకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చు. తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. అయితే, ఒక బిల్లుకు ఆమోదం సుదీర్ఘ కాలం తెలపకపోతే దాన్ని ఆమోదించినట్టు భావించాల్సిందేనన్న వైఖరిని రాజ్యాంగం అనుమతించదు. అలాంటి పెండింగ్ బిల్లులను ఆమోదించినట్టే భావించాలని ఆర్టికల్ 142ను అనుసరించి న్యాయస్థానం చెప్పడం కుదరదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చు" అని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. చట్టసభల ద్వారా నియమితులైన మంత్రివర్గం డ్రైవింగ్ సీటులో కూర్చోవాలనే విషయంలో సుప్రీంకోర్టుకు భిన్నాభిప్రాయమేమీ లేదని చెప్పింది.

రాష్ట్రపతి ప్రశ్నలు- సుప్రీంకోర్టు సమాధానాలు

1) గవర్నర్ దగ్గరకు బిల్లు వచ్చినపుడు ఆయన ముందు ఉండే ఆప్షన్లు ఏమిటి?

ఆమోదించవచ్చు. రాష్ట్రపతి పరిశీలనకు పంపొచ్చు. నిలిపి ఉంచవచ్చు. నిలిపి ఉంచితే ఆర్టికల్ 200లో చెప్పినట్లు తన సూచనలతో తప్పనిసరిగా శాసనసభకు పంపాలి. శాసనసభకు పంపడం అనేది మరో ఆప్షన్ కాదు. నిలిపిఉంచడంలో భాగమే. శాసనసభకు పంపితేనే నిలిపి ఉంచడానికి హేతువు లభిస్తుంది. కాబట్టి ఆమోదించకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదు. శాసనసభకు పంపాల్సిందే. పంపకపోవడం సమాఖ్య వ్యవస్థను కించపరచడమే అవుతుంది. సభకు పంపకుండా గవర్నర్ దగ్గర పెట్టుకోవచ్చు అని కేంద్ర ప్రభుత్వం వాదించింది కానీ దాన్ని తిరస్కరిస్తున్నాం. అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపితే గవర్నర్ తప్పనిసరిగా ఆమోదించాల్సిన పనిలేదు. కానీ, తన దగ్గర ఉంచుకోవడం కుదరదు. రాష్ట్రపతి పరిశీలనకు పంపొచ్చు.

2) గవర్నర్ బిల్లుపై నిర్ణయం తీసుకొనే సమయంలో మంత్రిమండలి సలహాకు కట్టుబడాలా?

సాధారణంగా మంత్రిమండలి సలహా మేరకు నడచుకోవాలి. అయితే, ఆర్టికల్ 200 కింద గవర్నర్‌కు విచక్షణాధికారం ఉంది. అందులో రెండో విభాగంలో "ఆయన అభిప్రాయంలో" అనే ప్రస్తావన ఉంది. కాబట్టి ఒక బిల్లును తిరస్కరించే అధికారం, రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్‌కు ఉంది.

3) గవర్నర్ ఆర్టికల్ 200 కింద విచక్షణ అధికారాన్ని ప్రదర్శించడాన్ని కోర్టులు విచారించగలవా?

లేదు. ఆ విచక్షణాధికారాన్ని న్యాయస్థానాలు విచారించలేవు. తీసుకున్న నిర్ణయాల మంచీచెడును సమీక్షించలేవు. కానీ, సుదీర్ఘకాలం లేదా చెప్పుకోదగ్గ కారణం లేకుండా నిరవధికంగా ఎలాంటి చర్య లేకుండా బిల్లును దగ్గర పెట్టుకుని కూర్చుంటే కోర్టులు తమ అధికారాలను ఉపయోగించి పరిమిత ఆదేశాలు(మాండమస్) జారీ చేయవచ్చు. ఆర్టికల్ 200 కింద విధులు నిర్వర్తించమని గవర్నర్‌కు చెప్పొచ్చు. తగినంత సమయంలో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయవచ్చు. ఆ క్రమంలో ఆయన విచక్షణాధికారాల వినియోగంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయరాదు.

4) ఆర్టికల్ 200 కింద గవర్నర్ల అధికారంపై న్యాయసమీక్ష విషయంలో కోర్టులకు ఆర్టికల్ 361 శిరోధార్యమా?

అవును. గవర్నర్లు, రాష్ట్రపతి తమ విధుల నిర్వహణలో కోర్టులకు జవాబుదారీ కాదు అని చెబుతున్న ఆర్టికల్ 361 కోర్టులకు శిరోధార్యం. కానీ, గవర్నర్లు ఆర్టికల్ 200 కింద నిర్ణయం తీసుకోవడంలో సుదీర్ఘంగా ఏ చర్యా లేకుండా ఉంటే కోర్టులకు ఉన్న పరిమిత న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించుకోకుండా ఈ 361 ఆర్టికల్ అడ్డుకోలేదు. విధుల నిర్వహణలో గవర్నర్‌కు వ్యక్తిగతంగా రక్షణ ఉంటుంది కానీ ఆయన కార్యాలయం కోర్టు విచారణ పరిధిలోనే ఉంది.

5) గవర్నర్ల విధుల నిర్వహణలో రాజ్యాంగంలో ఎలాంటి కాలపరిమితి లేనపుడు కోర్టులు తీర్పుల ద్వారా కాలపరిమితి నిర్ణయించవచ్చా? అధికారాలను ఎలా ఉపయోగించాలో చెప్పొచ్చా?

6) ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి అధికారాల వినియోగం మీద కోర్టులు తీర్పులు ఇవ్వొచ్చా?

7) రాష్ట్రపతి అధికారాల వినియోగానికి సంబంధించి రాజ్యాంగంలో గడువులు కానీ, ఎలా చేయాలో కానీ చెప్పనపుడు కోర్టు తీర్పుల ద్వారా రాష్ట్రపతికి నిర్దేశించవచ్చా?

(మూడు ప్రశ్నలకు ఒకే సమాధానం) ఆర్టికల్ 200, 201 రూపొందించిన విధానాన్ని చూస్తే రాజ్యాంగాధిపతులకు నిర్ణయాలు తీసుకోవడంలో పరిస్థితులను బట్టి ఎక్కువ సమయం తీసుకొనే వెసులుబాటు కల్పించినట్లే భావించాల్సి ఉంటుంది. సమాఖ్య, ప్రజాస్వామ్య దేశంలో చట్టాలు చేసే క్రమంలో తలెత్తే భిన్న సందర్భాలను, పరిస్థితులు, పర్యవసానాలను దృష్టిలో పెట్టుకొని సమతూకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కోర్టులు నిర్దిష్టమైన గడువులు పెట్టడం రాజ్యాంగం జాగ్రత్తగా ఆలోచించి రాజ్యాంగాధిపతులకు కల్పించిన వెసులుబాటుకు వ్యతిరేకం. గవర్నర్లకైనా, రాష్ట్రపతికైనా అదే వర్తిస్తుంది. కోర్టులు తీర్పులు ఇవ్వజాలవు.

8) గవర్నర్లు బిల్లును పక్కనపెట్టినపుడల్లా లేదా రాష్ట్రపతి పరిశీలనకు బిల్లులు పంపినపుడల్లా రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టును న్యాయసలహా కోరాల్సి ఉంటుందా?

కోరాల్సిన అవసరం లేదు. కారణంపై రాష్ట్రపతి సంతృప్తి చెందితే చాలు.

9) గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయం తీసుకొనే దశలో ఉండగా బిల్లుపై కోర్టులు తీర్పులు చెప్పగలవా? చట్టం కాకముందే బిల్లులోని అంశాలపై కోర్టులు నిర్ణయాలు తీసుకోగలవా?

లేదు. చట్టం అమల్లోకి రావడానికి ముందు గవర్నర్లు, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలేవీ కోర్టుల పరిశీలన పరిధి లోకి రావు. చట్టంగా మారిన తర్వాత మాత్రమే కోర్టులో సవాలు చేయవచ్చు.

10) రాష్ట్రపతి, గవర్నర్లు జారీచేసే రాజ్యాంగబద్ధ ఆదేశాలకు బదులుగా సుప్రీంకోర్టు ఆర్టికల్ 142 కింద ఆదేశాలు జారీ చేయవచ్చా?

కుదరదు. బిల్లులను నిర్దిష్ట గడువులోగా తేల్చకపోతే ఆమోదం పొందినట్లుగా భావించాలని ఆదేశించే అధికారం ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టుకు లేదు.

11) గవర్నర్ ఆర్టికల్ 200 కింద ఆమోదం తెలపకుండా అసెంబ్లీ ఆమోదించిన బిల్లు చట్టం అవుతుందా?

పదో ప్రశ్నకు సమాధానంలోనే ఈ విషయం ఉంది. గవర్నర్ ఆర్టికల్ 200 కింద ఆమోదం తెలపకుండా శాసనసభ ఆమోదించిన బిల్లు చట్టం కాబోదు. ఈ ఆర్టికల్ కింద గవర్నర్ అధికారాలను మరో రాజ్యాంగ వ్యవస్థ నెరవేర్చే అవకాశం లేదు.

12) ఏదైనా కేసును విచారిస్తున్నపుడు రాజ్యాంగ నిబంధనలకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని గ్రహిస్తే తీర్పు ఇవ్వకుండా ఆర్టికల్ 143(3) కింద ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాల్సిన బాధ్యత సదరు బెంచ్‌కు లేదా?

న్యాయసలహా కోరిన అంశం పరిధిలోని ప్రశ్న కాదు.

13) ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టుకు సంక్రమించిన అధికారాలు కేవలం ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టం అమలయ్యేలా చూడటానికి మాత్రమేనా లేక రాజ్యాంగంలోని నిబంధనల అమలు పద్ధతికి వ్యతిరేకంగా కూడా ఆదేశాలు ఇవ్వవచ్చా?

పదో ప్రశ్న సమాధానంలో దీనికి సమాధానం ఉంది.

14) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమస్య వచ్చినపుడు ఆర్టికల్ 131 కింద ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ హోదాలో సుప్రీంకోర్టు విచారించగలదు. ఇంకా ఏఏ అంశాల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమస్యల్లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోగలదు?

అప్రస్తుతం కాబట్టి సమాధానం ఇవ్వడం లేదు.


తీర్పు రాసిందెవరు?

రెండు రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురువారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు ఇచ్చినప్పటికీ తీర్పు రచయిత ఎవరో పేర్కొనలేదు. ఇలా చేయడం అసాధారణం. 2019లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం అయోధ్య తీర్పు ఇచ్చినపుడు కూడా అందులో తీర్పు రచయిత పేరు పేర్కొనలేదు. శైలిని బట్టి న్యాయకోవిదులు అందరూ ఇది జస్టిస్ డీవై చంద్రచూడ్ తీర్పు కాపీయేనని అంచనా వేశారు.

నేపథ్యం

తమిళనాడుకు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. ఆయన మాత్రం బిల్లులను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది.

లోకం తీరు



ఇకపై అంతటా ఆధార్!

- సినిమాహాళ్లు, సభలు, ఆఫీసులు.. ఎక్కడికెళ్లినా గుర్తింపు తనిఖీ
- 'ఆఫ్‌లైన్ ఆధార్'పై కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ, నవంబరు 20: ఇకపై సినిమా చూడటానికి హాల్లోకి వెళ్తున్నప్పుడు థియేటర్ సిబ్బందికి టికెట్ మాత్రమే చూపిస్తే సరిపోదు.. మీ ఆధార్‌ను కూడా అక్కడున్న యంత్రంలో ధ్రువీకరించాల్సి ఉంటుంది. థియేటర్ మాత్రమే కాదు.. ఏదైనా హోటల్‌కు, సభకు వెళ్లినా, ఏదైనా గేటెడ్ కమ్యూనిటీలో ఎవరినైనా కలవటానికి వెళ్లినా, కాలేజీకి, ఆఫీసుకు వెళ్లినా ఇదే పరిస్థితి ఎదురుకావచ్చు. ఎందుకంటే, ఆధార్ వినియోగాన్ని విస్తృతపరిచేలా 'ఆఫ్‌లైన్ ఆధార్' అనే కొత్త సదుపాయాన్ని తీసుకురావాలని కేంద్రప్రభుత్వం కసరత్తు జరుపుతోంది. ఈ మేరకు ఆధార్‌ను పర్యవేక్షించే యూఐడీఏఐ ఓ కొత్త యాప్‌ను రూపొందిస్తోంది. ప్రస్తుతం దీనిపై తుదిదశ పరీక్షలు జరుగుతున్నాయని, యాప్‌ను నియంత్రించే నిబంధనల రూపకల్పన మీద కూడా కసరత్తు జరుగుతోందని సంబంధిత అధికారులు వెల్లడించారు. మరికొన్ని నెలల్లో ఈ యాప్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆఫ్‌లైన్ ఆధార్ అమల్లోకి వస్తే.. ఇప్పటిలాగా ఆధార్ కార్డునో, జిరాక్స్ కాపీనో చూపించాల్సిన అవసరం ఉండబోదని, క్యూఆర్ కోడ్ తరహాలో ధ్రువీకరిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. యూఐడీఏఐ సర్వర్‌తో అనుసంధానం కాకుండానే ఆఫ్‌లైన్ ఆధార్ పని చేస్తుందన్నారు. పూర్తి సాంకేతిక వివరాలు మాత్రం ప్రస్తుతానికి వెల్లడి కాలేదు. మనీకంట్రోల్ అనే వెబ్‌సైట్ ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. అయితే, నిత్యజీవితంలో అడుగడుగునా గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సిన పరిస్థితి వస్తే వ్యక్తిగత స్వేచ్ఛ మాటేమిటన్న ప్రశ్న ముందుకొచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. కాగా, దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక 16 ఏళ్ల బాలుడి ఆత్మహత్య

- ముగ్గురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలంటూ సూసైడ్ నోట్
- ప్రిన్సిపల్, ముగ్గురు టీచర్ల సస్పెన్షన్

న్యూఢిల్లీ, నవంబరు 20: బడిలో ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక ఓ విద్యార్థి మెట్రో స్టేషన్‌పై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఢిల్లీలో ఈ విషాద ఘటన జరిగింది. మృతుడు 16 ఏళ్ల విద్యార్థి శౌర్యా పాటిల్. ఢిల్లీలోని సెయింట్ కొలంబియా అనే ఓ కార్పొరేట్ స్కూల్లో చదువుతున్నాడు. ఏడాది క్రితం శౌర్య వేదిక మీద నృత్యాన్ని సాధన చేస్తుండగా పట్టుతప్పి కింద పడిపోయి.. బాధతో విలవిల్లాడి రోదించాడు. అతడిని పైకి లేపి.. ఓదార్చాల్సిన స్థితిలో ఓ ఉపాధ్యాయుడు.. "ఎంత ఏడుస్తావో ఏడువు.. నాకేం బాధ లేదు" అని నిర్లక్ష్యంగా మాట్లాడాడు. అప్పట్నుంచి ఉపాధ్యాయులు అందరి ముందు అతడిని వెక్కిరిస్తూ తీవ్రంగా అవమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు.. బడికి వెళ్లి.. ప్రశ్నించినా యాజమాన్యం పట్టించుకోలేదు. మరోసారి వెళ్లి ప్రశ్నిస్తే.. వారిపై చర్యలు తీసుకోకపోగా "మీ అబ్బాయికి టీసీ ఇచ్చి పంపిస్తాం" అని బడి యాజమాన్యం ఉల్టా తీవ్రంగా హెచ్చరించింది. మంగళవారం బడి నుంచి ఇంటికి బయలుదేరిన శౌర్య, రాజేంద్ర ప్లేస్ మెట్రో స్టేషన్‌లో ఓ ప్లాట్‌ఫామ్‌పైకి ఎక్కి.. కిందకు దూకాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బడిలోని ముగ్గురు ఉపాధ్యాయులే తన చావుకు కారణం అని సూసైడ్ నోట్ రాశాడు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి స్కూల్ ప్రిన్సిపల్, ముగ్గురు ఉపాధ్యాయులను యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఘటనపై అత్యున్నత స్థాయి విచారణకు ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకుగాను ఐదుగురు సభ్యులతో ప్రత్యేకంగా విచారణ కమిటీని ఏర్పాటు చేసింది.

'సర్'ను తక్షణమే ఆపండి

- ఈసీకి బెంగాల్ సీఎం మమత లేఖ

కోల్‌కతా, నవంబరు 20: పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(సర్) ప్రక్రియపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అస్తవ్యస్తంగా, బలవంతంగా జరుగుతున్న సర్ ప్రక్రియను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు గురువారం మూడు పేజీల లేఖ రాశారు. కనీస సన్నాహాలు, తగిన ప్రణాళిక లేకుండా అధికారులు, ప్రజలపై సర్‌ను బలవంతంగా రుద్దడం తగదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వరి కోతలు, రబీ సాగు పనుల కోసం రాష్ట్రంలోని లక్షలాది రైతులు, వ్యవసాయ కూలీలు ప్రస్తుతం రోజంతా పొలాలకే పరిమితం అవుతున్నారని పేర్కొన్నారు. సర్ విధులు నిర్వర్తించే బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్)లకు తగిన శిక్షణ ఇవ్వకపోవడం, గుర్తింపు పత్రాల విషయంలో గందరగోళం నెలకొనడం మొత్తం ప్రక్రియకు ఇబ్బందిగా మారిందన్నారు. బెంగాల్‌లో సర్ నిర్వహణకు ఇది తగిన సమయం కాదని ఆమె పేర్కొన్నారు.

భారత్‌కు ఎస్‌యూ-57 ఫైటర్ సాంకేతికత!

- పూర్తిస్థాయిలో టెక్నాలజీ బదిలీకి రష్యా సుముఖత

న్యూఢిల్లీ, నవంబరు 20: త్వరలో భారత వైమానిక దళ సామర్థ్యం ద్విగుణీకృతం కానుంది. రష్యా అభివృద్ధి చేసిన అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ 'ఎస్‌యూ-57' భారత సైన్యానికి అందేందుకు రంగం సిద్ధమవుతోంది. రష్యాలో ఈ ఫైటర్లను ఉత్పత్తి చేసి సరఫరా చేయడంతోపాటు భారత్‌లోనూ ఉత్పత్తి చేసుకునేందుకు వీలుగా 'ఎస్‌యూ-57' ఫైటర్ల పూర్తిస్థాయి సాంకేతికతను భారత్‌కు అందించేందుకు రష్యా సిద్ధమైంది. దుబాయ్‌లో జరుగుతున్న ఎయిర్‌షో-2025లో ఈ దిశగా స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. రష్యా రక్షణ రంగ సంస్థ రాస్‌టెక్ సీఈవో సెర్గీ చెమెజోవ్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్, రష్యా సుదీర్ఘకాలం నుంచి మంచి భాగస్వాములని.. భారత్‌పై ఆంక్షలు ఉన్న సమయంలో కూడా ఆ దేశ భద్రత కోసం రష్యా ఆయుధాలు సరఫరా చేసిందని చెప్పారు. ఇకపైనా ఈ బంధం అలాగే కొనసాగుతుందన్నారు. ఇక రాస్‌టెక్ సంస్థకు సంబంధించిన యుద్ధ విమానాలను తయారు చేసే సబ్సిడరీ సంస్థ 'యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ)' డైరెక్టర్ జనరల్ వాడిమ్ బడేఖా మాట్లాడుతూ.. ఎస్‌యూ-57 ఫైటర్లకు సంబంధించి భారత్ కోరుతున్న అన్ని అంశాల విషయంలో రష్యా సానుకూలంగా ఉందని, భారత అధికారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. రష్యా రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను పర్యవేక్షించే రాసోబొరాన్ ఎక్స్‌పోర్ట్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. ఎస్‌యూ-57లోని ఇంజన్లు, రాడార్లు, సాఫ్ట్‌వేర్లు, అత్యాధునిక ఆయుధాలకు సంబంధించిన సాంకేతికత కూడా భారత్‌కు బదిలీ అవుతుందని అని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతమున్న అత్యాధునిక ఐదోతరం యుద్ధ విమానాల్లో ఎస్‌యూ-57 కీలకమైనది. ఇలాంటి కీలక యుద్ధ విమానాలు భారత అమ్ములపొదిలో చేరితే.. మన రక్షణ మరింత బలోపేతం అవుతుందని నిపుణులు చెబుతున్నారు.



నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో యూపీ సీఎం యోగి, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్‌లతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నితీశ్ ప్రమాణస్వీకారోత్సవంలో బాబు, లోకేశ్

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బిహార్ సీఎంగా నితీశ్‌కుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హాజరయ్యారు. పట్నాలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, వివిధ రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలు పాల్గొన్నారు. యూపీ, మహారాష్ట్ర సీఎంలు యోగి ఆదిత్యనాథ్, దేవేంద్ర ఫడణవీస్‌ను చంద్రబాబు, లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్, బీజేపీ అగ్రనేత రవిశంకర్ ప్రసాద్, బిహార్‌కు చెందిన పలువురు ఎన్డీయే నేతలతోనూ వారిరువురూ సమావేశమయ్యారు. బిహార్ ఎన్నికల్లో లోకేశ్ ఎన్డీయే తరఫున ప్రచారం చేసిన విషయం తెలిసిందే. ఆయన్ను చూసి పలువురు ఎన్డీయే నేతలు.. 'లుక్ మారింది.. బాగా సన్నబడ్డారు.. ఏం డైట్ ఫాలో అవుతున్నారు? వ్యాయామాలేం చేస్తున్నారు?' అంటూ వాకబు చేశారు.

విదేశీ నిపుణులను ఆహ్వానిస్తా!

- వారు అమెరికన్లకు మెళకువలు నేర్పాలి
- విదేశీ నిపుణుల విషయంలో 'మాగా' మద్దతుదారుల ఆగ్రహాన్ని ఎదుర్కొనేందుకూ సిద్ధం
- అమెరికా-సౌదీ పెట్టుబడుల ఫోరంలో ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్, నవంబరు 20: విదేశీ ఉద్యోగుల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట మార్చారు. నిపుణులైన విదేశీ ఉద్యోగులను తాను ఆహ్వానిస్తానన్నారు. అలాంటి వారు చిప్‌లు, క్షిపణులు వంటి సంక్లిష్ట ఉత్పత్తులను ఎలా అభివృద్ధి చేయాలన్నది అమెరికా ఉద్యోగులకు నేర్పిస్తారని చెప్పారు. ఈ విషయంలో తన మద్దతుదారుల నుంచి కొంత ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని, దానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అమెరికా-సౌదీ పెట్టుబడుల ఫోరంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సులో సౌదీ అరేబియా రాజు మహ్మద్ బిన్ సల్మాన్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్-పాక్‌పై 350% సుంకాలు తప్పవని హెచ్చరించా

భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ మరోసారి చెప్పారు. యుద్ధాన్ని ఆపకపోతే ఇరుదేశాలపై 350% సుంకాలు విధిస్తానని, అమెరికాతో వాణిజ్యం లేకుండా చేస్తానని హెచ్చరించినట్లు తెలిపారు. యుద్ధాన్ని ఆపితే మంచి వాణిజ్య ఒప్పందం చేసుకుందామని చెప్పానన్నారు. అప్పుడు భారత ప్రధాని మోదీ తనకు ఫోన్ చేసి 'మేం యుద్ధానికి వెళ్లడం లేదు' అని చెప్పారని ట్రంప్ వెల్లడించారు.

వలసదారుల పాత్ర ఎనలేనిది: సుందర్ పిచాయ్

అమెరికా టెక్నాలజీ రంగం అభివృద్ధిలో వలసదారుల పాత్ర ఎనలేనిదని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అన్నారు. అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాల వ్యవస్థలో మార్పులు ప్రతిపాదించడంపై రాజకీయ దుమారం చెలరేగిన నేపథ్యంలో పిచాయ్ వ్యాఖ్య లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓ వార్తా సంస్థతో పిచాయ్ మాట్లాడుతూ.. "టెక్నాలజీ అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే.. వలసదారుల భాగస్వామ్యం అత్యద్భుతం" అని చెప్పారు. హెచ్-1బీ వ్యవస్థలో లోటుపాట్లు ఉంటే, సరిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాగా, న్యూయార్క్ నగర మేయర్‌గా ఎన్నికైన డెమొక్రటిక్ నేత జోహ్రాన్ మమ్దానీ శుక్రవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్నారు. శ్వేతసౌధంలో ఈ సమావేశం జరగనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

ఉక్రెయిన్‌లో శాంతికోసం.. ట్రంప్ 28 సూత్రాల ప్రణాళిక!

మూడేళ్లుగా యుద్ధంతో అట్టుడుకుతున్న ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈసారి 28 సూత్రాల శాంతి ప్రణాళికను రూపొందించారు. రష్యా కోసం ట్రంప్ నియమించిన ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, రష్యా దౌత్యవేత్త కిరిల్ దిమిత్రీవ్, ఉక్రెయిన్ అధికారుల మధ్య సంప్రదింపులతో సిద్ధం చేసిన ఈ ప్రణాళికను ట్రంప్ తాజాగా ఆమోదించినట్టు తెలిసింది. అమెరికా ఉన్నతాధికారులను ఉటంకిస్తూ సీఎన్ఎన్ సహా పలు అంతర్జాతీయ పత్రికలు దీనిపై కథనాలు ప్రచురించాయి. ఉక్రెయిన్ భూభాగాలను వదులుకోవడం నుంచి సైన్యాన్ని, ఆయుధాలను తగ్గించుకోవడం దాకా పలు కీలకమైన షరతులు ఈ శాంతి ప్రణాళికలో ఉన్నట్టు తెలిసింది.

నితీశ్ దశావతారం

- బిహార్ సీఎంగా పదోసారి ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్



నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ

పట్నా, నవంబరు 20: బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ పదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. పట్నా గాంధీ మైదానంలో గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ నితీశ్‌తో సీఎంగా, బీజేపీకి చెందిన సమ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలతో డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేయించారు. బీజేపీకి చెందిన మొత్తం 14మంది, జేడియూకు చెందిన 8 మంది, ఎల్‌జేపీ నుంచి ఇద్దరు, హిందూస్థాన్ అవామ్ మోర్చా, ఆర్ఎల్ఎం నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణం చేశారు. వాస్తవానికి ఆర్ఎల్ఎం తరఫున ఆ పార్టీ అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహ భార్య స్నేహలత మంత్రిగా ప్రమాణం చేస్తారని ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా ఎమ్మెల్యేగా కానీ, ఎమ్మెల్సీగా కానీ ఎన్నిక కాని దీపక్ ప్రకాశ్ (ఉపేంద్ర కుష్వాహ కుమారుడు) మంత్రిగా ప్రమాణం చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. భారీ జనసందోహం సాక్షిగా సాగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఏపీ సీఎం చంద్రబాబు సహా పలువురు బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు. ప్రధాని మోదీ వేదికపై నుంచి తన కండువాను ఊపుతూ అభిమానులను ఉత్సాహపరిచారు. బిహార్‌లో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన సీఎంగా నితీశ్ మొత్తం 19 ఏళ్ల అధికారంలో కొనసాగారు. మరోవైపు కొత్తగా కొలువుతీరిన ప్రభుత్వానికి ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అభినందనలు తెలిపారు. కాగా, బిహార్ ఎన్నికల్లో ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తూ జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ పశ్చిమ చంపారన్ జిల్లాలోని గాంధీ ఆశ్రమంలో ఒకరోజు మౌనవ్రతం చేపట్టారు.

స్వర్ణ పతక విజేత శ్రేయసికి మంత్రి పదవి

2018 కామన్‌వెల్త్ గేమ్స్ షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణపతకం సాధించిన ఎమ్మెల్యే శ్రేయసి సింగ్ బిహార్ మంత్రిగా ప్రమాణం చేశారు. జముయ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తన ప్రత్యర్థి ఆర్జేడీ నేత షంషాద్ ఆలమ్‌ను ఆమె 54వేల ఓట్ల తేడాతో ఓడించారు. 2020లో బీజేపీలో చేరిన శ్రేయసి నాటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ నేత విజయ్ ప్రకాశ్‌పై గెలిచారు. తాజా ఎన్నికల్లోనూ గెలిచి యువ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

భారత్‌కు అమెరికా జావెలిన్ క్షిపణి

న్యూయార్క్/వాషింగ్టన్, నవంబరు 20: భారతదేశానికి 93మిలియన్ డాలర్ల (దాదాపు రూ.825 కోట్ల) విలువైన ట్యాంకు విధ్వంసక జావెలిన్ క్షిపణి వ్యవస్థ, ఎక్స్‌కాలిబర్ ప్రెసిషన్ గైడెడ్ ఆర్టిలరీ ప్రొజెక్టైల్స్, సంబంధిత రక్షణ పరికరాలను విక్రయించేందుకు అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భారత్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను ట్రంప్ 50శాతానికి పెంచిన తర్వాత.. అమెరికాతో మనదేశం కుదుర్చుకున్న అతిపెద్ద రక్షణ పరికరాల ఒప్పందం ఇదే. భారత్ రక్షణ సామర్థ్యాన్ని ఈ ఆయుధ విక్రయం మరింత మెరుగుపరుస్తుందని, ఇండో పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో శాంతి, రాజకీయ స్థిరత్వాలను కొనసాగించడంలో భారత్ ప్రధాన శక్తిగా కొనసాగడానికి ఉపకరిస్తుందని అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ ఆశాభావం వ్యక్తం చేసింది. మొత్తం 216 'ఎం982ఏ1 ఎక్స్‌క్యాలిబర్ టాక్టికల్ ప్రొజెక్టైల్స్', 100ఎఫ్‌జీఎం-148 జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత ప్రభుత్వం తమను అభ్యర్థించిందని ఆ ఏజెన్సీ వెల్లడించింది. వీటితోపాటు.. ప్రధాన రక్షణ పరికరాల కిందికి రాని పలు అనుబంధ ఉపకరణాలు, పోర్టబుల్ ఎలక్ట్రానిక్ ఫైర్ కంట్రోల్ సిస్టమ్స్ విత్ ఇంప్రూవ్డ్ ప్లాట్‌ఫామ్ ఇంటిగ్రేషన్ కిట్(ఐపీఐకే), ప్రైమర్లు, ప్రొపెల్లెంట్ చార్జెస్, అమెరికా ప్రభుత్వ సాంకేతిక సహాయం, సాంకేతిక సమాచారం, రిపేర్ అండ్ రిటర్న్ సేవలు, లాజిస్టిక్స్, ప్రోగ్రామ్ సపోర్ట్‌వంటివి కూడా ఈ అమ్మకంలో భాగమని పేర్కొంది. కాగా అమెరికా ఇచ్చిన ఎఫ్‌జీఎం-148 యాంటీ ట్యాంక్ జావెలిన్ క్షిపణుల సాయంతో.. ఉక్రెయిన్ సైన్యం రష్యా యుద్ధ ట్యాంకులను సమర్థంగా ధ్వంసం చేసింది. ఉక్రెయిన్‌వాసులు.. ఆ క్షిపణులను తమను రక్షించే దేవదూతలు అనే అర్థం వచ్చేలా 'సెంట్ జావెలిన్'గా వ్యవహరించడం ప్రారంభించారు. కెనడాకు చెందిన ఒక ఆర్టిస్టు 'సెంట్ జావెలిన్' చిత్రాన్ని రూపొందించి ఉక్రెయిన్‌వాసుల కోసం పది లక్షల డాలర్లకుపైగా విరాళాలు సేకరించాడు. దీని ప్రత్యేకత ఏమిటంటే.. ఇది ప్రపంచవ్యాప్తంగా దాదాపు 25 దేశాలు ఉపయోగిస్తున్న అత్యంత అధునాతనమైన యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్ సిస్టమ్. దీన్ని సైనికులు తమ భుజం మీద పెట్టుకుని శత్రు ట్యాంకుల పైకి ప్రయోగించవచ్చు. ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ సీకర్ అనే అత్యంత అధునాతన సెన్సర్ ద్వారా ఒక్కసారి లక్ష్యాన్ని లాక్ చేసి ట్రిగర్ నొక్కాక.. దీన్ని ట్రాక్ చేయాల్సిన అవసరం ఉండదు. మిసైల్ తన కెమెరా/సెన్సర్ల సాయంతో తానే లక్ష్యాన్ని వెంబడిస్తుంది.

పద్మావతి అమ్మవారి సేవలో రాష్ట్రపతి

రాత్రి తిరుమలలో బస, నేడు శ్రీవారి దర్శనం
అనంతరం హైదరాబాద్‌కు పయనం



తిరుమలలో పద్మావతి అతిథి గృహం వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, చైర్మన్ బీఆర్ నాయుడు, హోంమంత్రి అనిత

తిరుపతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం తిరుమల చేరుకున్నారు. శుక్రవారం ఆమె స్వామి వారిని దర్శించుకోనున్నారు. ప్రత్యేక విమానంలో సాయంత్రం 4.05 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర ప్రభుత్వం తరపున హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఐజీ రాజకుమారి, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి ద్రౌపది ముర్ము రోడ్డు మార్గాన 4.40 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం శాఖ మంత్రి అనిత, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు ఆమెను స్వాగతించారు. ఆలయ మహాద్వారం వద్ద అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభానికి ప్రదక్షిణలు చేసి నమస్కరించిన అనంతరం రాష్ట్రపతి అమ్మవారి సన్నిధికి చేరుకుని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆపై ఆలయ మండపంలో వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం పలికి అమ్మవారి శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఆలయంలో సుమారు 45 నిమిషాల పాటు గడిపిన రాష్ట్రపతి తిరుమల పద్మావతి అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆమెకు స్వాగతం పలికారు. ద్రౌపదీ ముర్ము రాత్రికి తిరుమలలోనే బస చేసి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తొలుత వరాహ స్వామిని ఆ తర్వాత శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. 11 గంటలకు తిరుమల నుంచి బయలుదేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు వాయుసేన విమానంలో హైదరాబాదు వెళతారు. రాష్ట్రపతి వెంట కుమార్తె, మనవడు, మనవరాలు ఉన్నారు.

పుణ్యక్షేత్రాల పేరుతో మోసం

» వారికి విరాళాలు ఇవ్వద్దు: టీటీడీ చైర్మన్

తిరుమల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మోసపూరిత ప్రచారంతో విరాళాలు సేకరిస్తున్న సంస్థలను ప్రోత్సహించవద్దని టీటీడీ చైర్మన్ భక్తులకు సూచించారు. తిరుమల, తిరుపతి, తిరుచానూరును 'పుణ్యక్షేత్రాలు'గా ప్రకటించాలనే డిమాండ్‌తో ఈ నెల 29న కార్యక్రమం నిర్వహిస్తున్నామంటూ విరాళాలు సేకరిస్తున్న సంస్థల ప్రచారాలకు మోసపోవద్దని గురువారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్, సేవ్ టెంపుల్స్.ఓఆర్జీ అనే పేర్లతో భక్తులను తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. వీరికి విరాళాలు ఇవ్వవద్దని కోరారు.

గ్రంథాలయ సంస్థలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా జేసీలు

అమరావతి: జిల్లా గ్రంథాలయ సంస్థలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా జాయింట్ కలెక్టర్లను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు నెలల పాటు లేదా చైర్మన్ల నియామకం అయ్యేవరకూ వీరు ఆ పదవిలో కొనసాగుతారని తెలిపింది.

ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలు వసూలు..

» కేసులో కి'లేడీ' అరుణకు బెయిల్ మంజూరు
» బెజవాడ కోర్టు ఉత్తర్వులు
» అయినా నెల్లూరు జైల్లోనే నిందితురాలు
» అక్కడి రెండు కేసుల్లో దొరకని బెయిల్

విజయవాడ/నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పోలీసు శాఖలో ఎస్‌ఐ పోస్టులు, మహిళా శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశచూపి.. పలువురి నుంచి రూ.లక్షలు వసూలు చేసిన కేసులో నెల్లూరుకు చెందిన కి'లేడీ' డాన్ నిడుగుంట అరుణకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి రాధిక గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని విజయవాడకు చెందిన వాసిరెడ్డి రమేశ్‌బాబు నుంచి అరుణ రూ.25 లక్షలు వసూలు చేసింది. కానీ ఇప్పించలేదు. దీంతో డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగిన రమేశ్‌బాబును బెదిరించింది. దీనిపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఒంగోలు జైల్లో ఉన్న ఆమెను పోలీసులు కొద్దిరోజుల కిందట పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని కొద్దిరోజుల క్రితం అరుణ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసింది. దానిపై ఇరుపక్షాల వాదనలు ముగియడంతో న్యాయాధికారి గురువారం తీర్పు వెలువరించారు. అయినా తక్షణమే ఆమె విడుదలయ్యే అవకాశం లేదు. ఎందుకంటే.. నెల్లూరు నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో తుపాకీతో ఓ వ్యక్తిని బెదిరించిన కేసు, వేదాయపాలెం పరిధిలో గంజాయి కేసుల్లో ఆమెకు ఇంకా బెయిల్ లభించలేదు. దీంతో రిమాండ్‌పై నెల్లూరు సెంట్రల్ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఖరీఫ్‌లో 14 వేల కోట్ల విలువైన ధాన్యం కొంటాం

» రైతులకు 5 గంటల్లోనే నగదు జమ
» 6.70 కోట్ల గోనె సంచులు సిద్ధం
» మిల్లు వద్ద 5 గంటల్లోపే అన్‌లోడ్ చేసే ఏర్పాటు
» తేమ శాతం విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు
» అధికారులకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచన



తెనాలి, నవంబరు 20: (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలోని రైతాంగం నుంచి రూ.14వేల కోట్ల విలువైన ధాన్యాన్ని కొనబోతున్నామని, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి కేవలం 5 గంటల్లోనే వారి ఖాతాల్లోకి డబ్బు జమ చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాక కూడా రైతులు కొందరు దళారులకు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకుంటున్న పరిస్థితులు కనిపించటంతో మంత్రి గురువారం కృష్ణ, గుంటూరు జిల్లాల్లో సుడిగాలి పర్యటనలో భాగంగా రైతులతో మాట్లాడారు. వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఎస్‌కేల దగ్గర వరకు వెళ్లకుండా వాట్సప్ ద్వారానే ధాన్యం అమ్ముకునేందుకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాన్ని వారికి వివరించారు. గత సీజన్‌లో కేవలం రూ.8,800 కోట్ల విలువైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశామని, ఈ సంవత్సరం దానిని రెట్టింపు చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం సాయంత్రం వరకు రూ.754.34 కోట్ల విలువైన 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పారు. దీనికి సంబంధించిన నగదును కేవలం 5 గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, రోజుకు మూడు దఫాలుగా లెక్కించి రైతులకు ధాన్యం డబ్బు అందిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గోతాలు, లేబర్, రవాణాకు సంబంధించిన మొత్తాలను గత ప్రభుత్వ కాలంలో లాగా దళారులు, మిల్లర్లకు కాకుండా నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తామన్నారు. ఈ ఖరీఫ్‌లో 6.32 కోట్ల గోనె సంచులు అవసరమని గుర్తిస్తే, 6.70 కోట్ల సంచులు సిద్ధం చేశామన్నారు. రైతు పొలం నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని మిల్లులకే పంపేలా నిర్ణయం తీసుకున్నామని, మిల్లు వద్దకు వెళ్లాక కచ్చితంగా 5 గంటల వ్యవధిలోనే అన్‌లోడ్ అయ్యేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఒకవేళ 5 గంటలకు మించి వాహనం నిరీక్షిస్తే వెంటనే జీపీఆర్‌ఎస్ ద్వారా తమ సెంట్రల్ కార్యాలయానికి మెసేజ్ వస్తుందని, దాని ఆధారంగా కారణాలు తెలుసుకుని వెంటనే అన్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో రైతుల ఇబ్బందులను గుర్తించి ఆర్‌ఎస్‌కేల దగ్గర, మిల్లుల దగ్గర కూడా ఒకే విధమైన తేమ కొలిచే యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిలో వ్యత్యాసం వస్తే, వెంటనే తమకు మెసేజ్ వచ్చేలా కూడా ఏర్పాట్లు చేశామని మనోహర్ తెలిపారు. రైతుల సంతృప్తే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, వారికి ఏ ఇబ్బంది వచ్చినా తెలియచేసేలా రాష్ట్రంలోని అన్ని ఆర్‌ఎస్‌కేల దగ్గర ఒక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామని, దాని ద్వారా అభిప్రాయాలను తమకు పంపొచ్చని పేర్కొన్నారు. రైతులు తీసుకొచ్చే ధాన్యం తేమ విషయంలో కేంద్రం 17 శాతం ఉండేలా షరతు పెట్టిందని, దానిని దాటకుండా రైతులు సహకరించాలని, ఒకవేళ కొద్ది వ్యత్యాసం ఉంటే వారిని తిప్పి పంపకుండా కొనుగోలుకు సహకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 28 తేదీ నాటికి తుఫాన్ హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం ఆలస్యం చేయకుండా కొనుగోలు చేసేందుకు యంత్రాంగం మొత్తం సిద్ధంగా ఉండాలని మంత్రి హెచ్చరించారు.

'సెన్‌యార్' తుఫాన్ ముప్పు!

24కు వాయుగుండంగా, 26కు తుఫాన్‌గా మారే చాన్స్

» రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం
» 29 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు
» కోతకు వచ్చిన పంటను భద్రపర్చుకోండి
» రైతులకు ఐఎండీ సూచన

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరి, పత్తి రైతుల్లో మరో తుఫాను గుబులు రేపుతోంది. గత నెల మొంథా తుఫాన్ నష్టం నుంచి ఇంకా తేరుకోకముందే మరో తుఫాన్ ముప్పు పొంచి ఉంది. తుఫాన్ ప్రభావంతో ఈనెల 26వ తేదీ నుంచి కోస్తా, రాయలసీమల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. గురువారం మలక్కా జలసంధి, దాని పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో శనివారం ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తర్వాత ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 24వ తేదీకల్లా వాయుగుండంగా మారి దక్షిణ బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. ఆ తదుపరి 48 గంటల్లో పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో తుఫాన్‌గా మారి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు రానున్నదని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. తుఫాన్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) సూచించిన 'సెన్‌యార్'గా నామకరణం చేయనున్నారు. ఈ విషయాన్ని ఐఎండీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. గురువారం నాటి వాతావరణ పరిస్థితుల మేరకు ఈనెల 24వ తేదీ నుంచి తమిళనాడులో వర్షాలు ప్రారంభమవుతాయి. ఈనెల 26వ తేదీ నుంచి 29 వరకు తొలుత రాయలసీమ, దక్షిణ కోస్తా, ఆ తర్వాత ఉత్తరకోస్తాలో వర్షాలు కురుస్తాయి. 26 నుంచి 29వ తేదీ వరకు పలుచోట్ల భారీ, అక్కడక్కడ అతి భారీవర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఎక్కువగా రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని కొన్ని మోడళ్లు, కోస్తా, రాయలసీమ మొత్తం వర్షాలు కురుస్తాయని మరికొన్ని మోడళ్లు అంచనా వేశాయి. ఈనెల 28వ తేదీన దక్షిణ కోస్తా, దానికి ఆనుకుని రాయలసీమ జిల్లాలు, 29న నెల్లూరు నుంచి కృష్ణా జిల్లా, రాయలసీమలోని అనేక జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. ఉత్తరాదిలో చలిగాలుల ప్రభావం, బంగాళాఖాతంలో ఉపరితల ఉష్ణోగ్రతల ప్రభావం తుఫాన్‌పై ఉంటుందని మరో వాతావరణ నిపుణుడు వివరించారు. తుఫాన్ కాకినాడ-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, అయితే సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, ఉత్తరాది నుంచి వీచే చలిగాలులు ప్రభావం చూపుతాయని, అప్పుడు తీరం దాటే ప్రాంతంలో మార్పులు ఉంటాయని తెలిపారు. కోస్తా, రాయలసీమల్లో అనేక ప్రాంతాలపై ప్రభావం ఉంటుందని స్పష్టం చేశారు. వరి, పత్తి ఇతర పంటల రైతులను ఐఎండీ అప్రమత్తం చేసింది. కోతకు వచ్చిన వరిని కోసి నూర్పించడం, కుప్పలు పెట్టుకోవడం చేయాలని సూచించింది. పొలాల్లో కుప్పలను భద్రపరుచుకోవాలంది. కాగా, వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ధాన్యం తడవకుండా సురక్షితం చేసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. కాగా బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు వీస్తున్నందున శుక్ర, శని వారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. శుక్రవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. గురువారం రాష్ట్రంలో చలి ప్రభావం కొనసాగింది. జంగమహేశ్వరపురంలో 14.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

గ్లోబల్ టాప్ యూనివర్సిటీల్లో వీఐటీ

» క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకుల విడుదల
» వీఐటీకి దేశంలో 7వ ర్యాంకు, ప్రపంచంలో 352వ ర్యాంకు

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్: సస్టైనబిలిటీ 2026'లో వేలూరులోని 'వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (వీఐటీ) దేశంలోనే 7వ ర్యాంకు సాధించగా, ప్రపంచవ్యాప్తంగా 352వ స్థానంలో నిలిచింది. పర్యావరణ ప్రభావ విభాగంలో వీఐటీ ప్రపంచ వ్యాప్తంగా 194వ ర్యాంకు సాధించడం ద్వారా మరింత ప్రత్యేకతను సంతరించుకుందని వీఐటీ వ్యవస్థాపకులు, చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "క్యూ ఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకుల్లో సుస్థిరత విభాగంలో- సమానత్వం, జ్ఞాన మార్పిడి, విద్య ప్రభావం, ఉపాధి, అవకాశాలు, ఆరోగ్యం, శ్రేయస్సు, పర్యావరణ స్థిరత్వం, పర్యావరణ విద్య, పర్యావరణ పరిశోధన, సామాజిక ప్రభావం అనే ఎనిమిది ప్రకియల్లో సంస్థలు అధ్యయనం చేయబడతాయి. ఇందులో వీఐటీ మొత్తంగా 74.9 స్కోరు సాధించి.. ప్రపంచవ్యాప్తంగా 352వ స్థానానికి, భారతీయ సంస్థల్లో 7వ స్థానానికి చేరుకుంది. విశ్వవిద్యాలయం ముఖ్యంగా సామాజిక ప్రభావం, పర్యావరణ ప్రభావం, పాలన అనే మూడు విభాగాల్లో అత్యుత్తమ పని తీరును ప్రదర్శించింది. పర్యావరణ ప్రభావంలో వీఐటీ 78.1 స్కోరు సాధించడం ముఖ్యమైన అంశం. ఈ విభాగంలో గణనీయమైన పురోగతిని సాధించి ప్రపంచవ్యాప్తంగా 194వ ర్యాంకును కైవసం చేసుకుంది. క్యూఎస్ వర్సిటీ 2026 ఎడిషన్ 106 దేశాలు, ప్రాంతాల నుంచి 2 వేలకు పైగా విశ్వవిద్యాలయాలను అధ్యయనం చేసింది. వీఐటీ సాధించిన అత్యధిక స్థిరత్వ ర్యాంకింగ్ అయిన గ్లోబల్ టాప్ 400లో స్థానం సంపాదించడం పర్యావరణ బాధ్యత, పరిశోధనా నైపుణ్యం, సామాజిక శ్రేయస్సు పట్ల మా నిరంతరం నిబద్ధతకు నిదర్శనం" అని విశ్వనాథన్ వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తారుమారైన న్యాయం

ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. వనశక్తి తీర్పుతో ప్రభుత్వం కుట్రలను సుప్రీంకోర్టు వమ్ముచేసిందని ఆర్నెల్లక్రితం ఆనందించిన వారికి ప్రస్తుత నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది. పర్యావరణచట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపట్టిన ప్రాజెక్టులకు వెనుకటి తేదీతో అనుమతులు ఇచ్చుకొనే విధానం చట్టపరంగా, నైతికంగా సరికాదన్న వనశక్తి తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం ఉపసంహరించుకుంది. అప్పట్లో వెలిబుచ్చిన అభిప్రాయాలు, చేసిన నిర్ధారణలకు పూర్తిభిన్నంగా నేడు సర్వోన్నత న్యాయస్థానం వ్యవహరించడం ఆశ్చర్యం.

మే 16నాటి వనశక్తి తీర్పు వెలువరించిన ధర్మాసనంలో ఒకరైన ఉజ్జల్ భుయాన్‌ను ప్రస్తుత త్రిసభ్యధర్మాసనంలో కొనసాగిస్తూ, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్, మరో న్యాయమూర్తి వినోద్ చంద్రన్‌లు ఈ ఉపసంహరణకు సిద్ధపడ్డారు. అప్పటి తీర్పును సమీక్షించాలనీ, కొట్టిపారేయాలని నలభైకి పైగా దరఖాస్తులు రావడంలో ఆశ్చర్యమేమీ లేదు. ప్రజల పేరిట కట్టే భారీ ప్రాజెక్టుల వెనుక ఏయే శక్తులుంటాయో, కనిపించని చేతులు ఎన్ని వుంటాయో తెలియనిదేమీ కాదు. నిర్మాణంలో ఉన్న, పూర్తయిన ప్రాజెక్ట్‌లకు గతంనుంచి పర్యావరణ అనుమతిని వర్తింపచేయడమేమిటో అర్థంకాదు. అటువంటి భావన చట్టవిరుద్ధమన్న అప్పటిమాటకే భుయాన్ ఇప్పుడూ కట్టుబడి, ఉపసంహరణ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకించినా, మిగతా ఇద్దరు జడ్జీల సానుకూల ఓటుతో అప్పటి తీర్పు వమ్ము అయిపోయింది. ప్రాజెక్టు కట్టేసి, ఆ తరువాత 'గ్రీన్' సిగ్నల్ పొందడంలో కనిపించని కుట్రలు ఎన్నో ఉన్నాయనీ, ఉంటాయనీ కోర్టుకు తెలుసు కనుకనే గతంలో ఆ ప్రక్రియను కాదన్నది. ముందు మీరు చేయదల్చుకున్న చేయండి, ఆ తరువాత అనుమతులు పొందండి అని పరోక్షంగా, నర్మగర్భంగా చెబుతున్న 2017నాటి వివాదాస్పద నోటిఫికేషన్‌ను, 2021నాటి ఆఫీస్ మెమోరాండంను కొట్టివేసింది. ఇవి ఒక అడ్డదారిని అధికారికంగా అనుమతించి, ప్రోత్సహిస్తున్నాయి కనుకనే కోర్టు కొట్టివేసింది. పర్యావరణహానిని నివారించేందుకు, మానవాళిని రక్షించేందుకు ఉద్దేశించిన చట్టాలతో ఇలా ఆడుకోవడం విషాదం.

ఈ పోస్ట్‌ఫ్యాక్టో అనుమతి విధానాన్ని నమ్ముకొని లబ్ధిపొందుతున్న శక్తులన్నీ ఆ తీర్పుకు వ్యతిరేకంగా మళ్ళీ కోర్టు మెట్లు ఎక్కడం సహజం. ఆ తీర్పుదెబ్బతో ఎన్నో ప్రాజెక్టులు కూలుతాయని, కష్టపడికట్టినవాటిని చేజేతులా నాశనం చేయడం సరికాదనీ, వేలాదికోట్ల ఆర్థిక నష్టాన్నే కాదు, ఏ పర్యావరణం కోసమైతే బాధపడుతున్నామో అదే పర్యావరణానికి మళ్ళీ కీడు జరుగుతుందని కూడా వీరంతా వాదించడం సహజమే. అయితే, ప్రస్తుత ధర్మాసనం ఈ వింతవాదనలన్నీ పరిగణనలోకి తీసుకుంది. పోస్ట్‌ఫ్యాక్టో అనుమతులను ప్రశ్నించని గత తీర్పులను ఉటంకిస్తూ ఇద్దరు సభ్యుల ధర్మాసనం వీటిని దృష్టిలోపెట్టుకోనందుకు తప్పుబడుతోంది. ఆర్నెల్లనాటి తీర్పు ఉనికిలో ఉన్న పక్షంలో 20వేల కోట్ల ప్రాజెక్టులను కూల్చవలసివస్తుందని తానూ బాధపడుతోంది. ఐదేళ్ళక్రితం సుప్రీంకోర్టు బెంచ్ ఒకటి ఒక కేసులో ఈ పోస్ట్ ఫ్యాక్టో పర్యావరణ అనుమతుల విధానం సరికాదని అంటూనే, అప్పటికే ఇచ్చిన అనుమతిని రద్దుచేయకుండా జరిమానాతో సరిపెట్టిందని కూడా ప్రస్తుత ధర్మాసనం గుర్తుచేస్తోంది. అసాధారణ సందర్భాల్లో ఈ తరహా అనుమతులు ఇవ్వొచ్చన్న తీర్పులనూ ప్రస్తావించింది. ఆర్నెల్లనాటి వనశక్తి కేసులో సైతం ద్విసభ్యధర్మాసనం భవిష్యత్తు ప్రాజెక్టులకు ఈ విధానాన్ని అమలుచేయవద్దని అన్నది తప్ప, ఇప్పటికే ఈ తరహా అనుమతులు పొందిన వాటిని నేలమట్టం చేయాలని ఆదేశించలేదు. కానీ, ఆ ఉత్తర్వులతో, సాంకేతిక కారణాలతో అనుమతులు పొందలేకపోయినవాటిని కాపాడేపేరిట ప్రస్తుత బెంచ్ మొత్తం తీర్పునే ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ఇకపై తప్పుడుతోవలో పోవద్దు అని విస్పష్టంగా చెప్పిన గత తీర్పును ప్రస్తుత ధర్మాసనం నిలబెడుతూనే, ఏయే ప్రాజెక్టులకు అసాధారణ సందర్భాలూ, అత్యవసర పరిస్థితులు వర్తిస్తాయో నిగ్గుతేల్చి వాటికే మినహాయింపులు ఇస్తే సరిపోయేది. చట్టవిరుద్ధమనీ, అక్రమమనీ అనుకున్నదానిని జరిమానాలతోనూ, మినహాయింపులతోనూ సక్రమం చేయడం సరికాకపోగా, మరింత అక్రమమే అవుతుంది.

నిబద్ధతకు మారుపేరు బుద్ధవరపు

నమ్మిన సిద్ధాంతాల కోసం తుదిశ్వాస వరకు నిలబడిన పత్రికా రచయిత బుద్ధవరపు వేంకటరత్నం (నవంబర్ 17, 1925 – నవంబర్ 9, 2025). స్వతంత్ర భారతదేశ తొలితరం తెలుగు పత్రికా సంపాదకులలో ఆయన ఒకరు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం సమీపంలోని నాయకంపల్లిలో పుట్టారు. సామర్లకోట, రాజమండ్రిలలో విద్యాభ్యాసం చేశారు. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదివినప్పుడు రచయితలు నండూరి రామ్మోహనరావు, కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం వారి సహాధ్యాయులు. 1940లో వేంకటరత్నం తరుణప్రాయంలోనే ఆరెస్సెస్ పట్ల ఆకర్షితులయ్యారు. ఆ కాలంలో నాగపూర్ నుంచి తెలుగు ప్రాంతానికి ప్రచారకులుగా వచ్చిన వీఎల్ దేశ్‌ముఖ్ ఉపన్యాసం విన్న వేంకటరత్నం స్వయంసేవక్‌గా, అటు తరువాత ప్రచారక్‌గా (1944) మారారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పనిచేసిన ఆయన 1948లో ఆర్ఎస్ఎస్ ఆశయాల వ్యాప్తి కోసం ఏర్పడిన 'జాగృతి' తెలుగు వారపత్రికకు వ్యవస్థాపక సంపాదకులు అయ్యారు. 1948 చివరలో ప్రారంభమైన జాగృతి తొలి సంచికతోనే నిషేధానికి గురైంది. గాంధీజీ హత్య నేపథ్యంలో ఆరెస్సెస్‌ను నిషేధించిన క్రమంలోనే ఆ సంస్థ ఆశయాల కోసం ఏర్పడిన జాగృతిని అప్పటి ప్రభుత్వం నిషేధించింది. అయితే నాటి కృష్ణా జిల్లా కలెక్టర్ క్రోంబితో వాదించి పత్రికను పునః ప్రారంభించడానికి అనుమతి తెచ్చుకున్నవారు వేంకటరత్నం. విజయవాడ కేంద్రంగా వెలువడిన జాగృతి కోసం ఆయనతో పాటు బండారు సదాశివరావు, విశ్వనాథయ్య తదితరులు పనిచేశారు.

గాంధీజీ హత్య తరువాత ఆరెస్సెస్ మీద తీవ్ర దుమారం మొదలయింది. అయితే అవన్నీ దుష్ప్రచారంలో భాగమని, గాంధీ హత్యకు ఆరెస్సెస్‌కు సంబంధం లేదని ప్రత్యేక న్యాయస్థానం తరువాత వెల్లడించింది. కానీ ఇంతలోనే ఎంతో



నష్టం జరిగింది. ఎందరో స్వయం సేవకులను జైళ్లకు పంపించారు. కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. ఈ దుష్ప్రచారాన్ని ఎదుర్కొనడానికి ప్రాంతీయ భాషలలో పత్రికలు ప్రారంభించాలని ఆరెస్సెస్ రెండో సర్ సంఘ చాలక్ గురూజీ (గోల్వాల్కర్) ఆశయం మేరకు కొన్ని పత్రికలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రధర్మ పత్రికకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, పాంచజన్య పత్రికకు అటల్ బిహారీ వాజపేయి అలా సంపాదకులుగా నియమితులయ్యారు. తెలుగు పత్రికకు బుద్ధవరపు నియమితులయ్యారు. వీరు ముగ్గురు సన్నిహితులు కూడా. 1948 నుంచి 1957 వరకు వేంకటరత్నమే జాగృతి సంపాదకులు.

వేంకటరత్నం కవి, కథకుడు, నవలా రచయిత, వ్యాసకర్త. గురూజీ ఆదేశం మేరకు ఆయన పత్రికా రచన కొత్తగా చేపట్టారు. గాంధీజీ హత్యానంతర పరిణామాలు, భారత్–పాక్ తొలి యుద్ధం, కాందిశీకుల సమస్యలతో నాటి సంక్షుభిత భారతం ఎలా ఉన్నదో జాగృతి నాటి సంచికలు ప్రతిబింబిస్తాయి. ఆ పరిణామాల మీద ఆయన ఇచ్చిన వివరాలు, విశ్లేషణలు ఎంతో లోతుగా కనిపిస్తాయి. ఆంధ్రరాష్ట్ర విభజన, ఆంధ్రప్రదేశ్ అవతరణ, భాషా ప్రయుక్త రాష్ట్రాలు, నిజాం పతనానంతరం తెలంగాణలో పరిస్థితులు వంటి వాటి గురించి ఆయన గొప్ప చారిత్రక దృష్టితో కథనాలు వెలువరించారు. సాహిత్యం వేంకటరత్నం అభిమానాంశం. చారిత్రక అంశాలే ఇతివృత్తంగా స్వయంగా కథలు రాయడమే కాకుండా, ఇతర రచయితల కథలను ఆయన విరివిగా ప్రచురించారు. జైసోమనాథ్ వంటి చారిత్రక నవలల అనువాదాలు కూడా ప్రచురించారు. జాతీయ అంతర్జాతీయ అంశాలపై చాలా మంది ప్రముఖుల వ్యాసాల అనువాదాలు కూడా ఆనాటి జాగృతిలో తరచుగా దర్శనమిచ్చేవి.

1960 దశకం నుంచి కరణీకం (యెర్రమిల్లి, తూర్పుగోదావరి జిల్లా) ఆరంభించి, 80 దశకంలో ఆ వ్యవస్థ రద్దయిన తరువాత హైదరాబాద్‌లో మళ్లీ పత్రికా రచయితగా జీవితం ఆరంభించారు. ఎందరో ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశారు. 2001లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఒక కాలు తొలగించారు, నాలుక కూడా తెగింది. దాదాపు రెండు దశాబ్దాలు మంచం మీదే ఉన్నా, ఏనాడూ నిరాశకు లోనవ్వలేదు. ఎవరు వచ్చినా జ్ఞాపకాలు పంచుతూ నిండు నూరేళ్ల జీవించారు.

● పి. వేణుగోపాలరెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్, జాగృతి పూర్వ సంపాదకుడు

(హైదరాబాద్ కాచిగూడలోని జాగృతి కార్యాలయంలో నేడు బుద్ధవరపు వేంకటరత్నం సంస్మరణ సభ)

పీకే: జీరో నుంచి హీరో కాగలడా?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

ఆధునాతన సామాజిక మాధ్యమాల యుగం మనది. మేధాపరమైన చర్చ కంటే– ఒక చిన్న, పదునైన సౌండ్‌బైట్ అత్యంత ప్రభావశీలంగా ఉంటుంది. కనుకనే బిహార్‌లో ఓట్ల లెక్కింపు రోజున, సంచలనాత్మక ఫలితాలపై నా వార్తా వ్యాఖ్య ప్రారంభమవనున్నదని సూచిస్తూ నేను చేసిన ఒక వ్యాఖ్యకు సంబంధించిన వీడియో క్లిప్ ఒకటి వెన్వెంటనే వైరల్ అయింది. బిహార్ ప్రజాస్వామ్య పోరులో హీరోగా ప్రభవించవలసిన జన్‌సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ జీరోగా ఉండిపోయాడనేదే నేను చేసిన వ్యాఖ్య. అవును, ఆ వ్యూహ శూరుడు విజయ శూన్యుడుగా మిగిలిపోయాడు మరి. 2014 సార్వత్రిక ఎన్నికలలో నరేంద్ర మోదీ ప్రచార వ్యూహాలను రచించి, పీకేగా భారతీయ జనతా పార్టీ శ్రేణులలో ఆదరాభిమానాలు పొందిన ప్రతిభాశాలి ప్రశాంత్ కిశోర్. మోదీ కొలువును వీడి, సొంత మార్గంలో ముందుకు సాగిన అదే పీకే, బిహార్‌లో తనకొక రాజకీయ భవిష్యత్తును నిర్మించుకునేందుకు తొలిసారి ప్రయత్నించి, ఘోరంగా విఫలమవడం బీజేపీ శ్రేణులను అమితంగా ఆనందభరితులను చేసింది. అదలావుంచితే పీకే పరాజయంపై నా వ్యాఖ్య ఆయన మద్దతుదారులకు ఏ మాత్రమూ నచ్చలేదు. నాపై కొండెత్తున మండిపడ్డారు. నేనా వ్యాఖ్యను ఎటువంటి దురుద్దేశంతోనూ చేయలేదు. ఇది స్పష్టం. పీకే అభిమానులు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. వివిధ పార్టీలకు ఎన్నికల వ్యూహాలను రూపొందించి, వాటి విజయాలకు కారకుడైన ఈ ప్రతిభాశాలి, రాజకీయ నాయకుడుగా పరిణమించిన తరువాత ఆయన భవిష్యత్తుపై మీడియాలో అనేక ఊహాగానాలు సాగాయి. అంతిమంగా బిహార్ ఓటర్లు తమ తీర్పు చెప్పారు: జన్‌సురాజ్ పార్టీ ఒక్క సీటూ గెలుచుకోలేదు. కేవలం 3.4 శాతం ఓట్లు మాత్రమే కైవసం చేసుకోగలిగింది. ఈ నేపథ్యంలో అడగవలసిన సమంజసమైన ప్రశ్న: ఎన్నికల రాజకీయాలలో ఆయనకు తొట్టతొలుతనే విజయం ఎందుకు లభించలేదు? రాజకీయ నాయకుడుగా భవిష్యత్తు లేని వ్యక్తి అని పీకే గురించి ఒక నిశ్చిత అభిప్రాయానికి రావడం సరైన విషయమేనా?

మన దేశంలో శీఘ్రంగా అధికారానికి రాగల ఒక కొత్త రాజకీయ పార్టీని నెలకొల్పడమనేది చాలా కష్టం. ఇటీవలి కాలంలో అటువంటి సాఫల్యాన్ని సాధించిన అసాధ్యుడు అరవింద్ కేజ్రీవాల్. ఆమ్ ఆద్మీ పార్టీని ప్రారంభించిన కొద్ది నెలల్లోనే ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించగలిగారు. ఆ తరువాత పంజాబ్‌లో సైతం తన పార్టీకి అధికారాన్ని సాధించగలిగారు. 'అవినీతిపై భారత్ పోరు' ఉద్యమంలో కీలక పాత్ర వహించడం ద్వారా ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీలో అధికారాన్ని సాధించుకున్నది. పంజాబ్‌లో అకాలీదళ్–బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనపై తీవ్ర అసంతృప్తికి లోనైన సిక్కు ఓటర్లు ఆమ్‌ఆద్మీ పార్టీకి పట్టంగట్టారు. పంజాబ్‌లో అధికారానికి వచ్చే నాటికే ఆమ్‌ఆద్మీ పార్టీ యశో కాంతులు మసకబారాయి. మరిన్ని రాష్ట్రాలలో ఆ పార్టీ విస్తరణ, అధికార సాధన అసాధ్యమైపోయింది. గత శతాబ్ది తుది దశకాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి రామారావు అనితర సాధ్యమైన రాజకీయ చరిత్ర సృష్టించారు. అదే కాలంలో అసోంలో వలసకారుల వ్యతిరేక ఉద్యమం నిర్వహించిన విద్యార్థులు 'అసోం గణ పరిషత్' అనే రాజకీయ పార్టీని స్థాపించి అధికారానికి వచ్చారు. అయితే వారి అధికార వెలుగులు ఎంతో కాలం ప్రకాశించలేదు.

ఆ తరహా విజయాలు సాధించడం ప్రశాంత్ కిశోర్‌కు అసాధ్యం. ఎందుకని? సామాజిక జీవితంలోను, రాజకీయ వ్యవహారాలలోను కుల అనుబంధాలే ప్రథమ గణ్యత పొందే బిహార్ ఆయన రాజకీయ కర్మక్షేత్రం కావడమే. 2024లో గాంధీ జయంతి రోజున జన్‌సురాజ్ పార్టీని నెలకొల్పిన క్షణం నుంచి 2025 అసెంబ్లీ ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసేదాకా ప్రశాంత్ కిశోర్ ప్రజల మధ్యే ఉంటూ వచ్చారు. బిహార్ నలుమూలలా పల్లె పల్లెనూ ఆయన సందర్శించారు. ప్రజలతో సంభాషిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వాటినెలా పరిష్కరిస్తుందో ఓటర్లకు ఓర్పుతో, నేర్పుగా వివరించారు. సకల సామాజిక వర్గాలకు ఆమోదయోగ్యమయ్యే రీతిలో జన్‌సురాజ్‌ను నిర్మించేందుకు ప్రాధాన్యమిచ్చారు.

నిజానికి ఆయన రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యూహాలను రూపొందించే వృత్తిలోనే కొనసాగి ఉంటే మరింతగా కోటీశ్వరుడు అయివుండేవారు. అయినా రాజకీయాలలోకి ప్రవేశించారు. వ్యక్తిగత ఆకాంక్ష, విజయగర్వాతిశయం, చిక్కులను ఎదుర్కొనే తెగువ.. కారణం ఏదైతేనేమి పీకే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అదీ ఒక అసాధారణ మార్గంలో. ఎనలేని ఆత్మవిశ్వాసంతో 'జన్‌సురాజ్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సాహసించారు. ఎంతో శ్రమించారు. ప్రజల ఆదరాభిమానాలను విశేషంగా సముపార్జించుకున్నారు. ప్చ్.. వాటిని ఓట్లుగా మార్చుకోవడంలో విఫలమయ్యారు. ఓట్లు డిజిటల్ విశ్వం నుంచి ఊడిపడవు. వీధులలో విశ్వసనీయత పొందితేనే అవి లభ్యమవుతాయి. అందుకు ప్రజల నమ్మకం పొందాలి. బహుజన్ సమాజ్ పార్టీని నెలకొల్పిన కాన్షీరామ్ శక్తిమంతుడు అయినప్పటికీ దేశ రాజకీయాలపై తనదైన ముద్ర వేసేందుకు ఆయనకు చాలా కాలం పట్టింది. ఆయన ఒకసారి సుప్రసిద్ధంగా ఇలా చెప్పారు: 'మొదటి ఎన్నికను ఓడిపోవడానికి పోరాడాను, ఇతరులను ఓడించడానికి రెండోదాన్ని పోరాడాను, మూడోది విజయం సాధించేందుకు పోరాడాను'. మంచి రోజుల్లోను, చెడ్డ రోజుల్లోను ఒక రాజకీయ పార్టీని నడిపే కష్టతరమైన కర్తవ్యాన్ని ఎలా నిర్వహించాలన్నదే కాన్షీరామ్ మాటల సారాంశం. బీఎస్పీ వ్యవస్థాపకుడు అభివృద్ధి పరిచిన కులాధారిత ప్రజాసమీకరణ వ్యూహాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రశాంత్ కిశోర్ ప్రయత్నించారు. అందుకు సామాజిక మాధ్యమాల్లో భారీ స్థాయిలో ప్రచారం చేయడం ద్వారా ఓటర్ల మద్దతును, ముఖ్యంగా బిహార్ సమాజంలో అత్యధిక సంఖ్యలో ఉన్న యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు పీకే ప్రయత్నించారు. ప్రశాంత్ కిశోర్ రాజకీయాల పట్ల అశేష జనులు ఆకర్షితులయ్యారు, సందేహం లేదు. అయితే ఆయనకు కులపరమైన గుర్తింపు లేదు. సంస్థాగత బలమూ లేదు. ప్రజల ఆదరాభిమానాలను మరింతగా సంఘటితం చేసుకునేందుకు అవసరమయ్యే పటిష్ఠమైన పార్టీ యంత్రాంగం ఆయనకు లేకపోయింది.

అరవింద్ కేజ్రీవాల్ తన పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు యువ స్వచ్ఛంద కార్యకర్తలపై ఆధారపడినట్లుగానే పీకే సైతం యువ కార్యకర్తల ఆలంబనతో జన్‌సురాజ్‌ను ఒక సువ్యవస్థిత రాజకీయ సంస్థగా నిర్మించేందుకు ప్రయత్నించారు. ఒక వ్యవస్థాగత వ్యతిరేకిగా ప్రజల మనసుల్లో నిలిచేందుకు ఆరాటపడ్డారు. బిహార్‌లో దశాబ్దాలుగా అధికారం చెలాయిస్తున్న నితీశ్‌కుమార్, లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తిని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు పీకే కృషి చేశారు.

> 2030లలో బిహార్ రాజకీయాలు నితీశ్–లాలూ అనంతర యుగంలోకి ప్రవేశిస్తాయి. ప్రత్యామ్నాయ నాయకత్వాలను అవి ఆశిస్తాయి. ప్రశాంత్ కిశోర్ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి తనను తాను పునరావిష్కరించుకోగలిగితే బిహార్ చరిత్రకు ఆయనే వేయగలిగే మార్గం ఒకటి తప్పకుండా ఉంటుంది.

పీకే తన విమర్శనాస్త్రాలను నితీశ్, లాలూ పార్టీలపై పెద్ద ఎత్తున ఎక్కుపెట్టారు. అయితే ఓట్ల సాధనలో వాటి శక్తి పరిమితమైనదే. బిహార్‌లో రెండు ప్రధాన కూటముల (ఎన్డీఏ, ఎమ్‌జీబీ)కు కలిపి మొత్తం ఓట్ల వాటా ఇంచుమించు 80శాతం మేరకు ఉన్నది. కులపరమైన అనుబంధాల ఆలంబనతోనే వాటికీ బలం చేకూరింది. మరి కొత్తగా ప్రవేశించిన రాజకీయ నాయకుడు ఎవరైనా నిలదొక్కుకోవాలంటే ఈ కులపరమైన అనుబంధాలను ఛేదించవలసి ఉన్నది. 'బిహార్ ఫస్ట్' అనే ఆకర్షణీయమైన నినాదం ఎంత మాత్రమూ పనిచేయదు.. ఎందుకని? బిహారీ ఉప జాతీయవాదం కంటే కుల గుర్తింపులు బలంగా ఉండడమే (బిహార్‌లో ఏకీకృత సాంస్కృతిక, భాషా గుర్తింపు లేదు. ఉమ్మడి గుర్తింపు భావాన్ని సృష్టించడానికి ఛత్ పూజ పండుగ లేదా మధుబని పెయింటింగ్‌ల వంటి సాంస్కృతిక చిహ్నాలను ప్రోత్సహించినా ఆశించిన ఫలితాలు సమకూరలేదు). ఓటు వేయవచ్చేసరికి ప్రతి బిహారీ కూడా కుల గుర్తింపునకు ప్రాధాన్యమివ్వడం పరిపాటి. ఎన్నికల ఫలితాలతో ప్రశాంత్ కిశోర్‌కు ఈ కఠోర వాస్తవం అవగతమయి ఉంటుంది.

'యువ' ఓటర్లే తాను ఆశిస్తున్న మౌలిక మార్పుకు దోహదం చేస్తారని ప్రశాంత్ కిశోర్ భావించారు. బిహార్ ఓటర్లలో 22శాతం మంది 18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసులో ఉన్నవారే. అయితే ఇంతకంటే చాలా పెద్ద సంఖ్యలో ఉన్న ఓటర్లు మహిళలు. మన ఎన్నికలలో జయాపజయాలకు వీరే నిజమైన నిర్ణయాత్మక శక్తులు అనడంలో అతిశయోక్తి లేదు. యువ ఓటర్లు ఆదాయ స్థాయి ప్రాతిపదికన చీలిపోయి వున్నారు. అయితే మహిళా ఓటర్లు నితీశ్ కుమార్‌కు అత్యంత విశ్వసనీయమైన మద్దతుదారులుగా ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితం తొలుత అధికారంలోకి వచ్చిననాటి నుంచి మహిళలకు ప్రాధాన్యమిస్తూ సంక్షేమ పథకాలే అందుకు ప్రధాన కారణమని మరి చెప్పనవసరం లేదు. మద్య నిషేధం ఎత్తివేత ప్రశాంత్ కిశోర్ ఇచ్చిన హామీలలో ఒకటి. దీనిపై పెద్ద చర్చే జరిగింది. గ్రామీణ మహిళా ఓటర్ల దృష్టిలో అది వివేకవంతమైన నిర్ణయం కాదు. మద్య నిషేధాన్ని మహిళా ఓటర్లు అందరూ సమర్థించారు. ఆర్థిక ప్రయోజనాల కంటే ప్రజారోగ్యం, శాంతిభద్రతలు మొదలైన అంశాలు ఎక్కువ ప్రభావం చూపాయి. బిహార్ గ్రామీణ ప్రాంతాలలో పర్యటించినప్పుడు యువజనులు పీకే గురించి విశేషంగా మాట్లాడుకోవడం గమనించాను. అయితే మహిళలు ఎవరూ ఆయన గురించి పట్టించుకున్నట్లు ఏ మాత్రం కన్పించలేదు. అంతిమంగా మహిళల ఓట్లే బిహార్ ఎన్నికలలో జయాపజయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేశాయి.

జన్‌సురాజ్ పరాజయంతో ప్రశాంత్ కిశోర్ రాజకీయ ప్రస్థానం ముగిసినట్టేనా? అవును, కాదు. అవును– పీకే బ్రాండ్ మీడియా ఆధారిత రాజకీయ మార్కెటింగ్‌కు పరిమితులు ఉన్నాయని స్పష్టమయింది. అయితే, రాబోయే దశకంలో బిహార్ రాజకీయాలు నితీశ్–లాలూ అనంతర యుగంలోకి నిలకడగా ప్రవేశించనున్నాయి. ప్రత్యామ్నాయ నాయకత్వాలను అవి ఆశిస్తాయి, అన్వేషిస్తాయి. ప్రశాంత్ కిశోర్ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి, బలమైన అట్టడుగు స్థాయి సంస్థాగత నిర్మాణం, విస్తృత సామాజిక సంఘీభావాన్ని కూడగట్టుకుని తనను తాను సర్వజనామోద నాయకుడుగా పునరావిష్కరించుకోగలిగితే బిహార్ చరిత్రకు ఆయనే వేయగలిగే మార్గం ఒకటి తప్పకుండా ఉంటుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఏఐతో భాషాభివృద్ధి సాధ్యమేనా?

ఏఐ అనేక సంచలనాలను సృష్టిస్తోంది. గణిత సమీకరణాలను పరిష్కరిస్తోంది. వ్యాసాలు రచిస్తోంది. సంగీత బాణీలు కడుతోంది. ట్యూటరుగా, అనువాదకునిగా... ఇలా ఎన్నో చేస్తున్నది. అనువాద ప్రక్రియను టెక్నాలజీ చాలా సులువు చేసింది. ఒక భాషలోని ఉత్తరాన్నో, వ్యాసాన్నో తప్పులు లేకుండా కేవలం క్షణాల్లోనే మరో భాషలోకి ఏఐ అనువదిస్తుంది. విషయం కచ్చితంగానే అనిపించినా, పేలవంగా ఉంటుంది. అనువాదం అంటే ఒక భాష నుంచి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు, విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం.

అందుకే భాష భిన్నమైనదని భాషావేత్తలు చెబుతారు. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు ఉంటాయి. కొన్నిసార్లు ఎదుటివారికి మన ఆలోచనలు చెప్పడంలో తడబడతాం. ఆ తప్పులను జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవన్నీ భాష నేర్చుకోవడంలో మెళకువలే. ఇవి మనలో విశ్వాసాన్ని పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఏ యాప్‌లు, చాట్‌బాట్‌లు మనకు ఈ సజీవ శిక్షణ అందించగలవు? సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. యాస, మర్యాదపూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో మారుతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ అదేమీ మనిషి కాదు కదా! వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం, నిరంతర తర్ఫీజు... ఇదే భాషా ప్రావీణ్యతకు నిజమైన సాధనా మార్గం.

— వి. వరదరాజు, శ్రీకాకుళం

నోటు ఓటు వాపసీ!

ఎన్నికలలో ఓటు కొనడానికి రాజకీయ పార్టీలు డబ్బు పంచటం మామూలే. తాము డబ్బు ఇచ్చినా ఆ ఓటరు పోలింగ్ బూత్‌కు వచ్చి అసలు ఓటే వేయలేదని నిర్ధారించుకున్న తర్వాత రాజకీయ పార్టీలు ఇప్పుడు ఓటరును డబ్బు వాపస్ చేయాలని కూడా అడుగుతున్నాయట. ఇదొక వింత పరిణామం. సరే బావుంది. అలాంటపుడు అవే రాజకీయ పార్టీలు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అవుతున్నాయి కదా, మరి ఓటర్ ఎందుకు తన ఓటును వాపస్ చేయాలని అడగకూడదు? పార్టీలు డబ్బును రీకాల్ చేస్తున్నపుడు ప్రజలు ఓటును కూడా రీకాల్ చేయాలి. ఘర్ వాపసీ, అవార్డు వాపసీ లాగా ఓట్ వాపసీ ఎందుకు ఉండదు?

ఈ ప్రజాస్వామ్య వాణిజ్యం ఇప్పటివరకూ చాలా విచిత్రాలను చూసింది. ఒక్కరికే ఓటు వేయగలనన్న సంగతి తెలిసి కూడా ఓటరు అభ్యర్థులందరి దగ్గర నుంచి డబ్బు తీసుకోవడం తెలిసిందే. మాకు ఫలానా అభ్యర్థి తాలూకు డబ్బురాలేదని టెంట్లు వేసి ధర్నాలు చేసిన మహా గొప్ప సందర్భాలూ తెలుసు. ఏకంగా అభ్యర్థుల ఇంటి మీద దాడులు చేసి డబ్బు డిమాండ్ చేసిన ఉదాహరణలూ ఉన్నాయి. ఈ వాణిజ్య పొలిటికల్ సెన్సెక్స్‌లో గత పాతికేళ్లలో షేర్ విలువ ద్రవ్యోల్బణం కంటే అతివేగంగా రెండు వందల రూపాయల నుంచి మూడు వేలకు పెరిగింది.

> ...ఇదంతా అనేకానేక అనైతికతల మధ్య ఘర్షణ. ఓటు అమ్ముకోవడం ఒక అనైతికత. ఓటు కొనడం మరో అనైతికత. ఓటు అమ్ముకుని అసలు బూత్‌కి వెళ్లకపోవడం మరింకో అనైతికత. ఓటు వేయనేలేదు కనుక డబ్బు తిరిగివ్వమనడం ఇంకింకో అనైతికత. ఇన్ని అనైతికతల నడుమ పరస్పర ఘర్షణలో ఓటమి మాత్రం ప్రజాస్వామ్యానిది. కాదు కాదు ప్రజలదే.

ఈ నేపథ్యంలో మనం రెండు వర్తకాల గురించి మాట్లాడుకుందాం. ఒకటి చట్ట విరుద్ధం, మరొకటి నైతిక విరుద్ధం. ప్రజాస్వామ్యం గురించి వాణిజ్య భాషలో మాట్లాడుకోవల్సి రావడం విషాదమే. ఇప్పుడు ఓటరుకూ రాజకీయానికీ మధ్య ఈ–కామర్స్ పాలసీ నడుస్తోంది. డబ్బు తీసుకున్న ఓటర్లు పోలింగ్ బూత్‌కి వెళ్లలేదు, ఓటు వేయలేదు. అంటే, "ప్లేస్ చేసిన ఆర్డర్ డెలివరీ కాలేదు" అన్నట్టే. దాంతో పార్టీలు, "సార్, మా పార్టీ వాల్యూకి డబ్బు ఇచ్చాం, మీరు సర్వీస్ తీసుకోలేదు, కాబట్టి మా అమౌంట్ పే బ్యాక్ ఇవ్వండి" అంటున్నాయి. నవ్వొచ్చే ధర్మం కదూ! ఇదంతా వింటుంటే ప్రజాస్వామ్యం కాదు, ఒక చీకటి వర్తకం జరుగుతున్నట్లు అనిపిస్తోంది కదూ! ఓటుకు ధర, వాగ్దానానికి విలువ ప్రజాస్వామ్యంలో 'నో రిటర్న్' పాలసీ అయ్యాయా?

ప్రజాస్వామ్యం అంటే అమ్మకం– కొనుగోలు కాదు, పరస్పర నమ్మక అలిఖిత ఒప్పందం. ఓటుకు డబ్బు పంచడం చట్టవిరుద్ధం. హామీలు నెరవేర్చకపోవడం చట్టపరంగా తప్పు కాకపోయినా నైతిక నేరం. రాజకీయ పార్టీలు డబ్బు ఇచ్చి ఓటును కొనాలనుకోవడం ఎంత తప్పో, ప్రజలను మభ్యపెట్టి మాయ చేసి ఓటు పొందడం కూడా అంతే తప్పు. ఓటు ఆశ చూపి నగదు చేసుకోవడం అంతకంటే ఎక్కువ తప్పు. ఇక్కడే డ్యూయల్ ట్రేడింగ్ నడుస్తోంది. ఓటరు తన ఓటుకు ముడుపు తీసుకుని అదే ఓటును ముడుపుగా చెల్లించి తనకు కావల్సిన ప్రజాస్వామిక సౌకర్యాలను లబ్ధిగా పొందాలనుకుంటున్నాడు. డబ్బు రిఫండ్ సరే, వాగ్దానాల రిఫండ్ ఎక్కడ?

ఓటును కొనేవాళ్లా? ఓటును అమ్ముకునే వాళ్లా? ఎవరు ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోంది అనే ఒక కీలక ప్రశ్న ఇక్కడే ఎదురవుతోంది. ఇప్పటికే పాతాళం ఎక్కడ అంటే పైకి చూపించేంత దిగువన ఉన్నాం. ఇంకా ఏ లోతులకీ దిగజారుడు? రాజకీయ మార్కెట్లో పార్టీలు ఎప్పుడూ ఆఫర్లు ఇస్తూనే ఉంటాయి. పార్టీ మేనిఫెస్టోలు ఓటర్ల హక్కుల పత్రాలు కాదు, సీజనల్ బ్రోచర్లు. అందులో హామీలన్నీ "కొనండి సార్, తర్వాత చూస్తాం" అంటున్నాయి.



నిజానికి డబ్బు తీసుకున్న ఓటరే పాక్షిక నీతిమంతుడు. ఆ ఓటరుకు ఒక నైతిక స్పష్టత ఉంది. "నువ్వు డబ్బు ఇచ్చావా? బాగుంది. నేను తీసుకున్నాను. మరి ఓటు? అది నా ఇష్టం. ఎవరికైనా వేస్తాను, అసలు వేయను" అనగలిగితే అది పాక్షిక నైతిక ప్రజాస్వామ్య స్వేచ్ఛ. ఎన్నికల తర్వాత హామీలు నిలబెట్టని పార్టీలు ఓటర్లను 'పరిగణనలోకి తీసుకోని' స్థితిలో ఉంటే, ఎందుకు ఓటర్లు తమ ఓటును తిరిగి కోరుకోకూడదు? ఇదే ప్రశ్న దేశవ్యాప్తంగా ఒక పెద్ద రాజకీయ, నైతిక చర్చగా మారాలి. మార్చగలరా?

డబ్బులను తిరిగి అడిగే క్రమంలో పార్టీలు నానా హంగామా చేస్తున్నపుడు హామీలు నిలబెట్టని పార్టీల విషయంలో ప్రజలు ఎందుకు నిశ్శబ్దంగా ఉండాలి? ఎన్నికల సమయంలో "మనం చేస్తాం, ఇస్తాం" అని చిట్టా విప్పిన తర్వాత, అధికారంలోకి వచ్చాక రాజకీయ పార్టీలు ఆ హామీలకు చెవిటి చెవిని అప్పగించడం మనకు కొత్తేమీ కాదు. అత్యంత విచిత్రం ఏమిటంటే తాము ఇచ్చిన డబ్బులను తిరిగి అడిగే పార్టీలు, తామే ఇచ్చిన హామీలను మాత్రం అలవోకగా మరిచిపోతాయి. సరే రీకాల్ అనే వ్యవస్థ గురించి ఇప్పుడు మాట్లాడుకోవడం అనవసరమేమో కానీ అది అసెంబ్లీకి పార్లమెంటుకు వర్తించదు. అలా వర్తించాలి అని డిమాండ్ చేయడం అవసరమే కానీ ఈ లోగానే ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టే సూచనలు కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయి. అధికారాన్ని ఎవరికిచ్చామో మర్చిపోయే ప్రజాస్వామ్యం బలహీన ప్రజాస్వామ్యమవుతుంది. అధికారాన్ని అవసరమైతే వెనక్కి తీసుకునే ప్రజాస్వామ్యం మాత్రమే తన బలాన్ని ప్రదర్శించగలుగుతుంది. మా ఓటును కూడా వెనక్కి తీసుకునే హక్కు మాకు ఉండాలి కదా? ఈ ప్రశ్న సామూహిక అవగాహనగా మారితే, అదే దేశ రాజకీయ పటాన్ని మార్చే శక్తి.

ప్రజాస్వామ్యం అంటే అయిదేళ్లకోసారి ఓటు వేసో వేయకుండానో బాధ్యత నుంచి పారిపోయి చేతులు దులుపుకోవడం కాదు. అది అప్రమత్తత, ప్రశ్నించే ధైర్యం, హక్కులను మళ్లీ మళ్లీ స్వాధీనం చేసుకునే శక్తి. ఓటు అనేది ఒక్క రోజు వేసి మరిచిపోయే వన్ డే స్టాండ్ కాదు. అది ప్రతినిధికి అయిదేళ్లపాటు మన జీవితాల్లో, మన గ్రామాల్లో, మన రాజకీయ భావజాలంలో జోక్యం చేసుకోవడానికి ఇచ్చే అధికార పత్రం. మన నిత్య జీవిత గమనాన్ని సులభతరం చేయడానికి ఇచ్చే అయిదేళ్ల పర్మిట్. ఈ అధికార పత్రాన్ని దుర్వినియోగం చేస్తే? హామీలను నిలబెట్టకపోతే? ప్రజలతో సంబంధం కోల్పోతే? రీకాల్ చేయాలి. అధికారాన్ని ఇచ్చింది ప్రజలే అయితే, దానిని వెనక్కి తీసుకునే హక్కు కూడా ప్రజలదే కదా. ఇదే 'రీకాల్' అనే ప్రజాస్వామ్య హక్కు మూల భావన.

ఎన్నికైన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించకపోతే, అతణ్ణి పదవిలో నుంచి మధ్యంతరంగానే ప్రజలు తొలగించే హక్కు. ఇది కొన్ని దేశాల్లో, కొన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉంది. మన దేశంలోని కొన్ని స్థానిక సంస్థల్లో కూడా రీకాల్‌కు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. అప్పుడే వాగ్దానాలు కేవలం ప్రసంగాల కోసం కాకుండా ఒప్పందాలుగా మారతాయి. ఓటర్లు అయిదేళ్లకు ఓసారి కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షకులుగా మారతారు, రాజకీయం సేవారంగంగా తిరిగి మారడానికి అవకాశం ఉంటుంది. ఇదంతా ఒక కల. ఒక ఆశ. ఒక ఆకాంక్ష.

ఇదంతా అనేకానేక అనైతికతల మధ్య ఘర్షణ. ఓటు అమ్ముకోవడం ఒక అనైతికత. ఓటు కొనడం మరో అనైతికత. ఓటు అమ్ముకుని అసలు బూత్‌కి వెళ్లకపోవడం మరింకో అనైతికత. ఓటు వేయనేలేదు కనుక డబ్బు తిరిగివ్వమనడం ఇంకింకో అనైతికత. ఇన్ని అనైతికతల నడుమ పరస్పర ఘర్షణలో ఓటమి మాత్రం ప్రజాస్వామ్యానిది. కాదు కాదు ప్రజలదే. ఈ పోరాటంలో ప్రజలు గెలవాలంటే 'నాకే మీ ఓటు' అని అడిగేవాళ్లతో 'నా ఓటు నాకిచ్చెయ్' అని అడగాలి. అడగగలగాలి.

పార్టీలు ఓటు కొనుక్కోవడానికి ఆర్డర్ పెట్టి, సరుకు డెలివరీ కానపుడు ఆ డబ్బు రిటర్న్ తీసుకోవడానికి పరితపించడం సబబే అనుకున్నా, ప్రజలు ఓటు ఇచ్చి వంచనకు గురయినపుడు తీసుకోవల్సిన రీఫండ్ మాత్రం ఒక్కటే– మరో ఎన్నికలో ఓటు హక్కు. అమ్ముడుపోని ఓటు హక్కు.

■ ప్రసేన్ (కవి, రచయిత)



● శివమయం



కార్తీకమాసం చివరి రోజు కృష్ణాతీరం, శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. దీపాలు వదలడానికి వచ్చిన భక్తులతో దుర్గాఘాట్ కిటకిటలాడగా, పాత శివాలయంలోని శివయ్య ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు.





● కలెక్టర్ ఆకస్మిక తనిఖీ 8

పటమట హైస్కూల్ రోడ్డులోని రైతుబజార్‌ను గురువారం కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయల విక్రయ స్టాళ్లను, ధరల పట్టికలను, అమ్మకాలు నిర్వహిస్తున్న రైతుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. కొనుగోలుదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఆఫ్రికా నత్త

అమ్మో జాగ్రత్త

- పశ్చిమ ఎన్టీఆర్‌లో పంటలపై ప్రతాపం
- అంతం అంత తేలికేం కాదు..!
- సరైన నివారణ పద్ధతులతో చెక్



ఆఫ్రికన్ నత్తలు.. ఈ మధ్యకాలంలో పంట పొలాల్లో ఎక్కువగా కనిపిస్తున్న విదేశీ జీవులు. చూడటానికి చిన్నగా ఉండే ఈ నత్తలతో అంత ఈజీ కాదు. పచ్చగడ్డి నుంచి వంగ, బొప్పాయి, పామాయిల్, ఇతర కూరగాయల పంటలను తేలిగ్గా తినేస్తాయి. దండులా పంటలపై దండయాత్ర చేసే ఈ నత్తలు మొంథా తుఫాను తర్వాత పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రమాదకరమైన ఈ నత్తలతో జాగ్రత్తగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

- ప్రత్యేక కథనం 6లో

మన విప్లవ తారలు



ఉమ్మడి కృష్ణా నుంచి విప్లవ ఉద్యమంలోకి టీచర్ల అడుగులు

- బెజవాడ వేదికగా కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులు
- జాతీయ స్థాయిలో విప్లవోద్యమ శంఖారావం పూరించిన ఉద్దండులు
- కొందరు ఉద్యమంతోనే బాగా తెలిస్తే.. కొందరు చనిపోయే వరకూ తెలియదు!

- ప్రత్యేక కథనం 8లో

ఇంద్రకీలాద్రిపై నూతన యాగశాల

- ఇక ప్రతిరోజూ చండీహోమం 6

ఆ నలుగురు

ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు కీలక నేతల కథలు



పటమట పోలీసులు పట్టుకున్న పొడియా భీమా, మంగి డొక్కుపాడి, మడకం లక్మా, చిన్మయ్

ప్రసాదంపాడులో పోలీసులు పట్టుకున్నాక బయటపడిన నిజాలు

- గెరిల్లా బెటాలియన్‌లో కీలక నేత భీమా వీరిలో ఒకడు
- ఇప్పటి వరకు 52 మంది పోలీసులను బలి తీసుకున్న రికార్డు
- పటమట పోలీసులకు చిక్కిన మావోయిస్టుల్లో అతడే కీలకం

పొడియా భీమా, మంగి డొక్కుపాడి, మడకం లక్మా, మడవి చిన్మయ్... విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో ఓ ఇంట్లో తలదాచుకున్న ఈ నలుగురు మావోయిస్టులను పటమట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరి వివరాల గుట్టు లాగిన పోలీసులు.. భీమాను కీలక నేతగా గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లో వారి చరిత్ర మొత్తం బయటకు తీశారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఛత్తీస్‌గఢ్‌లోని కుంటజిల్లా పాలమడుగు గ్రామానికి చెందిన పొడియా భీమా అలియాస్ రంగు... యవ్వనంలో మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడయ్యాడు. అడవుల వైపు ఒక్కో అడుగు వేశాడు. నెమ్మదిగా దళానికి దరిచేరాడు. పలు విధ్వంసకర ఘటనల్లో అతడు ఉపయోగించిన తెలివితేటలు అంచెలంచెలుగా పైకి తీసుకెళ్లాయి. మావోయిస్టుల అగ్రనేతలకు రక్షణగా ఉండే గెరిల్లా దళంలో కీలక వ్యక్తిగా ఎదిగాడు. వయస్సు 35 ఏళ్లు. సరిగ్గా 20 ఏళ్ల క్రితం మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడయ్యాడు. 2003వ సంవత్సరంలో మావోయిస్టు పార్టీలో చేరాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ గెరిల్లా బెటాలియన్ పార్టీ కమిటీకి అధ్యక్షుడి బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. దీంతోపాటు దక్షిణ బస్తర్ ఏరియా స్టేట్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు.

20 ఏళ్లు.. 50 ప్రాణాలు

ఛత్తీస్‌గఢ్‌లోని సీతనగుంత, బిజ్జి, గుల్కొండ, కోటచెరువు, ఏటిగట్టు, సర్కిల్‌గూడ, మురళీడూ ప్రదేశాల్లో జరిగిన దాడుల్లో భీమా క్రియాశీలకంగా వ్యవహరించాడు. దండకారణ్యంలో కూంబింగ్‌కు వెళ్లిన భద్రత బలగాల్లో దాదాపు 30 మంది వరకు మిగతా 6లో..

సమాచారం ఇస్తే చంపడమే

బీజాపూర్ జిల్లా ఉమ్మేరిపాలెం గ్రామానికి చెందిన మడవి చిన్మయ్ అలియాస్ మనీలా, గూడా గ్రామానికి చెందిన మడకం లక్మా అలియాస్ మదన్ దళానికి కమ్యూనికేషన్ వ్యవస్థలా పనిచేశారు. వారిలో లక్మా సంగావ్ డివిజనల్ కమిటీ మెంబర్. చిన్మయ్ పామేడు కమిటీ ఇన్‌చార్జి. ఇద్దరూ చిన్నతనంలోనే మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. గ్రామాల్లో అగ్రనేతలు చేసిన ప్రసంగాలకు ప్రభావితమై దళంలో చేరారు. ఆయా ఏరియాల్లో ఉండే గ్రామాల్లోకి వెళ్లి యువతీ యువకులకు మావోయిస్టు పాఠాలు చెప్పేవారు. వారిని నెమ్మదిగా అడవుల్లోకి తీసుకెళ్లేవారు. భద్రతా బలగాలకు ఎవరైనా సమాచారం చేరవేస్తున్నారన్న విషయం తెలిస్తే వారి ప్రాణాలు తీసేవారు. కోరగట్ట బీజాపూర్ జిల్లాలో వంజం భీమా అనే వ్యక్తి భద్రతా బలగాలకు సమాచారం ఇస్తున్నట్టు చిన్మయ్ గుర్తించింది. ఈ విషయాన్ని లక్మాకు చేరవేసింది. దీంతో అతడిని ఇన్ఫార్మర్ నెపంతో హత్య చేశాడు. ఈ నలుగురిపై పోలీసులు బీఎన్ఎస్ 61(2), 109, 147, 148, 149, 189(2), 189(4), 189(5), ఉపా చట్టంలోని 13, 16, 17, 18, 18(ఎ), 18(బీ), 20, 21, 38, 39, 40, ఏపీపీఎస్ చట్టంలోని 8(1), 8(2), ఆర్మ్స్ చట్టంలోని 25(1)(ఏ) రెడ్‌విత్ 7, టెలీ కమ్యూనికేషన్స్ చట్టంలోని 42(3)(డీ)(ఎఫ్) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

వివిధ ప్రాంతాలకు రైళ్ల పొడిగింపు

రైల్వేస్టేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు పలు రైళ్లను పొడిగిస్తున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ సీఆర్వో నుస్రత్ ఎం.మంద్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07033 కాకినాడ టౌన్-మైసూర్ రైలు డిసెంబరు 1 నుంచి జనవరి 12 వరకు సోమ, శుక్రవారాల్లో నడుస్తుంది. 07034 మైసూర్-కాకినాడ టౌన్ రైలు డిసెంబరు 2 నుంచి జనవరి 13 వరకు మంగళ, శనివారాల్లో నడుస్తుంది. 07153 నర్సాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు రైలు వచ్చే ఏడాది జనవరి 2 నుంచి 9 వరకు శుక్రవారాల్లో నడుస్తుంది. 07154 ఎస్ఎంవీటీ బెంగళూరు-నర్సాపూర్ రైలు జనవరి 3 నుంచి 10 వరకు శనివారాల్లో నడుస్తుంది. 07165 హైదరాబాద్-భువనేశ్వర్ రైలు డిసెంబరు 2 నుంచి జనవరి 27 వరకు మంగళవారాల్లో నడుస్తుంది. 07166 భువనేశ్వర్-హైదరాబాద్ రైలు డిసెంబరు 3 నుంచి జనవరి 28 వరకు బుధవారాల్లో నడుస్తుంది.



పలుకురాయి క్వారీ ఇదే..

పలుకురాయిపై పలకరేం..?

కనుమూరులో ప్రమాదకరంగా తవ్వకాలు

- నిబంధనలకు విరుద్ధంగా 100 అడుగుల వరకు..
- పేలుడు ధాటికి ఎగసిపడుతున్న బండరాళ్లు
- సమీప ప్రాంతాల్లోని తోటలు ధ్వంసం
- అభయారణ్యంలో పారిపోతున్న వన్యప్రాణులు
- ఇంతా జరుగుతున్నా నోరు మెదపని అధికారులు

వైసీపీ హయాం నుంచి ఆగని తవ్వకాలు

గంపలగూడెం, ఆంధ్రజ్యోతి : నిబంధనలకు విరుద్ధంగా పలుకురాయి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదు. గంపలగూడెం మండలంలోని కనుమూరు రెవెన్యూ పరిధిలో ఓ రైతుకు సంబంధించిన సర్వే నెంబర్ 223/2లో సుమారు మూడెకరాల భూమిని ఓ ప్రైవేట్ మినరల్స్ మిగతా 6లో..

ఇష్టానుసారంగా తవ్వకాలు

వైసీపీ హయాంలో ఆ పార్టీకి చెందిన ఓ మాజీమంత్రి సహకారంతో ఈ తవ్వకాలు జరిగాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారినా.. ఈ తవ్వకాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తవ్వకాల కోసం పరిమితికి మించి పేలుళ్లు చేపడుతున్నారని, దీంతో చుట్టుపక్కల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. పేలుడు కారణంగా 5 నుంచి 10 కిలోల బరువైన రాళ్లు సరిహద్దులో ఉన్న మామిడి తోటల్లో పడుతున్నాయి. 3 లేదా 4 అడుగుల లోతు గోతులు తీసి అందులో పేలుడు పదార్థాలు పెట్టాల్సి ఉండగా, వంద అడుగులకు పైగా యంత్రాలతో తవ్వి అక్కడ పేలుడుకు పాల్పడుతున్నారు.

30 ఏళ్లుగా షాక్‌లో..

అవసరం లేకపోయినా భూములు తీసుకుని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ నున్న రైతుల భవితవ్యంపై పెద్ద బండ వేసింది. అనవసరపు డబుల్ లైన్ కారణంగా 30 ఏళ్లుగా ఇక్కడి రైతులకు తీరని వేదనను మిగిల్చింది.

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ నిర్వాకానికి రైతుల బలి

- నున్న-జక్కంపూడిలో అవసరం లేకున్నా డబుల్ సర్క్యూటెడ్ లైన్
- విద్యుత్ సరఫరా మాత్రం సింగిల్ లైన్‌లోనే..
- అవసరం లేకుండా లైన్ ఎందుకు వేశారో తెలియని పరిస్థితి
- భూములు కోల్పోయిన రైతులు.. నష్టపరిహారమూ నిల్
- ధరలు తగ్గి, నిర్మాణాలకు అనుమతులు లేక రైతుల అవస్థలు



నున్న-జక్కంపూడి విద్యుత్ లైన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సింగిల్ సర్క్యూట్ (మూడు కండక్టర్లు) లైన్‌గా ఉన్న నున్న-ఖమ్మం 400 కేవీ ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్‌ను నున్న పవర్‌గ్రిడ్ నుంచి జక్కంపూడి వరకు 12 కిలోమీటర్ల మేర అవసరం లేకుండా డబుల్ సర్క్యూట్ (ఆరు కండక్టర్లు) లైన్‌గా మార్చి రైతుల భూములు, స్థలాలను పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ప్రశ్నార్థకంగా మార్చింది. సింగిల్ సర్క్యూట్ అంటే టవర్‌కు ఒకవైపే లైన్లు వెళ్తాయి. బ్రిడ్జి టవర్లు అయితే రెండువైపులా వెళ్తాయి. ఎలా వేసినా టవర్‌కు రెండువైపులా కలిపి 26 మీటర్ల వెడల్పున మాత్రమే భూములు దాని పరిధిలోకి వస్తాయి.

అవసరం లేకున్నా..

జక్కంపూడి-ఖమ్మం వరకు సింగిల్ సర్క్యూట్ (మూడు కండక్టర్ల) లైన్ మాత్రమే వెళ్తుంది. ఇందులో నున్న నుంచి జక్కంపూడి వరకు మాత్రమే డబుల్ సర్క్యూట్ లైన్‌ను మిగతా 6లో..

వెస్ట్ బైపాస్‌లో మరో లోపం

బయటకు చొచ్చుకొచ్చిన జక్కంపూడి ఆర్వోబీ గోడలు

పునర్నిర్మిస్తున్న కాంట్రాక్టు సంస్థ

- ఇలాంటి లోపం నాల్గోసారి
- ప్రారంభం కాకముందే నిండు నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పశ్చిమ బైపాస్‌కు మరో కష్టం వచ్చింది. జక్కంపూడి ఆర్వోబీని పునర్నిర్మించాల్సి వస్తోంది. ఆర్వోబీ సైడ్‌వాల్స్ ఉబికి బయటకు చొచ్చుకురావటంతో కాంట్రాక్టు సంస్థ మళ్లీ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. కొద్దినెలల కిందట ఈ ప్రమాదాన్ని గుర్తించిన కాంట్రాక్టు సంస్థ సైడ్ సిమెంట్ ప్లేట్లకు ఐరన్ రివిట్‌మెంట్స్ వేసింది. ఆ చర్యలు సత్ఫలితాలు ఇవ్వలేదు. అయినా ఆర్వోబీ సైడ్‌వాల్ బయటకు చొచ్చుకు వస్తుండటంతో పునర్నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించింది. దీంతో జక్కంపూడి నుంచి గొల్లపూడివైపు వెళ్లే మార్గంలో ఉన్న భాగాన్ని తొలగిస్తున్నారు. అప్రోచ్ వాల్ మధ్యలో నింపిన మట్టి, యాష్ తదితరాలను ఎక్స్‌కవేటర్ ద్వారా పెద్దపెద్ద లారీల్లోకి ఎత్తుతూ సమీప ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. మట్టి, యాష్ పొడి పూర్తిగా తొలగించటంతో పాటు సమాంతరంగా సైడ్‌వాల్ కాంక్రీట్ ఫలకాలను కూడా తొలగిస్తారు. పూర్తిగా తొలగించాక మళ్లీ సైడ్‌వాల్ నిర్మాణం చేపడుతూ ఆర్వోబీని పునర్నిర్మిస్తారు.



జక్కంపూడి ఆర్వోబీ వద్ద పునర్నిర్మాణ పనులు

నాల్గోసారి..

విజయవాడ పశ్చిమ బైపాస్‌లో వేసిన ఆర్వోబీలను పునర్నిర్మించడం ఇది నాల్గోది. ఇంతకుముందు గన్నవరం, బీబీగూడెం మధ్య ఆర్వోబీని ఇలాగే పునర్నిర్మించారు. పనుల్లో నిర్లక్ష్యం కారణంగా వెస్ట్ బైపాస్ ప్రారంభోత్సవం కాకుండానే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ పనులను కాంట్రాక్టు సంస్థ సబ్ కాంట్రాక్టుకు మిగతా 6లో..

కిడ్నీ వ్యాధితో మరో మహిళ మృతి

ఎ.కొండూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మరో ఉద్దానంగా పేరుగాంచిన ఎ.కొండూరు మండలంలో కిడ్నీ మరణాలు ఆగడంలేదు. చైతన్యనగర్ తండాకు చెందిన మరో మహిళ గురువారం మృతిచెందింది. బాణవతు కోటమ్మ(65) కొంతకాలం నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. వైద్యుల సూచనలతో మందులు వాడుతున్నారు. ఇటీవల వ్యాధి తీవ్రత పెరగడంతో విజయవాడలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. రెండు రోజుల క్రితం డయాలసిస్ చేయించుకుని ఇంటికి వచ్చారు. గురువారం ఒక్కసారిగా వ్యాధి తీవ్రత పెరిగి కోటమ్మ మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కిడ్నీ వ్యాధి సోకినప్పటి నుంచి తమకున్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకుని లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ప్రాణాలు దక్కలేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.



బాణవతు కోటమ్మ(ఫైల్)



ఆఫ్రికన్ నత్త.. అమ్మో జాగ్రత్త!

జి.కొండూరు గడ్డమణుగు బీటిలో వాటర్ పైపుపై గుంపులుగా చేరిన ఆఫ్రికన్ నత్తలు, నత్తల దండు పడిన పచ్చని బీడు

(ఆంధ్రజ్యోతి, జి.కొండూరు)

ఆఫ్రికన్ నత్తలు.. ఆ మాట వింటేనే అన్నదాతలు హడలిపోతున్నారు. అంత ఈజీగా అంతంకాని ఈ నత్తలు పంటచేలల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. దండులా పంటలపై దండయాత్ర చేస్తున్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు, రైతుల అంచనాలను తల్లకిందులు చేస్తూ నత్తల దండు పశువులు మేసే పచ్చగడ్డినీ మిగల్చడంలేదు. నిన్న మొన్నటి వరకు వంగ, బొప్పాయి, పామాయిల్, ఇతర కూరగాయల పంటలపై కనిపించిన నత్తలు ఇప్పుడు పెద్ద సంఖ్యలో పచ్చని బీడుల్లో దర్శనమిస్తున్నాయి.

ఎన్టీఆర్ జిల్లా గడ్డమణుగు గ్రామంలో ఎన్.రాజ (రైతు) పశువులు మేపే బీడుకు నీళ్లు పెట్టాడు. దీంతో భూమిలో ఉన్న నత్తలు ఒక్కసారిగా నీరు కట్టే పైపులైన్ మీద దర్శనమిచ్చాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో నత్తలు దర్శనం ఇవ్వడంతో రైతు ఖంగుతిన్నాడు. ఇలా అయితే పశువులకు మేత కూడా మిగిలే పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు.

- పచ్చ గడ్డినీ వదలని ఆఫ్రికన్ నత్తలు
- ఎండు పరక నుంచి కర్ర పుల్ల వరకు హాంఫట్
- పశువుల మేతకు పొంచివున్న ముప్పు
- ప్రమాదకరమైన నత్తలు.. తినేందుకు పనికిరావు
- ఈ నత్తల అంతం అంత ఈజీ కాదు
- నత్తల జీవనం.. నివారణపై సమగ్ర కథనం..

ఆఫ్రికన్ నత్తల అంతం అంత తేలిక కాదా..

ఆఫ్రికన్ నత్తలు (జెయింట్ ఆఫ్రికన్ స్నెయిల్) ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన 100 విదేశీ జాతులలో ఇది ఒకటి. ఈ నత్తలు 500 కంటే ఎక్కువ పంటలకు నష్టం కలిగించగలవు. పూర్వం 1800ల నుంచే ఈజాతి ఆఫ్రికా నుంచి ఇతర దేశాలకు వ్యాపించింది. భారత్‌లో ఇది 1847లో పశ్చిమ బెంగాల్‌లో కనిపించింది. 2003లో ఏపీలో అరకు ప్రాంత కాఫీ తోటల్లో గుర్తించబడింది. ఉద్యాన పంటల వాణిజ్యం ద్వారా ఇది ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందింది. 2022లో తూర్పు గోదావరి జిల్లాలో నర్సరీలో కూరగాయలకు ఎక్కువ నష్టం చేశాయి. 2025లో పార్వతీపురం మన్యం జిల్లాలోని గంగిరేగువలస గ్రామం కొమరాడ మండలంలో 100 ఎకరాల్లో వీటి ప్రభావం అధికంగా కనిపించింది. విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, పల్నాడు జిల్లాల్లో కూడా ఇవి పంటలకు నష్టం చేశాయి. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలో నల్లజర్ల మండలం కోనసీమ జిల్లాలోను, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోను ఆఫ్రికన్ నత్తలు భారీ సంఖ్యలో కనిపిస్తున్నాయి.

ఎండు కర్ర పుల్లల్నీ వదలవు..

ఈరకం నత్తలు ఒక్క రాత్రిలో నర్సరీలను నాశనం చేయగలవు.

రాత్రి వేళ చురుగ్గా

ఆఫ్రికన్ నత్తలు ఆడ, మగ రెండూ ఒకే జీవిలో ఉంటాయి. వీటి పెరుగుదల సామర్థం చాలా ఎక్కువ. గుడ్ల నుంచి పుట్టిన నత్తలు 12నెలల్లో పెరిగిపోతాయి. వాతావరణం అనుకూలించినప్పుడు జూలై నుంచి ఫ్రిబవరి వరకు సుమారు 6 మాసాలు నుంచి 8 మాసాలు దీని సంతాన ఉత్పత్తికి అనుకూలం. నెలకు 100 నుంచి 400 గుడ్లు పెడుతుంది. ఒక నత్త తొలిఏడాది 100 గుడ్లు, రెండో ఏడాది 500 గుడ్లను రాళ్ల కింద, చెట్ల మొదళ్లలో పెడుతుంది. ఒక్కొక్క నత్త జీవిత కాలంలో ఐదు వేల వరకు పిల్లలను ఉత్పత్తి చేస్తుంది. అందు వల్ల వీటిసంఖ్య చాలా వేగంగా పెరుగుతుంది. ఈనత్తలు రాత్రి చురుగ్గా ఉంటూ.. పగలు నేలలో దాక్కుంటాయి. ఇవి 19 సెంటీ మీటర్ల పొడవు, 750 గ్రాముల బరువు పెరుగుతాయి.

వీటికి బొప్పాయి అత్యంత ఇష్టమైన ఆహారం. నిమ్మ, చామంతి, మృదువైన జామ, లేత ఆకులను ఇష్టంగా తింటాయి. కాలీఫ్లవర్, క్యాబేజీ, టమోటా మిరప, కంద, అల్లం, పసుపు, అరటి, సిట్రస్ పండ్లు, అలంకార మొక్కలు వంటి అనేక పంటలను తినేస్తాయి. ఆయిల్ పామ్, పత్తి, చామంతి, వక్క పంటలకు ఎక్కువగానే ఆశిస్తాయి.

అనుకూల వాతావరణ పరిస్థితులు

వరుసగా పడే వర్షాలు, మబ్బు వాతావరణం, తడి నేల, ఆకు చెత్త తడిగా ఉండటం, ఇవన్నీ ఈ నత్తలు పెరగడానికి తిరగడానికి అనుకూలం. అధిక వర్షాలు, వరదలు, చల్లని జల్లులతో కూడిన వాతావరణంలో ఎక్కువగా గుడ్లు పెడతాయి. మందపాటి కలుపు మొక్కలు, నేలపై ఉన్న మల్చింగ్, నీడ ఉన్న గట్లు నత్తలకు పగటి పూట ఆశ్రయాలుగా ఉంటాయి.

నివారణ పద్ధతులు..

పంట చేలల్లో కలుపు మొక్కలు తొలగించాలి. పొలంలో ఉన్న మిగతా చెత్త, అవశేషాలను తీసేయాలి. పొలాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు పగటిపూట మాత్రమే షెడ్యూల్ చేసిన సమయాల్లో ఇవ్వాలి. పొలంలో ఉన్న నత్తలను చేతితో ఏరి వాటిని 5 శాతం ఉప్పు నీటి (సాల్ట్ సొల్యూషన్)లో వేయాలి. ఈపద్ధతి ద్వారా 80 నుంచి 90శాతం నత్తలు చనిపోవడానికి దోహదం చేస్తుంది. పొగాకు కాండాలు (50 గ్రాములు) 1.5 లీటర్ల నీటిలో మరిగించి అది లీటర్ అయ్యే వరకు వేడిచేయాలి. అనంతరం 60 గ్రాముల కాపర్ సల్ఫేట్ లీటర్ నీటిలో కరిగించి కలపాలి. ఆ ద్రావణాన్ని పొలంలో పిచికారీ చేయాలి. నత్తల సంతతి ఎక్కువైనప్పుడు కాపర్ సల్ఫేట్ 1.5 గ్రాములతో పాటు ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాముల ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి. నత్తల కదలికలను అడ్డుకునేందుకు పొలం చుట్టూ ఉప్పు నీరు తడిపిన గోనె సంచులను ఉంచాలి. మార్కెట్‌లో లభించే మెటాల్డిహైడ్ పెల్లెట్స్‌ను సాయంత్రం లేదా రాత్రి పూట ప్రతి హెక్టారుకు 5-10 కిలోల మేర వేసుకోవాలి. ఇవి విషపూరితం కనుక పిల్లలు, పెంపుడు జంతువులు తాకకుండా చూసుకోవాలి.

తినేందుకు పనికిరావు

ఆఫ్రికన్ నత్తలు అత్యంత ప్రమాదకరం. ఇవి విసర్జించే జిగురు లాంటి ద్రావణం అంటుకుంటే దురదలు, చర్మవ్యాధులు సోకుతాయి. కనుక ఇవి తినేందుకు పనికి రావు. చెరువులు, కాల్వలు, వరి పొలాల్లో ఎక్కువగా లభించే పిలా నత్త (ఆపిల్ నత్త), బెల్లమ్యా నత్త (నీటి నత్త)లను మాత్రమే తినొచ్చు. ఆఫ్రికన్ నత్తలను తినకూడదు.



షాలీరాజ్ (కీటక శాస్త్రవేత్త, నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం)



పదోన్నతుల నియామకపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

ఎనిమిది మంది బిల్ కలెక్టర్లకు పదోన్నతులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఎనిమిది మంది సీనియర్ బిల్ కలెక్టర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. గురువారం బిల్ కలెక్టర్లకు కలెక్టర్ బాలాజీ, డీపీవో అరుణలు పదోన్నతుల ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ వేమవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సీహెచ్ సుబ్బారావు (గొల్లపూడి)ని గొల్లపూడి పంచాయతీలోను, పి.నాగేశ్వరరావు (నున్న)ను కంకిపాడు, సీహెచ్ ప్రభాకరరావు (పెదమద్దాలి)ని ఎలకుర్రు, డీవీ సాంబశివరావు (ఎనికేపాడు)ను గుంటుపల్లి, సోమాల రత్నకుమారి (గొడవర్రు)ను తోట్లవల్లూరు, బి.శ్రీనివాసరావు (కాకుళ్ళపాడు)ను కానుమోలు, ఆకూరి పద్మకుమారి (కనుమూరు)ను పసుమర్రు, క్యామర్ సుల్తానా (విస్సన్నపేట)ను షేర్ మహమ్మద్‌పేటకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ బదిలీ

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్)లో ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఉన్న డి.చంద్రంను సొంత శాఖకు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రైల్వేశాఖకు చెందిన చంద్రం వైసీపీ హయాంలో ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా వచ్చారు. ఆయన పదవీకాలం పూర్తి కావడంతో ఆయన్ను సొంతశాఖకు పంపుతూ జీవో ఇచ్చింది.

ఉపాధి జాబ్‌కార్డుల జారీకి గ్రామ సభలు

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి గ్రామీణ ఉపాధి జాబ్‌కార్డుల కోసం, మండలస్థాయి అధికారి సమక్షంలో ఈ నెల 22న గ్రామ సభలు నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరేట్ కార్యాలయం అన్ని జిల్లాలకు ఆదేశాలిచ్చింది. ఇప్పటికే తీసేసిన జాబ్‌కార్డుల వివరాలను గ్రామ సభలో చదివి వినిపించాలని సూచించారు. వాటిపై అభ్యంతరాలున్నవారు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కొత్త జాబ్‌కార్డులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో పనులు కావాల్సిన వారి జాబితా తయారుచేసి వారికి పని కల్పించాలన్నారు.

సాంఘిక సంక్షేమశాఖ జేడీల రివైజ్డ్ సీనియారిటీ జాబితా

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖలో ఏడుగురు జాయింట్ డైరెక్టర్ల రివైజ్డ్ సీనియారిటీ జాబితాను విడుదల చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. డి.శ్రీనివాసన్, డీవీ రమణమూర్తి, కె. సునీల్‌రాజ్‌కుమార్, జె.రంగలక్ష్మిదేవి, వై.సీతామహాలక్ష్మి, వి.జయప్రకాష్, ఎస్. మధుసూదనరావుల పేర్లతో సీనియారిటీ జాబితా విడుదల చేస్తూ ఆదేశాలిచ్చారు.

కోర్టును తప్పుదోవ పట్టించేందుకు జగన్ బలప్రదర్శన

- ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసులలో నాంపల్లి కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ కోర్టును తప్పుదోవ పట్టించేందుకు బలప్రదర్శన నిర్వహించాడని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎంపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే వైఎస్ జగన్ పాపాలు పండాయని, జగన్ వైఖరిని న్యాయస్థానం సీరియస్‌గా తీసుకుంటాయన్నారు. రాబోయే ఎన్నికలలో పులివెందులలో జగన్ ఎమ్మెల్యేగా గెలవలేని పరిస్థితి ఉందన్నారు. అక్రమార్జన కేసులలో కోర్టుకు హాజరుకాకుండా ఉండేందుకు జగన్ డ్రామాలు ఆడుతున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను బెదిరించిన పరిస్థితి ఉందని ఆయనకు కోర్టుపై, న్యాయవ్యవస్థపై ఎలాంటి గౌరవం లేదన్నారు. జగన్ వింతపోకడలకు కేరాఫ్ అడ్రస్ అన్నారు.

సహకార వ్యవస్థలో లోపాలు తొలగిస్తాం

- సహకార జెండా ఆవిష్కరించిన కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం

భారతీనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సహకార రంగం దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అనీ, కార్పొరేట్ సంస్థలకు దీటుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ అన్నారు. గురువారం శ్యాంనగర్ సహకార భూమి జర్నల్ సహకార సంఘం లిమిటెడ్ కార్యాలయంలో సంఘం కార్యదర్శి వీరమాచినేని రత్న ప్రసాద్ అధ్యక్షతన సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సహకార జెండాను నెట్టెం రఘురామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఈ వ్యవస్థ అమలులో అక్కడక్కడ తప్పులు జరుగుతున్నాయని అన్నారు. వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రసుత్తం రాజకీయ జోక్యం ఎక్కువగా ఉందని అన్నారు. ఎన్నికలు సరిగా జరగకపోవడంతో కృష్ణా జిల్లాలోని 425 సహకార సంఘాలలో సుమారు 100 సంఘాలు సరిగా పనిచేయడంలేదన్నారు. సహకార రంగం దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అనీ, కార్పొరేట్ సంస్థలకు దీటుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ జీఎం రంగబాబు, పీపుల్స్ సొసైటీ చైర్మన్ ఎల్లారావు, దాసరి కేశవులు, కానూరి కృష్ణ, రంగారెడ్డి, ప్రసాద రెడ్డి, రామారావు, జి.పి.వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పత్తికి పరిహారం అందేనా!

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

- రైతుల ఆవేదనపై స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ
- పంట నష్టంపై ఆరాతీయాలని ఆదేశం
- అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకున్న పలువురు బాధిత రైతులు



ఇంట్లో నిల్వ ఉంచిన పత్తిని వ్యవసాయాధికారులకు చూపుతున్న రైతు

నందిగామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా పత్తి పంటను నష్టపోయిన రైతుల ఆవేదన.. సీసీఐ కొనుగోళ్లపై 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న కథనాలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ స్పందించారు. పత్తి రైతులను కలసి పరిస్థితిపై ఆరా తీయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆరాతీసేందుకు వచ్చిన అధికారులకు రైతుల తమ కష్టాలు చెబుతూ నిట్టూరుస్తున్నారు. ఆరా తీయడంతోనే సరిపెడతారా లేక సాయం అందిస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు మిన్నకుండి పోతున్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' వచ్చిన కథనానికి స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో వ్యవసాయాధికారులు పంట తొలగిస్తున్న చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన రాయిడి వేణు రైతు వద్దకు వెళ్లారు. ఆయనకు ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు. రైతు వేణు నుంచి పూర్తి సమాచారాన్ని వ్యవసాయాధికారి గింజుపల్లి రమేష్ సేకరించారు. తాను, తన సోదరుడు కలసి సొంత భూమితో పాటు కొంత కౌలుకు తీసుకొని మొత్తం నలభై ఎకరాలలో పత్తి సాగు చేపట్టినట్టు తెలిపారు. అతివృష్టితో పాటు మొంథా తుఫాను వల్ల సర్వం కోల్పోయినట్టు తెలిపారు. ఇప్పటికి కేవలం ఎకరాకు మూడు క్వింటాళ్ల చొప్పున పత్తి ఇంటికి చేరిందని, పత్తి తీతలకు క్వింటాకు సుమారు మూడు వేల వరకూ ఖర్చు అయినట్టు తెలిపారు. తుఫాను అనంతరం పత్తి పూర్తిగా తడిచి తీసేందుకు కూడా కష్టంగా మారిందని, పత్తిని తీయించాలంటే అన్ని ఖర్చులతో కలసి క్వింటాకు 35 వందల వరకూ వెచ్చించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పత్తి కొనే దిక్కులేక ఇంట్లోనే పెట్టుకున్నామని, అంత ఖర్చు చేసి ఇంకా పత్తిని తీసి ఏం చేయాలని ప్రశ్నించాడు. అందు వల్లనే పంట దున్ని వేస్తున్నట్టు చెప్పారు. తమ గోడును ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలకిస్తే తప్ప ఎవరూ తీర్చలేరని, ఆయన చొరవ తీసుకొని సీసీఐతో కొనుగోళ్లు చేయడంతో పాటు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.



యాగశాలలో చండీహోమం, పాల్గొన్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై నూతన యాగశాల ప్రారంభం

ఇంద్రకీలాద్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై అధునాతన సౌకర్యాలతో నిర్మించిన యాగశాల గురువారం ప్రారంభమైంది. ఆలయ చైర్మన్, ఈవో, పాలకమండలి సభ్యుల కృషి, దాత సహకారంతో భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో, దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) దంపతులు పాల్గొని యాగశాలను ప్రారంభించారు. యాగశాలలో ఇకపై ప్రతిరోజూ చండీ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అమ్మవారికి జరిగే నవరాత్రి ఉత్సవాలు, ఇతర ముఖ్యమైన పండుగ రోజుల్లో నిర్వహించే బృహత్తర యాగాలు, క్రతువులు అన్నీ నూతన ప్రాంగణంలోనే జరుగుతాయి. యాగశాల నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని పూర్తిగా దాత సంగా నరసింహారావు భరించి సుమారు రూ. 5.50 కోట్లు ఖర్చు చేసినట్టు ఈవో, చైర్మన్ చెప్పారు. నూతన యాగశాల ప్రారంభోత్సవంలో చైర్మన్ బొర్రా రాధా కృష్ణ సతీ సమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ చిన్ని

దుర్గగుడి అభివృద్ధి పనులపై ఎంపీ సమీక్ష

ఇంద్రకీలాద్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం అభివృద్ధి, మాస్టర్ ప్లాన్‌పై దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులతో గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈవో చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ మహామండపం, కనకదుర్గానగర్ ప్రాంతాలలో అభివృద్ధి పనుల గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతి, భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించారు. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ త్వరితగతిన అమలు అయ్యే విధంగా చూడాలని ఎంపీ సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, డీఈలు, ఏఈలు, దేవస్థానం పాలకమండలి సభ్యురాలు ఎస్.సరిత, ప్రత్యేక ఆహ్వానితుడు వెలగపూడి శంకర్‌బాబు, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, సీఐ గురు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మరో లోపం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఇప్పటికే బైపాస్‌లో పలుచోట్ల పగుళ్లు రావటంతో పునర్నిర్మించారు. సరిగ్గా ఆరు నెలల కిందట మూడు ఆర్వోబీల గోడలు కూడా చొచ్చుకురావటంతో వాటిని పూర్తిగా తొలగించి పనులు చేపట్టారు. చిన్నఅవుటపల్లి దగ్గర ఎన్‌హెచ్-16కు అనుసంధానమయ్యే చోట కూడా ఇలాగే చేశారు. రోడ్డు పూర్తికాకుండానే ఇన్ని సమస్యలు వస్తుండటంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సిబ్బంది చేస్తున్న పనులపై సరైన పర్యవేక్షణ లేకపోవటం వల్లే ఈ లోపాలు తలెత్తుతున్నాయి.

ఎందుకిలా?

ఆర్వోబీలు నిర్మించే క్రమంలో సైడ్‌వాల్‌తో సమాంతరంగా అందులో మట్టి, ఇసుక, యాష్ వంటివి నింపాలి. సైడ్‌వాల్స్ మధ్య మెటీరియల్స్‌ను తడుపుతూ, చదును చేస్తూ గట్టి రోలింగ్ చేయాలి. అప్రోచ్ వాల్స్ మధ్య ఎర్త్ సాయిల్ గట్టిగా లేకపోతే ఈ లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. భూమి స్థితిగతులను అంచనా వేయటంలో విఫలమైనా సమస్యలు ఏర్పడతాయి. లోతుగా ఫౌండేషన్ వేయకపోయినా, ఫౌండేషన్‌లో కాంక్రీట్ నాణ్యతగా లేకపోయినా ఇలా జరుగుతుంది. ఆర్వోబీ పక్కనే ఉన్న నేలలో నీరు నిల్వ ఉండటం వల్ల కూడా ఇలాంటి ఇబ్బందులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడిని తట్టుకోలేక కూడా గోడలు బయటకు చొచ్చుకురావటం, పగుళ్లు ఏర్పడటం వంటివి జరుగుతాయి. వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో మరింత ఒత్తిడికి గురై ఒక్కసారిగా కూలే అవకాశాలు కూడా ఉంటాయి.

ఆ నలుగురు

(5వ పేజీ తరువాయి)

పోలీసులు ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. 2017లో గుర్కపూర్‌లో జరిగిన దాడిలో 22 మంది పోలీసులు చనిపోయారు. ఆ తర్వాత నుంచి అగ్రనేతలు భీమాకు కీలక బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. ఈ దాడిలో అతడు బాంబు అమర్చిన ప్రదేశానికి దగ్గరగా ఉండటంతో ఆ పేలుడు ప్రభావం అతడిపై పడింది. ఈ ఘటనలో భీమా కుడికాలు కోల్పోయాడు. ఈ గాయం తర్వాత దళంలో అంతర్గత బాధ్యతలు చూసుకోవాలని అగ్రనేతలు సూచించారు. దీనికి అతడు అంగీకరించలేదని తెలిసింది. రెండో కాలుతో అడుగులు వేస్తానని చెప్పి పలు దాడుల్లో పాల్గొన్నాడు.

దాడుల్లో కలిసి.. భార్యగా చేరి

కిష్టారం తాలుకా డోకుపాడు గ్రామానికి చెందిన మంగి డొక్కుపాడి ఏరియా కమిటీ సభ్యురాలు (ఏసీఎం). ఈమె కిష్టారం ఏరియా బాధ్యతలను చూసేది. భీమా పాల్గొన్న ప్రతి దాడిలోనూ అతడితో కలిసి అడుగులు వేసింది. తర్వాత భీమా జీవిత భాగస్వామిగా మారింది. దాడుల్లో ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయంతో ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న అగ్రనేతలు దళంలో పార్టీ పరంగా వివాహం చేశారు. గడిచిన ఏడాది ధర్మవరం, పుసుకుప్ప భద్రతా బలగాల క్యాంపులపై జరిగిన దాడుల్లో భార్యభర్తలిద్దరూ కలిసి పాల్గొన్నారు.

పలకరేం..?

(5వ పేజీ తరువాయి)

సంస్థ ప్రతినిధులు ఐదేళ్ల కిందట లీజుకు తీసుకున్నారు. గనులశాఖ అనుమతితో పలుకు రాయి తవ్వకాలు చేపట్టారు. ఇప్పటికే రూ.కోట్ల విలువైన సహజ సంపదను తరలించేశారు.

అడుగంటుతున్న భూగర్భ నీరు

క్వారీని లోతుగా తవ్వి ఊట నీటిని విద్యుత్ మోటార్లతో తోడుతున్నారు. దీనివల్ల సరిహద్దున ఉన్న పొలాల్లోని బోర్లకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, రవాణా, గనుల శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ వ్యవహారమంతా పలుకు రాయి క్వారీ సరిహద్దున ఉన్న మామిడి రైతులకు ప్రాణగండంగా మారింది. సమీప అభయారణ్యంలో స్వేచ్ఛగా సంచరించే వన్యప్రాణులు పేలుడు శబ్ధాలకు పారిపోతున్నాయి. తోటల్లో కాపలదారులు కాపలా ఉండలేమని చెబుతున్నారు.

ధ్వంసమవుతున్న రోడ్లు

సమీప గట్టుచెరువు నివాసితులు కూడా భయందోళన చెందుతున్నారు. సామర్థ్యానికి మించి ట్రాలీలు, లారీల్లో పలుకురాయి తరలిస్తుండటంతో నాలుగేళ్ల కిందట నిర్మించిన అనుముల్లంక నుంచి జమలాపురం ఎన్ఎస్పీ మేజర్ వరకు నిర్మించిన బీటీ రోడ్డు, మేజర్ కాల్వకట్ట.. గుంతలు పడి ధ్వంసమైంది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి అక్రమ మైనింగ్ పనులు నిలుపుదల చేసి ప్రాణరక్షణ కల్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

ఈ విషయంపై తహసీల్దార్ వి.రాజకుమారిని వివరణ కోరగా, క్వారీ సరిహద్దుగా ఉన్న మామిడి తోటల యాజమానులు ఫిర్యాదు చేస్తే, మైనింగ్ అధికారులతో కలిసి క్వారీని తనిఖీ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గౌతంరెడ్డి కారు దహనం కేసులో

నిందితుడి అరెస్టు

విజయవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత పూనూరు గౌతంరెడ్డి కారు దహనం కేసులో నిందితుడిని సత్యనారాయణపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పెజ్జోనిపేటకు చెందిన హరికోటి లెనిన్‌బాబు పెయింటర్. 2005 నుంచి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లెనిన్‌బాబుపై క్రైంసస్పెక్ట్ షీట్ ఉంది. అతడిపై కృష్ణలంక, మాచవరం, సూర్యారావుపేట, గవర్నరుపేట, వైజాగ్‌లోని పీఎం పాలెం స్టేషన్లలో 15చోరీకేసులున్నాయి.

అభిమాన నేతను దూషించినందుకే..

లెనిన్‌బాబు దివంగత నేత వంగవీటి మోహనరంగాకు వీరాభిమాని. ఆయన పేరుతో ఉన్న పలు సంఘాల్లో సభ్యుడిగా ఉన్నాడు. 2017లో ఒక టీవీ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో రంగాను కించపరుస్తూ పూనూరు గౌతంరెడ్డి చేసిన వ్యాఖ్యలు రెండు నెలల క్రితం లెనిన్ బాబు యూట్యూబ్‌లో చూశాడు. దీంతో ఆగ్రహించిన లెనిన్‌బాబు అక్టోబరు 12న హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చాడు. పెట్రోలును కొనుగోలు చేసి గౌతంరెడ్డి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు. ఎవరూ లేని సమయంలో ఏపీ40 జేబీ 1234 నంబరు కారుపై పెట్రోలు పోసి నిప్పంటించి పారిపోయాడు. దీనిపై గౌతంరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన సత్యనారాయణపురం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తును కొనసాగించారు. సీసీ ఫుటేజీని పరిశీలించి లెనిన్‌బాబుగా గుర్తించారు.

షాక్‌లో..

(5వ పేజీ తరువాయి)

తీసుకొచ్చి అక్కడితో ఆపేశారు. జక్కంపూడి నుంచి ఖమ్మంవరకు బ్రిడ్జి టవర్ల మీదుగా సింగిల్ సర్క్యూట్ లైన్‌ను తీసుకెళ్తున్నారు. అయితే, నున్న నుంచి జక్కంపూడి వరకు డబుల్ సర్క్యూటెడ్ లైన్లు ఎందుకు వేయాల్సి వచ్చిందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల నున్న నుంచి జక్కంపూడి వరకు 12 కిలోమీటర్ల మేర అభివృద్ధి ఆగిపోయింది. ఈ ప్రాంతంలో భూములు కలిగిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. మూడు దశాబ్దాల కిందట ఈ లైన్లు వేశారు. ఈ డబుల్ సర్క్యూటెడ్ లైన్ల కారణంగా టవర్ల పరిధిలోకి రెండువైపులా కలిపి 52 మీటర్ల మేర భూములు వచ్చాయి. సంబంధిత రైతులు ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. డబుల్ సర్క్యూటెడ్ లైన్‌గా అభివృద్ధి చేయడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? కమీషన్ల కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెడతారా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేయాలన్న డిమాండ్ వస్తోంది.

పరిహారం లేకుండానే డబుల్ సర్క్యూటెడ్ లైన్లు

నష్టపరిహారానికి సంబంధించి మూడు దశాబ్దాల కిందట ఎలాంటి నిబంధనలులేని కారణంగా రైతులకు నయాపైసా కూడా చెల్లించకుండా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ నున్న-జక్కంపూడి వరకు 12 కిలోమీటర్ల మేర డబుల్ సర్క్యూటెడ్ టవర్ లైన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కారణంగా నున్న పవర్‌గ్రిడ్ నుంచి జక్కంపూడి వరకు 12 కిలోమీటర్ల పొడవునా మొత్తం 77 ఎకరాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. డబుల్ సర్క్యూటెడ్ లైన్ల కారణంగా భూముల ధరలు తగ్గాయి. నిర్మాణాలు చేపట్టేవారికి అనుమతులు రాక ఇబ్బందులు పడుతున్నారు.

సింగిల్ సర్క్యూటెడ్ లైన్‌లోనే విద్యుత్ సరఫరా

నున్న నుంచి జక్కంపూడి వరకు డబుల్ సర్క్యూట్ లైన్ వేసినా.. కేవలం ఒకవైపు సింగిల్ సర్క్యూట్ లైన్‌కే విద్యుత్ సరఫరా జరుగుతోంది. రెండో లైన్‌లో విద్యుత్ సరఫరా జరగట్లేదు. 30 ఏళ్లుగా విద్యుత్ సరఫరా జరగకపోయినా లైన్ మాత్రం కొనసాగుతోంది. భవిష్యత్తులో కూడా డబుల్ సర్క్యూటెడ్ అవసరం లేదు. అలాంటప్పుడు నిరుపయోగంగా ఉన్న సింగిల్ సర్క్యూటెడ్ తొలగిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ విషయంపై రైతులు కోర్టుకు వెళితే.. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. చట్టప్రకారం రైతులకు, స్థల యజమానులకు మార్కెట్ విలువలో 60 శాతం చొప్పున చెల్లించాలి. నున్న దగ్గర ఎకరం సగటున రూ.3 కోట్లు ఉంటుంది. ఈ లెక్కన రూ.140 కోట్ల మేర పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ పరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

20వ డివిజన్‌లో ప్రజాదర్బార్

ప్రజా సమస్యలు తెలుసుకున్న డివిజన్ అధ్యక్షుడు గళ్లా

కృష్ణలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక 20వ డివిజన్ ఎం హోటల్ సమీపంలో ఫీడర్ రోడ్డులో గురువారం టీడీపీ డివిజన్ అధ్యక్షుడు గళ్లా శ్రీను ప్రజాదర్బార్ నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాల మేరకు గళ్లా శ్రీను ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్దయెత్తున పాల్గొని పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాల కోసం వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాసా పల్లపురాజు, జనసేన నాయకులు బండ్రెడ్డి నాగరాజు, టీడీపీ నాయకులు కొడాలి సాయిబాబు, గళ్లా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వైపు దృష్టి సారించండి

యువతకు డిప్యూటీ పోలీసు కమిషనర్ కేజీవీ సరిత హితవు



నవలను ఆవిష్కరిస్తున్న డీసీపీ కేజీవీ సరిత తదితరులు

మొగల్రాజపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువత మొబైల్ వాడకం సమయం తగ్గించుకుని సృజనాత్మకతను పెంచే అంశాల వైపు దృష్టి సారించాలని జిల్లా డిప్యూటీ పోలీసు కమిషనర్ (అడ్మినిస్ట్రేటివ్) కేజీవీ సరిత హితవు పలికారు. 58వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో రచయిత్రి తానీషా రచించిన 'ఏ టేల్ ఆఫ్ లైస్' ఆంగ్ల నవల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని నవలను ఆవిష్కరించారు.

అనంతరం మాట్లాడుతూ ఈ నవల ఇతి వృత్తం అమ్మాయి అపహరణ నేపథ్యంగా సాగుతుందని, పోలీసు శాఖలో మహిళల సంఖ్య తక్కువ అని, నవలలో ముఖ్య పాత్ర మహిళా పోలీసు అధికారిణిది కావడం, విధినిర్వహణలో ఆమెకు ఎదురైన సవాళ్లు, విలువలను స్పృశిస్తూ ఈ నవల సాగడం పట్ల రచయిత్రిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ మేకా రమేష్, చుండి వెంకటేశ్వర్లు, డీన్ ఆచార్య రాజేష్, ఎడ్యుకన్సల్టెంట్ సుంకర నాగభూషణం, రచయిత పాపినేని సాయి, గ్రంథాలయ అధికారిణి వాణి తదితరులు పాల్గొన్నారు.

కళా సంపదను పరిరక్షించుకుందాం

● కలెక్టర్ లక్ష్మీశ ● 22, 23 తేదీల్లో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, గోళ్ల నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక జీవనశైలిలో మసకబారుతున్న కళలు, సాంస్కృతిక కళా సంపదను పరిరక్షించుకుంటూ వాటిని భావితరాలకు అమూల్యమైన వారసత్వ సంపదగా అందించేందుకు కవులు, రచయితలు, కళాకారులను ప్రోత్సహించేలా జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కోహెన్స్ సంస్థ సహకారంతో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ గురువారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులు, కార్టూనిస్టులను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కథలు, కవితలు, కార్టూన్ల విభాగంలో పోటీలు కూడా నిర్వహించడం జరిగిందని, 500కు పైగా ఎంట్రీలు వచ్చాయని, ఉత్తమ రచనలకు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నా మన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి జిల్లాలో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా మరో ముందడుగుగా సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రసిద్ధ సాహితీ వేత్తల ప్రసంగాలు, సాహితీ సేవా మూర్తులకు సత్కారాలు, కథ, కవిత, కార్టూన్ల పోటీ విజేతలకు నగదు బహుమతుల ప్రదానం ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. సమావేశంలో మల్లెతీగ మాసపత్రిక ఎడిటర్ కలిమిశ్రీ, సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు యేమినేని వెంకటరమణ, సాహితీవేత్త గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

జ్ఞానసముపార్జనకు గ్రంథాలయాలు

● ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి


బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు

విజయవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కాలేజీలో గ్రంథాలయం, సమాచారం శాస్త్ర విభాగం, ఎన్‌డీఎల్ఐ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, ఎన్‌డీఎల్ఐ క్లబ్ ప్యాట్రన్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, 'డ్రా టు ది లైబ్రరీ' వారోత్సవంతో జరిగిన గ్రంథాలయ వారోత్సవాలు బహుముఖ పాత్రను ప్రతిబింబిస్తూ, పుస్తకాల పఠనానికే పరిమితం కాకుండా జ్ఞానసముపార్జనకు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. వారాంతరంలో వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, పుస్తక సమీక్ష పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రేరియన్ జి.లుముంబా, అధ్యాపకులు డి.ఎస్.వి.ఎస్. బాలసుబ్రహ్మణ్యం, యూవీ రమణమూర్తి, కె.రమేష్, పద్మనాభం, ఎన్.జె.సుకుమార్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ లోన్ ఇప్పిస్తానంటూ మోసగించిన వ్యక్తిపై కేసు

విద్యాధరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ లోన్ ఇప్పిస్తానని ఓ యువతికి మాయమాటలు చెప్పి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకుని మోసం చేసిన గురునానక్ కాలనీకి చెందిన నవీన్ అనే వ్యక్తిపై గురువారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం విద్యాధరపురం సితార సెంటర్‌లో ఓ యువతి (24) కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె డిగ్రీ వరకు చదువుకుని ప్రస్తుతం ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. ఆమె ఉన్నత విద్య అభ్యసించటానికి గురునానక్ కాలనీకి చెందిన నవీన్ ఎడ్యుకేషన్ లోన్ ఇప్పిస్తానని పలుసార్లు రూ.73వేలు ఆన్‌లైన్ ద్వారా ఆమె నుంచి తీసుకున్నాడు. లోన్ ఇప్పించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి నవీన్‌పై ఫిర్యాదు చేసింది. పోలీసులు నవీన్‌పై కేసు నమోదు చేశారు.

పొరుగు వారి హక్కులు పుస్తకావిష్కరణ



కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

లబ్బీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమాఅతె ఇస్లామి హింద్ ఈనెల 21నుంచి 30 వరకు నిర్వహిస్తున్న పొరుగు వారి హక్కులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జమాత్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్ షౌకత్ ఫహిం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ ఉద్యమం చేపట్టనున్నామని, ఇందులో భాగంగా సోదర దేశవాసులతో మమేకం అవుతు ఉండవలసిన నైతిక విలువలను, ఇస్లామీయ బోధనలను ప్రజలకు పరిచయం చేస్తామని తెలిపారు. ఉద్యమ కన్వీనర్ అబ్దుర్రహ్మాన్ సుఫీ మాట్లాడుతూ తమ సంస్థ జాతీయస్థాయిలో ఈ ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరీముద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పొరుగు వారి హక్కులపై అవగాహన కలిగించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మీడియా కార్యదర్శి అక్బర్ బాషా, ఉద్యమ సభ్యుడు డాక్టర్ సాదిఖ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుర్రషీద్, ఇలియాజ్, ఎస్ఐవో రాష్ట్ర అధ్యక్షుడు ఫహద్, అబ్దుల్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్, జూనియర్‌లు స్నేహపూర్వకంగా మెలగాలి

● మాచవరం ఎస్ఐ శ్రీనివాసరావు



మాచవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీనియర్, జూనియర్‌లు స్నేహ పూర్వకంగా మెలగాలని సిద్దార్థ మెడికల్ కాలేజీ విద్యార్థులకు మాచవరం ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడి కళాశాల ప్రతిష్టకు భంగం కలిగించవద్దని విద్యార్థులకు సూచించారు. సీనియర్, జూనియర్‌లు ఒకరిపట్ల మరొకరు మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన శిక్షలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్, వార్డెన్‌లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుల్తానా, పీడీ రాము, 2024 బ్యాచ్ మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వాసుత్రి వైద్యులు

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన ర్యాలీ

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అవగాహన వారోత్సవ ర్యాలీ గురువారం జరిగింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ వెంకటేశ్వరరావు, సీఏఎస్ఆర్ఎంవో డాక్టర్ వై.పద్మావతి, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ నాగేశ్వరరావు, మైక్రో బయాలజీ విభాగ అధ్యాపకులు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంఆర్ వల్ల కలిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నర్సులు, మెడికల్ విద్యార్థులకు సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ వెంకటేశ్వరరావు సూచించారు. అనంతరం ఏఎంఆర్ తగ్గించేందుకు ప్రతిజ్ఞ చేశారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ ఉద్యోగి

కృష్ణలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :కృష్ణలంకలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్, నెట్ వైర్ల కట్టలను గురువారం విద్యుత్ శాఖ ఏడీ పి.శ్రీధర్ దగ్గరుండి సిబ్బందిచే తొలగింపచేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'విద్యుత్ స్థంభాలా...కేబుల్ స్థంభాలా' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన ఏడీ శ్రీధర్ తమ సిబ్బందిచే కృష్ణలంక ఐడియల్ స్కూల్ సమీపంలోని విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్, నెట్ వైర్లను తొలగింపచేశారు.


ఆక్రమణలు తొలగిస్తున్న వీఎంసీ సిబ్బంది

హైస్కూల్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

భారతీనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పటమట హైస్కూల్ రోడ్డులో ఉన్న ఆక్రమణలను వీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం తొలగించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ పటమట హైస్కూల్ రోడ్డులో 80అడుగుల రోడ్డు ఉందని, ఇరువైపులా 20అడుగుల వరకు ఆక్రమణలు ఉన్నాయని, వాటిని అసిస్టెంట్ సిటీ ప్లానర్ అధికారి మోహన్‌బాబు తమ సిబ్బందితో తొలగించి 80అడుగుల రోడ్డును పునరుద్ధరించారని తెలిపారు. దాదాపు పది ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌ను తొలగించినట్లు తెలిపారు. నగర పరిధిలో అనధికారికంగా నిర్మాణాలు చేసినా, ఆక్రమించినా టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు తొలగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ జి.సామ్రాజ్యం, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కమల్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రత మనందరి బాధ్యత

శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ


మాట్లాడుతున్న డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

భారతీనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రత, పర్యావరణ రక్షణ మన అందరి బాధ్యత, ప్రతి ఒక్కరూ చెత్తను నాలుగు వర్గాలుగా వేరుచేసి ఇవ్వాలని నాలుగో డివిజన్ శానిటరీ అధికారి రామకృష్ణ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని 4వ డివిజన్ వెంకటేశ్వరనగర్ కాలనీలోని అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్, సెక్రటరీలతో డివిజన్ పబ్లిక్ హెల్త్ శానిటేషన్ విభాగం అధికారుల సమావేశం గురువారం జరిగింది.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లలో తప్పనిసరిగా నాలుగు వేర్వేరు డ్రమ్‌లు ఏర్పాటు చేసి, నివాసుల నుంచి తడి, పొడి, ప్లాస్టిక్, ప్రమాదకర చెత్తను ప్రత్యేకంగా సేకరించి మున్సిపల్ వర్కర్‌లకు అప్పగించాలని తెలిపారు. వేరుచేసిన చెత్తను మాత్రమే సేకరిస్తారని, ఈ విధానం అమలు కోసం మూడురోజుల గడువు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఎం.రమేష్ బాబు, శానిటరీ మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం ప్రత్యేక పూజలు

మొగల్రాజపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజు గురువారం మొగల్రాజపురం శివాలయంలో టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పటమట సతీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో సహస్ర లింగార్చన

ఇంద్రకీలాద్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కార్తీకమాసం గురువారం రాత్రి సహస్ర లింగార్చన సేవ, సహస్ర దీపార్చన, ఊంజల్ సేవలు జరిగాయి. మహా నివేదన, పంచ హారతులు, చతుర్వేద స్వస్తి జరిగాయి. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మాదిగల విజయోత్సవ సభ 4న

గాంధీనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి 59 షెడ్యూల్ కులాలకు న్యాయం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ డిసెంబరు 4న జింఖానా గ్రౌండ్‌లో 'మాదిగల విజయోత్సవ సభ'ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగలు, మాదిగ ఉపకులాలు, విద్యావంతులు, సామాజిక వేత్తలు, మేధావులు ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలేటి యేసుపాదం, నల్లూరి శేఖర్, సింగంపల్లి శ్రీను, ఎర్రంశెట్టి ప్రసాద్ రెల్లి పాల్గొన్నారు.



బారికేడ్లను ప్రారంభించి, ట్రాఫిక్ అధికారులకు అందజేస్తున్న మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ సీఎంవో డాక్టర్ రామకృష్ణ

బారికేడ్ల అందజేత

లబ్బీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో సిటీ ట్రాఫిక్ పోలీసులకు ట్రాఫిక్ బారికేడ్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించే కార్యక్రమంలో తమ వంతు బాధ్యతగా వీటిని అందిస్తున్నామని, తమ సంస్థ సామాజిక బాధ్యతతో పాటు ప్రజారోగ్యంపై నిబద్ధతగా ఉంటుందని తెలిపారు. ఏసీపీ ఎస్.ఆర్.వంశీధర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ వై.రవికుమార్‌లు మాట్లాడుతూ మ్యాక్సీవిజన్ సహకారాన్ని అభినందిస్తున్నామని, ప్రజలందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. మ్యాక్సీవిజన్ డాక్టర్లు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితా సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్, వైసీపీ, వామపక్ష నేతలు

'సర్' ప్రక్రియను నిలిపివేయండి

» రాష్ట్ర ఎన్నికల అధికారికి 10 వామపక్ష పార్టీల వినతి

» వైసీపీ, కాంగ్రెస్, జైభీమ్ భారత్ ప్రతినిధులూ హాజరు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు 2029 వరకు సమయం ఉన్నందున రాష్ట్రంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను నిలిపి వేయాలని పది వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ అంశంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరాయి. ఆ పార్టీల నేతలు గురువారం సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల ప్రధాన అధికారిని కలిసినవారిలో జె.అజయ్‌కుమార్(సీపీఐ), వి.శ్రీనివాసరావు(సీపీఎం), డి.హరినాథ్(సీపీఐ(ఎంఎల్) లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎం.రామకృష్ణ(సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ), ఖాదర్ బాషా(ఎంసీపీఐయూ), జానకిరాములు(ఆర్ఎస్‌పీ), సుధీర్(ఎస్‌యూసీఐ(సి), విద్యాసాగర్(వీసీకే)లతోపాటు పరసా సురేశ్‌కుమార్(జైభీమ్ భారత్), మల్లాది విష్ణు(వైసీపీ), ఎస్‌కే మస్తాన్‌వలీ(కాంగ్రెస్) ఉన్నారు. సర్‌పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని సీఈవో హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు.

విశాఖ ఉక్కుపై కేంద్రంతో ప్రకటన చేయించాలి: సీపీఐ

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మాలనుకుంటే తెలుగు జాతి క్షమించదని హెచ్చరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు గురువారం ఆయన లేఖ రాశారు.

'ఐబొమ్మ' రవి కేసు ఉచితంగా వాదిస్తా

» రవి తండ్రితో న్యాయవాది సలీమ్ భేటీ

ఆరిలోవ (విశాఖపట్నం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా పెదగదిలి సాలిపేటలో నివాసం ఉంటున్న 'ఐబొమ్మ' నిర్వాహకుడు రవి తండ్రి చినఅప్పారావును బుధవారం సాయంత్రం న్యాయవాది సలీమ్ కలిశారు. ఈ కేసును ఉచితంగా వాదించి, రవిని బయటకు తీసుకొస్తానని చెప్పినట్టు అప్పారావు తెలిపారు. కొన్ని పేపర్లపై సంతకాలు పెట్టాలని సలీమ్ కోరగా, తన ఆరోగ్యం బాగుండనందున కోర్టు చుట్టూ తిరిగే ఓపిక లేదని చెప్పి... సంతకం పెట్టేందుకు నిరాకరించానని చెప్పారు. కేసు వాదించి, రవిని బయటకు తీసుకురావాలంటే అతని వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకోవాలని సలీమ్ సూచించారని అప్పారావు పేర్కొన్నారు.

దేశ ఆర్థికవ్యవస్థకు ఉక్కు పరిశ్రమ వెన్నెముక

» గ్రీన్ స్టీల్ మిషన్‌పై కేంద్రం దృష్టి: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



న్యూఢిల్లీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవడానికి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉక్కు పరిశ్రమ వెన్నెముకగా నిలుస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. దేశ ప్రగతిలో ఉక్కు పరిశ్రమ కీలక పాత్రను పోషిస్తోందని, ప్రతి టన్ను ఉక్కు ఉత్పత్తి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆర్థిక వృద్ధికి నేరుగా దోహదపడుతోందని అన్నారు. భువనేశ్వర్‌లో జరుగుతున్న రెండు రోజుల చింతన్ శిబిర్‌లో గురువారం కేంద్ర మంత్రి కుమార స్వామితో కలసి శ్రీనివాస వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద ముడి ఉక్కు ఉత్పత్తిదారుగాను, రెండవ అతిపెద్ద ఉక్కు వినియోగదారుగా అవతరించి గణనీయమైన మైలురాయిని చేరుకుందని తెలిపారు. గత మూడేళ్లుగా దేశంలో భారీస్థాయిలో జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా ఉక్కుకు డిమాండ్ రెండు అంకెల రేటుతో పెరుగుతోందని శ్రీనివాస వర్మ వివరించారు. ఉక్కు మంత్రిత్వ శాఖ స్పెషాలిటీ స్టీల్ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆటోమొబైల్, రక్షణ వంటి కీలక పరిశ్రమలకు అవసరమైన స్పెషాలిటీ స్టీల్‌ను ఉత్పత్తి చేసేందుకు కంపెనీలను ప్రోత్సహించడానికి మంత్రిత్వ శాఖ ఉత్పత్తి అనుబంధ ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే 'గ్రీన్ స్టీల్ మిషన్' ద్వారా ఉద్గారాలను తగ్గించడం, శక్తి సామర్థ్యం గల సాంకేతికతలను ప్రోత్సహించడం 2070 నాటికి నికర శూన్య ఉద్గారాలను సాధించే దిశగా పరిశ్రమకు మద్దతు లభిస్తుందని వివరించారు.

మంటగలిసిన మానవత్వం!

» పసికందును ముక్కలుగా నరికి మురుగుకాల్వలో పడేశారు.. విశాఖలో దారుణం

కంచరపాలెం (విశాఖపట్నం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పసికందును ముక్కలుముక్కలుగా నరికారు...శరీర భాగాలను మురుగుకాల్వలో పడేశారు. ఎవరు చేశారో గానీ, ఈ అమానవీయ ఘటన విశాఖ నగరంలోని తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీలో గురువా రం వెలుగుచూసింది. తాటిచెట్లపాలెం సిగ్నల్ పాయింట్ నుంచి కప్పరాడ జంక్షన్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డును అనుకుని ఉన్న సంజీవయ్యకాలనీ కాలువలో పసికందు కాళ్లు, చేతులు, ఇతర శరీర భాగాలు స్థానికులు గుర్తించి కంచరపా లెం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.రవికుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని శరీర భాగాలను పరిశీలించి, పోస్టుమార్టం నిమి త్తం కేజీహెచ్‌కు తరలించారు. ఘ టన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తునా న్నరు. సీఐ రవికుమార్ నేతృత్వంలో కంచరపాలెం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్‌ను సరిగ్గా నిర్వహించడం లేదంటూ హైకోర్టులో పిటిషన్

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్‌ను సరిగ్గా నిర్వహించడం లేదంటూ దాఖలైన పిటిషన్ పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారం పై వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్ కాంప్లెక్స్ అపరిశుభ్రంగా మారిందని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నేషనల్ జనరల్ సెక్రెటరీ, విశ్రాంత రైల్వే సంక్షేమ అధికారి వై కొండలరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

సమూహ యూత్ లిటరరీ ఫెస్టివల్‌కు సోనీకి ఆహ్వానం

కంచికచర్ల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి రచయిత, మేధావి సామాజికవేత తంగిరాల సోనికి తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సమూహ యూత్ లిటరరి ఫెస్టివల్‌కు ఆహ్వానం అందింది. తెలుగు రాష్ట్రాల్లో రచయితలతో ముఖాముఖి నిర్వహిస్తున్న సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గ కంచికచర్ల గ్రామానికి చెందిన సోనీని పాల్గొనవలసినదిగా ఆహ్వానం అందింది. వీరనారా చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22, 23న ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్వేషకాలంలో రచయితలనే అంశంపై నవంబర్ 22న శనివారం కవి రచయిత మేధావి సామాజికవేత్త తంగిరాల సోని రెండు తెలుగు రాష్ట్రాల రచయితలు పాల్గొంటారు. ఏపీ నుంచి సోనికి మాత్రమే ఈ గౌరవం దక్కటం గమనార్హం. సోనికి సమూహ యూత్ ఫెస్టివల్ కు ఆహ్వానంపై పలువురు హర్షం వ్యక్తం చేన్నారు.

మన విప్లవతారలు

ఉమ్మడి కృష్ణా నుంచి విప్లవ ఉద్యమంలోకి టీచర్ల అడుగులు
బెజవాడ వేదికగా కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులు

జాతీయ స్థాయిలో విప్లవోద్యమ శంఖారావం పూరించిన ఉద్దండులు

● కొందరు ఉద్యమంతోనే బాగా తెలిస్తే.. మరికొందరు చనిపోయే వరకూ తెలియదు!

సమాజాన్ని మార్చే ఉపాధ్యాయ వృత్తిని నిర్వహిస్తూ ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి విప్లవోద్యమంలోకి అడుగులు వేశారు. జాతీయస్థాయిలో చెరగని ముద్ర వేశారు. కొన్ని దశాబ్దాల పాటు అజ్ఞాతంలో ఉంటూ సాయుధ పోరాటాల్లో పాల్గొన్నారు. జీవిత చరమాంకంలో అనారోగ్యాల బారిన పడి మృతి చెందారు. మావోయిస్టుల షెల్టర్ జోన్‌గా ఉండే ఉమ్మడి కృష్ణా జిల్లాలో పూర్వం విప్లవ ఉద్యమాల ఖిల్లాగా ఉండేది. అందులో బెజవాడ కీలక పాత్ర పోషించేది. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి దేశ విప్లవోద్యమాన్ని మలుపుతిప్పిన ఉద్దండుల గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఆంధ్రజ్యోతి, విజయవాడ:

కృష్ణకుమారి అలియాస్ నర్మదక్క



గన్నవరం మండలం కొండపావులూరులోని ఓ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన ఉప్పుగంటి నిర్మల కుమారి (అలియాస్ నర్మదక్క) మహారాష్ట్రలో కీలక దండకారుణ్య మహిళా నేతగా అవతరించారు. 2022లో ఏప్రిల్‌లో ఆమె కేన్సర్ వ్యాధితో మృతి చెందారు. స్థానిక విద్య అనంతరం పొలిటిక్నిక్ చదువు కోసం హైదరాబాద్ వెళ్లింది. అక్కడ విప్లవోద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న కిరణ్‌తో నిర్మలకు పరిచయం కాగా ఆయన్నే పెళ్లి చేసుకున్నారు. అనంతరం ప్రైవేటుగా హిందీ భాష నేర్చుకుని పట్టా సాధించారు. ఉద్యమ విస్తరణ, దండకారణ్య లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని మహారాష్ట్ర వెళ్లాల్సి వచ్చింది. అప్పట్లో అక్కడ ప్రవహించే నర్మదానదిని దృష్టిలో పెట్టుకుని పేరు మార్చుకున్నారు.ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఎన్నో పోరాటాలు చేశారు. తెలుగులో అరుణతార, సృజన, మహిళా మార్గం వంటి పత్రికలు నడిపారు. ఏనాడూ పోలీసులకు పట్టుబడని నర్మద 2018లో అనారోగ్యంతో బయటకు వచ్చి చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. దీంతో పోలీసులకు పట్టుబడ్డారు. కేన్సర్ పేషంట్ అని చెప్పినా బెయిల్ రాలేదు. వైద్యం అందని పరిస్థితుల్లో ఆరోగ్యం క్షీణించగా హోస్పైస్ కేంద్రానికి తరలించారు. 2022 ఏప్రిల్ 20న మృతి చెందారు. ఇంత చరిత్ర ఉన్న నర్మదక్క గురించి స్థానికంగా ఆమె చనిపోయే వరకు తెలియకపోవటం గమనార్హం. జాతీయ పత్రికల్లో వార్తలు వచ్చాక నర్మదక్క మరెవరో కాదు ఉప్పుగంటి నిర్మలకుమారి అని తెలిసింది.

కొండపల్లి సీతారామయ్య



కొండపల్లి సీతారామయ్య.. పరిచయం అక్కర లేని పేరు. గుడివాడ వద్ద నందివాడ మండలం, లింగవరం స్వగ్రామం. జొన్నపాడులో పెరిగారు. చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లాలోని జన్నారంలో 2 దశాబ్దాల పాటు నివశించారు. జాతీయ నక్సల్ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తిగా నిలిచారు. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ విడిపోయే సమయంలో రాజకీయ జీవితం నుంచి వైదొలిగారు. వరంగల్‌లోని సెయింట్ గాబ్రియేల్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేశారు. అక్కడే ఇంగ్లీషు టీచర్‌గా పనిచేస్తున్న కేజీ సత్యమూర్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్ - లెనినిస్ట్)లో చేరారు. 1972లో అంతర్గత కలహాలతో సీతారామయ్య కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీలో చేరారు. 1977 ఏప్రిల్ 26న ఆయన్ను నాగపూర్ పోలీసులు అరెస్టు చేశారు. జెయిల్‌పై విడుదలయ్యాక అజ్ఞాతంలో ఉన్నారు. 1980లో విజయవాడ కేంద్రంగా కేజీ సత్యమూర్తితో కలిసి పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ)ని ఏర్పాటు చేశారు. అంతర్గత విభేదాలతో పీడబ్ల్యూజీలో నెంబర్ 2గా ఉన్న కేజీ సత్యమూర్తి, బైరెడ్డి సత్యనారాయణ రెడ్డి బహిష్కరణ జరిగింది. తర్వాత కొండపల్లి పార్టీపై పట్టు పెంచుకున్నారు. 1993లో పోలీసులకు పట్టుబడ్డ కొండపల్లి కొన్నాళ్లకు విడుదలయ్యారు. జీవిత చివరి చరమాంకంలో విజయవాడలోని తన మనుమరాలి ఇంట్లో మృతిచెందారు.

కేజీ సత్యమూర్తి



మాజీ నక్సలైట్ నేత, ప్రముఖ విప్లవ రచయిత కేజీ సత్యమూర్తి (శివసాగర్) ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా జీ కొండూరు మండలానికి చెందిన వారు. కందులపాడులో తన పెద్ద కుమారుడి ఇంట్లో ఆయన చనిపోయారు. కంకిపాడు మండలం పునాదిపాడు, వరంగల్ జిల్లా ఖాజపేటలో నరి సెయింట్ గాబ్రియేల్, ఫాతిమా పాఠశాలల్లో ఇంగ్లీషు టీచర్‌గా పనిచేశారు. ఇక్కడే కొండపల్లి సీతారామయ్యతో పరిచయం ఏర్పడింది. ఉద్యోగం తర్వాత వివాహం చేసుకున్నారు. ముగ్గురు సంతానం కలిగాక పూర్తిస్థాయి విప్లవ పోరాటకారుడిగా మారిపోయారు. 3 దశాబ్దాల పాటు అజ్ఞాతంలో ఉన్నారు. పీపుల్స్‌వార్ గ్రూప్‌లో సీతారామయ్య తరువాత కేజీ నెంబర్ 2గా ఉన్నారు. పీపుల్స్‌వార్‌లో బ్రాహ్మణులు, రెడ్ల ఆధిపత్యం నడుస్తోందన్న ఆరోపణలు చేశారు. తర్వాత ఆయన్ను పీపుల్స్ వార్ నుంచి బహిష్కరించారు. దీంతో సాధారణ జీవితంలోకి వచ్చారు. 70ఏళ్ల వయసులో భార్య శివపార్వతితో కలిసి ఉన్నారు. సంతానం కూడా కొన్నాళ్ల పాటు పోరాటంలో ఉండి సాధారణ జీవితంలోకి ప్రవేశించా రు. చుండూరు ఊచకోత తర్వాత దళిత ఉద్యమ శ్రే ణులతో కలిసి పనిచేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చార్వాక ఆశ్రమం, దళిత మహాసభ వ్యవస్థాపకుడు కత్తి పద్మారావు స్థాపించిన లుంబినీ వనంలో ఉం టూ అంబేడ్కర్‌ను అధ్యయనం చేశారు. అంబేడ్కర్ సూ ర్యుడు వంటి పుస్తకాన్ని రచించారు. దళిత విప్లవకవిగా పేరు సాధించారు. 1968 నుంచి 1972 వరకు కేజీ రాసిన 'గెరిల్లా విప్లవ గీతాలు' 1972 నుంచి 1973 వరకు రాసిన 'జనం ఊపిరి', 'పది వసంతాలు', 'ఉద్య మ నెలబాలుడు' వంటి రచనలు ప్రాముఖ్యత పొందాయి.

స్నేహలతా రెడ్డి



కృష్ణాజిల్లా తేలప్రోలు గ్రామానికి చెందిన బొమ్మారెడ్డి స్నేహలతా రెడ్డి నక్సల్‌బరీ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని గెరిల్లా పోరాటాలు నిర్వహించారు. ఎమర్జెన్సీ సమయంలో మహబూబాబాద్ జిల్లాలోని ఒక గ్రామంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. తేలప్రోలు గ్రామంలో ఓ ధనిక రైతు కుటుంబంలో ఆమె జన్మించారు. ఏలూరులో డిగ్రీ బీఎల్ చదివారు. ఆ రోజుల్లోనే స్నేహలతారెడ్డి ఉన్నత విద్య అభ్యసించారు. ఆంధ్ర యూనివర్శిటీలో ఎంఏ చేశారు. పురుషాధిక్యత కింద నలిగిపోతున్న స్త్రీ హక్కులను కాపాడేందుకు ఎన్నో కథలు, కవితలు రాశారు. విప్లవం ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని గ్రహించి 1973లో గెరిల్లా దళంలో చేరారు. గెరిల్లా దళానికి రాజకీయ బోధకురాలిగా పనిచేశారు. 1974లో ఆమె మరణించారు.

గృహ నిర్మాణాల్లో ప్రజల సంతృప్తే గీటురాయి

● అలసత్వం వహించిన అధికారులపై కఠిన చర్యలు: కలెక్టర్

కలెక్టర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి కాన్ఫరెన్సు హాల్ లో గృహాల నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మించుకోవడం ఒక కల అని, దాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. వివిధ స్థాయిల్లో ఉన్న గృహాల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారుల బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. గృహ నిర్మాణంలో ప్రజల సంతృప్తే గీటురాయన్నారు. నెలవారీ లక్ష్యాలను ప్రతి ఒక్కరూ సాధించాలన్నారు. విధులలో అలసత్వం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. పీఎం ఆవాస్ యోజన (గ్రామీణ్) 2.0 సర్వే నిర్వహిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరవుతుందన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడీ రజనీకుమారి, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



వాయుసేనలో అవకాశాలపై నేడు అవగాహన సదస్సు

భారత వాయుసేన (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్)లో ఉద్యోగావకాశాలపై శుక్రవారం విజయవాడ లయోలా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి కాన్ఫరెన్సు హాలులో భారత వాయుసేన అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్, తత్సమాన విద్యార్హతలు (పాలిటెక్నిక్, ఐటీఐ) గల విద్యార్థులు 'అగ్నివీర్ - వాయు'గా భారత వాయుసేనలో చేరవచ్చని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాల భర్తీ అధికారి, సికింద్రాబాద్ 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ కమాండింగ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని కరీంనగర్, పెద్దపల్లి, గుంటూరు, పల్నాడు జిల్లాలలో 'అగ్నివీర్ - వాయు' పై అవగాహన సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. శనివారం తిరువూరు డివిజన్‌లో మరో అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

ప్రగతిపథంలో ఆకాంక్షిత బ్లాకులు

జిల్లాలోని ఆకాంక్షిత బ్లాకులైన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాలు వివిధ సూచికల్లో ప్రగతి పథంలో పయనిస్తున్నాయని, తాజాగా వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు ఆరోగ్యం, పోషణ విభాగాల్లో మెరుగైన ఫలితాలు సాధించినందుకు నీతి ఆయోగ్ ప్రశంసాపత్రాలు లభించాయని కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు మార్గనిర్దేశంతో ఈ రెండు బ్లాకుల్లో 40 సూచికలకు మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఆకాంక్షిత జిల్లాలు, ఆకాంక్షిత బ్లాకులకు సంబంధించి నీతి ఆయోగ్ నిర్వహించిన నీతి ఫర్ స్టేట్స్ (ఎన్ఎఫ్ఎస్) యూజ్ కేస్ చాలెంజ్‌లో 2 ప్రశంసా పత్రాలు పొందినట్లు వెల్లడించారు.

రైతుబజార్లలో అవకతవకలు కనిపిస్తే కఠిన చర్యలు

భారతీనగర్: రైతుబజార్ల నిర్వహణలో పారదర్శకతను పాటిస్తూ అవకతవకలకు తావులేకుండా వినియోగదారులకు సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. రైతుబజార్ల నిర్వహణ పరిశీలనలో భాగంగా గురువారం ఆయన పటమట హైస్కూల్ రోడ్డులోని రైతుబజార్‌ను తనిఖీ చేశారు. కూరగాయల విక్రయ స్టాల్స్‌ను, ధరల పట్టికలను, అమ్మకాలు నిర్వహిస్తున్న రైతుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను నిర్దేశ రేట్ల ప్రకారం అందించాలన్నారు. రేట్లకు సంబంధించిన బోర్డులు వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించాలన్నారు. రైతులకు కేటాయించిన స్టాల్స్‌లో వారే విక్రయాలు నిర్వహించాలన్నారు. ఆయా వివరాలతో కూడిన బోర్డును ప్రతి స్టాల్లో ప్రదర్శించాల్సిందేనన్నారు. రైతు బజార్ల లోపల, బయట ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నిషేధించాలన్నారు. జూట్‌క్లాత్ బ్యాగుల అమ్మకాలకు ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటుచేయాలని ఎస్టేట్ అధికారులకు సూచించారు. మార్కెటింగ్ శాఖ ఏడీ బీ రాజబాబు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి ఎం రమేష్‌బాబు, వీఎంసీ సిటీ ప్లానర్ కే సంజయ్, జోనల్ కమిషనర్ షమ్మి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలనాయక్, సీఈ సత్యకుమారి, ఏసీపీ మోహన్‌బాబు పాల్గొన్నారు.



ధీరజ్, లలిత్‌బాబును సత్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

ఆర్చరీ చాంపియన్‌లకు శాప్ చైర్మన్ సత్కారం

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్ స్వర్ణపతకం సాధించిన బొమ్మదేవర ధీరజ్, మలేషియాలో జరిగిన కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన రోహిత్ లలిత్‌బాబును శాప్ చైర్మన్ రవినాయుడు సత్కరించారు. శాప్ కార్యాలయంలో గురువారం శాప్ చైర్మన్‌ను ఇరువురు క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తాము సాధించిన పతకాలు గురించి చైర్మన్‌కు వివరించాడు. అనంతరం రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ వేదికపై సాధించిన విజయాలు మిగతా క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమన్నారు. నూతన క్రీడావిధానం ప్రకారం ప్రోత్సాహకాలు అందిస్తామని, వీరికి భవిష్యత్తులో శాప్ అండగా ఉంటుందన్నారు.



గేటు ముందు ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు

కదం తొక్కిన ఆర్టీసీ కార్మికులు

● కండక్టర్‌పై దాడికి నిరసనగా ఈయూ ఆధ్వర్యంలో నిరసన

● నెట్టెం, తాతయ్యను కలిసి విన్నపాలు

జగ్గయ్యపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టికెట్ తీసుకుని ప్రయాణించాలని కోరినందుకు జగ్గయ్యపేట ఆర్టీసీ డ్రైవర్ షేక్ ఖాదర్ సాహెబ్‌పై జరిగిన దాడికి నిరసనగా గురువారం ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. యూనియన్ అధ్యక్షుడు కల్యాణం కృష్ణారావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ టికెట్ తీసుకోవాలని కోరినందుకు అమా నుషంగా దాడిచేసిన ఘటనపై డీఎం కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చెప్పిన ప్రభుత్వం ఏయే సర్వీసులకు మినహాయింపు ఉందని ప్రజలకు అవగాహన కల్పించకపోవటంతో ఈ సంఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తెలంగాణలో ఆర్టీసీ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తే చట్టప్రకారం తీసుకునే చర్యలతో హెచ్చరిక బోర్డులను బస్సుల్లో ప్రదర్శిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని, పెరిగిన రద్దీకి తగ్గట్టు బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. నేతలు హిమామ్, ఆనంద్, సాంబశివరావు, జిలాని పాల్గొన్నారు.



జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీ చిన్ని

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

● ఎంపీ కేశినేని చిన్ని

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఎంపీ చిన్ని గురువారం ఆసుపత్రిని పరిశీలించి అధికారులు, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణం చేయాల్సి ఉందని, రోగులకు మెరుగైన వసతులు కల్పించాల్సి ఉందని అధికారులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి, మౌలిక వసతులు కల్పనకు సంబంధించి ఆసుపత్రిలోని పరిస్థితులను తెలుసుకునేందుకు వచ్చినట్టు చెప్పారు. రోజూ 3వేల మంది అవుట్ పేషెంట్‌లకు వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. ఆసుపత్రిలో కల్పించాల్సిన వసతులు, చేయాల్సిన అభివృద్ధిపై సమీక్షలో చర్చించినట్లు తెలిపారు. ఆసుపత్రికి అత్యాధునిక మెడికల్ పరికరాలు అవసరం ఉందన్నారు. ప్రతి నెలా ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి పనులు వేగంగా జరిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. సీఎస్ఆర్ ఫండ్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు నిర్మిస్తున్న కొత్త భవనం పనులు వేగవంతం చేసి త్వరలోనే భవనాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత పోస్టులు..

● యువకుడి అరెస్ట్

నందిగామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ప్రతిష్ట దిగజార్చేలా పోస్టులు పెట్టడంతో పాటు రాజకీయంగా గొడవలు సృష్టించే పోస్టులు పెడుతున్న సోమవరపు రవితేజపై నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వైవీవీఎల్ నాయుడు అందించిన సమాచారం ప్రకారం పట్టణంలోని 10వ వార్డులో నివాసముంటున్న రవితేజ ఇటీవల ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తనను చంపేదుకు ప్రయత్నిస్తున్నట్టు సోషల్‌మీడియాలో పోస్టు పెట్టాడని, అనంతరం పార్టీలో అంతర్గతంగా గొడవలు సృష్టించేలా పోస్టులు పెడుతున్నట్టు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న రవితేజపై టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు దారెల్లి రాజీవ్ గాంధీ ఫిర్యాదు మేరకు రవితేజపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

కలెక్టరేట్‌కు ఐఎస్‌వో 9001 హోదా కోసం దరఖాస్తు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: కలెక్టరేట్‌కు ఐఎస్‌వో 9001 సాధించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ప్రయత్నాలు ప్రారంభించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నప్పుడు పూర్వ కలెక్టర్ బాలయ్యానాయుడు లక్ష్మీకాంతం మచిలీపట్నం కలెక్టరేట్‌కు ఐఎస్‌వో 9001 సాధించారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా కొత్తగా ఆవిర్భవించింది. గతంలో విజయవాడ రెవెన్యూ డివిజనల్ కేంద్రంగా ఉన్న చారిత్రక కార్యాలయంలోనే ప్రస్తుతం పాలన నడుస్తోంది. కలెక్టర్ లక్ష్మీశ ఇక్కడే ఉంటున్నారు. పలు శాఖలు కూడా ఇక్కడి నుంచే పనిచేస్తున్నాయి. విజయవాడ కలెక్టరేట్ భవనానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. కలెక్టరేట్‌లో అత్యాధునిక చాంబర్లు, ప్రజలు కూర్చోవటానికి వెయిటింగ్ హాళ్లు, సమావేశ మందిరాలు, గ్రీవెన్స్‌కు వచ్చేవారికి ఆహారం అందించటంతో పాటు ఆర్వో ప్లాంట్, నిరంతరం చల్లటి నీటిని అందించటం జరుగుతోంది. కలెక్టర్ కార్యాలయం నుంచి కింద నుంచి పైఫ్లోర్‌లోకి మార్చారు. ఈ క్రమంలో లిఫ్ట్ కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అది కూడా పూర్తికాగానే ఐఎస్‌వో 9001కు దరఖాస్తు చేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్‌ఈ) శాంతిప్రియ


ప్రజా విశ్వాసానికి సంరక్షకులుగా పనిచేద్దాం

● ఘనంగా 5వ ఆడిట్ దివస్ వేడుకలు ప్రారంభం

● ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్‌ఈ) శాంతిప్రియ

కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతతో వినూత్న ఆడిట్ పద్ధతులను అవలంబిస్తూ భవిష్యత్తుకు బాటలు వేసేలా మానవవనరులను తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ (ఏ అండ్ ఈ) ఎస్ శాంతిప్రియ తెలిపారు. గురువారం స్టాలిన్ బిల్డింగ్ 8వ అంతస్తులోని మల్టీపర్పస్ హాల్‌లో శాంతిప్రియ చేతులమీదుగా 5వ ఆడిట్ దివస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శాంతిప్రియ మాట్లాడుతూ అధునాతన సాంకేతికతలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సేవలను పరిపాలనలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఏఎంజీ-3) సుష్మా మాట్లాడుతూ భారత కంప్ట్రోలర్, ఆడిట్ జనరల్ నాయకత్వంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలు వ్యవస్థ నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించనున్నాయన్నారు. 5వ ఆడిట్ దివస్ వేడుకల్లో భాగంగా క్విజ్ పోటీలు, ఆర్‌అండ్‌బి వర్క్‌షాప్, డ్రాయింగ్ పోటీలు, ఎయిమ్స్ ద్వారా వైద్య ఆరోగ్యంపై చర్చ, స్వయం ఆర్థిక అకౌంట్స్ వర్క్ షాప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) ఆర్ శ్యామ్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అడ్మిన్) వీ లలిత కుమార్, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కుశాల్, నాబార్డ్ జీఎం మహేష్‌సింగ్, ఆర్బీఐ డీజీఎం అనంతి, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్స్ విజయవాడ డైరెక్టర్ రమేష్ శ్రీకొండా, కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

విశేషం



సత్యలోకం అనగానే బ్రహ్మ, వైకుంఠం అనగానే శ్రీహరి, కైలాసం అనగానే శంకరుడు, శ్రీమన్నగరం అనగానే లలితాదేవి గుర్తుకు వచ్చినట్టు... సత్యసాయి అనగానే పుట్టపర్తి గుర్తుకు వస్తుంది. ఈర్ష్య, ద్వేషం, అసూయ, అసహనం లాంటివి మచ్చుకైనా కనిపించని నిరంతర దైవ ధ్యానమయమైన ఆలయం... ఆయన హృదయం. మానవతా సరోవరాలు ఆయన నేత్రాలు. ఆయన చెవులు ఎవరి ఆర్తి ఎంతటితో ఆలకిస్తూ, 'దాన్ని ఎలా తీర్చాలా?' అని పరితపించే మాతృసమానమైన రక్షణ మందిరాలు.

ప్రేమైకమూర్తి

23న శ్రీసత్యసాయిబాబా జయంతి

శ్రీ సత్యసాయిబాబా కారణ జన్ముడు. అలా కానట్టయితే... కేవలం ఎనిమిదో తరగతి చదివి, సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల వాఙ్మయ పరిచయం ఏమాత్రం లేకుండా... ఆశువుగా దైవ కీర్తనలు పాడడం, సంస్కృత శ్లోకాలను వల్లించడం, పండితులకు కూడా అంతుపట్టని సమన్వయ విధానాలు లాంటివి స్వామి ప్రదర్శించే అవకాశం లేదు. తొమ్మిదేళ్ళ వయసు వచ్చినప్పటి నుంచి నిరంతరం ధ్యానంలోనే ఆయన ఉండేవారు. ఈ ధోరణి ఆయన తల్లిదండ్రులకు, ఎరిగినవారికి ఏవేవో భయాలు కలిగించాయి. ధ్యానంలో ఉండే రుచిని వారికీ తెలియజేస్తే ఆ అపోహలు తొలగిపోతాయని స్వామి భావించారు. వారందరినీ దగ్గరకు చేర్చి సామూహిక భజనలు చేయించసాగారు. స్వామి పాడుతున్న కీర్తనలకు, శ్లోకాలకు అర్థాలు తెలియకపోయినా... ఆ సామూహిక రమణీయ దైవ ధ్యాన నాదం అందరిలోనూ ఏదో తెలియని స్ఫూర్తి కలిగించింది. సాధారణ జీవులుగా ఈ లోకం నుంచి నిష్క్రమించడం కాకుండా... తమ జీవితాలను ధన్యం చేసుకోవాలనే తపన పెరిగింది. క్రమంగా ధ్యానాన్ని తీవ్రతరం చేసిన స్వామి... తపస్సు ప్రారంభించారు. ఈ వార్త గ్రామ గ్రామాలకూ వ్యాపించింది. 1941లో... అంటే తన పదిహేనవ ఏట... ఈ ప్రపంచంలో ఏం జరగబోతోందో స్వామి వివరించి చెప్పారు. అది అక్షర సత్యం అయింది.

ధ్యానం, సేవ, ప్రేమ

నిష్కల్మషమైన మనసు ఏ భావాన్ని బుద్ధిపూర్వకంగా పలికిస్తుందో... అది నిజమై తీరుతుందనడానికి ఆయన మాటలే సాక్ష్యం. "ఆ దైవమే మన శరీరాన్ని ఒక పనిముట్టుగా ఉపయోగించుకోవాలని అనుకుంటే... మనం ఎవరెవరో గొప్పవారిని ఆశ్రయించం, ప్రాధేయపడం. వారే మన దగ్గరకు వస్తారు. "ఇంటికి కాపలాగా ఉన్న నల్లకుక్కకు అన్నం పెట్టాలంటే... తినేసిన విస్తరాకులను దాని ముందు పడెయ్యం. చక్కగా విస్తరి నిండా అన్నం పెట్టి ప్రేమగా పిలుస్తాం. ఆ విస్తరిని చూపిస్తాం. అది తింటూ ఉంటే ఆనందపడతాం. అలాంటి నల్ల కుక్కను నేను" అని షిరిడీ సాయిబాబా అన్నారు. "దైవం మనకు శరీరమనే రమణీయ సౌధాన్ని "చక్కగా వాడుకో!" అని ఇచ్చాడు. మనం ఉన్నంతకాలం దాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. ఆ సౌధంలో వెలుగును ఇచ్చే దీపాన్ని వెలిగించాలంటే దైవధ్యానమే సరైన ఉపాయం. అందుకే నిరంతరం ధ్యానం చేస్తూ ఉందాం. వాల్మీకి, వ్యాసాది మహర్షులు, దేవతలు కూడా తపస్సు ద్వారానే శక్తిమంతులయ్యారు. ఇదంతా వారు దీన రక్షణ కోసమే కదా చేసింది" అని శ్రీరామకృష్ణ పరమహంస చెప్పారు. మనం ఆ మార్గంలో నడుద్దాం" అని పిలుపునిస్తూ... దైవ ధ్యానాన్ని విస్తృతం చేయడానికి సత్యసాయిబాబా ప్రయత్నించారు. దానికి సేవ, ప్రేమ అనే రెండు అంశాలను జోడించారు.

సంకల్పం సాకారమై...

శ్రీసత్యసాయి సంకల్పమే మానవాళి శ్రేయస్సుకు తరుణోపాయమని దైవం భావించాడు కాబట్టే... సాకమ్మ అనే పుణ్యాత్మురాలు నేటి ప్రశాంతి నిలయాన్ని స్వయంగా నిర్మించి ఇచ్చారు. అక్కడ నిరంతరం రుద్ర పారాయణ జరుగుతూ ఉంటుంది. 1958లో వైద్యావసరాలను ఉచితంగా తీర్చాలనుకుంటున్నానని ఆయన ప్రకటించగానే... జనరల్ ఆసుపత్రి ఏర్పాటయింది. అక్కడ సేవలకు ఎవరూ ఏమీ ఇవ్వనక్కరలేదనే ప్రకటనలు కనిపిస్తాయి. పిల్లలకు నీతి కథలను, పురాణ గాథలను వినిపించాలని ఆయన చెప్పగానే... 1966లో బాలవికాస్ ఆవిర్భవించింది. అక్కడ ఎందరో తల్లులు ఉచితంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 1971లో బెంగళూరులో కళాశాల, 1981లో అత్యున్నతమైన విశ్వవిద్యాలయం, దైవధ్యానంలో మనశ్శాంతిని పొందాలని వస్తున్న 185 దేశాల భక్తుల కోసం విమానాశ్రయం, 1992లో అంతర్జాతీయ ప్రమాణాలతో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 1995లో... 600కు పైగా గ్రామాలకు, ఏడు పట్టణాలకు శాశ్వతంగా జలవసతి కల్పించే రాయలసీమ తాగు నీటి పథకం... నిర్విఘ్నంగా ఏర్పాటయ్యాయి. ఆరువేలమందికి పైగా విదేశీ ప్రతినిధులతో యువ జన సమ్మేళనం, సామూహిక ఉపనయన కార్యక్రమం, నిరంతర వేద ఘోష, నిత్య నగర సంకీర్తన, మహనీయుల ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, పండుగ రోజుల్లో దేవాలయాలకన్నా మిన్నగా యజ్ఞయాగాది కార్యక్రమాలు... ఇలా ఎన్నో కార్యాలు అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉన్నాయి.

అంతా ఆయన ఆశీర్వాదం...

ఇలా ఒక్కొక్కటీ వివరించాలంటే ఒక్కొక్క గ్రంథమే అవుతుంది. ప్రశాంతి నిలయంలో ఎనభై వేలమందికి పైగా కూర్చున్నా... చిన్న ధ్వని కూడా వినిపించదు. అందరూ స్వచ్ఛమైన తెల్లటి వస్త్రాలతో ఒకేలా ఉంటారు. ఎలాంటి ప్రకటనలు ఉండవు. ఎవరి తరువాత ఎవరు మాట్లాడాలో, ఏ భాషా గీతాన్ని ఆలపించాలో... అంతా క్రమబద్ధంగా సాగిపోతుంది. కోటీశ్వరుల నుంచి సామాన్యుల వరకూ, రాజకీయ నేతలు, కలెక్టర్ల లాంటి ఉన్నతాధికారుల నుంచి మామూలు వ్యక్తుల వరకూ అందరూ అక్కడ సమానమే. అందరూ సేవకులుగా, ప్రేమస్వరూపుల్లా కనిపిస్తారు. ఇదంతా శ్రీసత్యసాయి సంకల్పబలం, ఆశీర్వాద ఫలం.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

పర్వదినం

(26న సుబ్రహ్మణ్య షష్ఠి)

అగ్నిస్వరూపుడి ఆరు క్షేత్రాలు

మన దేశంలో సుబ్రహ్మణ్య ఆరాధన అనాది కాలం నుంచి వస్తోంది. సనాతన ధర్మంలో ఆరు మతాలు ఉన్నాయి. వాటిలో కుమారోపాసన (సుబ్రహ్మణ్యోపాసన) ఒకటి. మిగిలినవి గాణపత్య, శైవ, వైష్ణవ, సౌర, శాక్తేయాలు. పరమాత్మను సుబ్రహ్మణ్య రూపంలో ఆరాధించడం స్కాంద మతం. అందులో ఆయనను అగ్నిగర్భుడిగా భావిస్తూ... 'సుబ్రహ్మణ్యోం సుబ్రహ్మణ్యోం' అంటూ ఉపాసకులు పూజిస్తారు. సుబ్రహ్మణ్యారాధన అగ్ని ఉపాసనతోనే జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. కాగా... శ్రీశంకర భగవత్పాదులు ఏర్పరచిన పంచాయతన పూజా విధానంలో సుబ్రహ్మణ్యుడి ప్రస్తావన లేదు. అయితే... పూజకు ముందు చేసే దీపారాధన... శివశక్త్యాత్మకుడైన సుబ్రహ్మణ్యుణ్ణి ఆరాధించడమేననేది తత్త్వజ్ఞుల అభిప్రాయం.

సుబ్రహ్మణ్యుడు శివపార్వతుల కుమారుడు... ఆయనను 'కుమారస్వామి 'అని పిలుస్తారు. శివుడు అవ్యక్త బ్రహ్మం అయితే... పార్వతి వ్యక్త స్వరూపం. ఆ ఉభయులు కలిసిన విశ్వవ్యాపకశక్తి, నాలుగు దిక్కులలో పైనా, కిందా వ్యాపించిన విశ్వచైతన్యం సుబ్రహ్మణ్యుడు. కార్తికేయుడిగానూ ఆయన ప్రసిద్ధుడు. ఆరు ముఖాలతో ఆయన విరాజిల్లుతున్నాడు. ఆయనకు నాలుగు చేతులు. ఒక చేతిలో మహాశక్తి, మరో చేతిలో వజ్రాయుధం ఉంటాయి. ఒక చెయ్యి కటిపై ఉంటుంది. మరొకటి అభయహస్తం. తమిళనాడులో సుబ్రహ్మణ్యారాధన ఎక్కువగా ఉంటుంది. ప్రతి శివాలయంలో సుబ్రహ్మణ్యుడికి ప్రత్యేకంగా ఉపాలయం ఉంటుంది. రాష్ట్రంలో ప్రసిద్ధమైన ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలు ఉన్నాయి. అవి:

తిరుప్పరన్‌కుండ్రమ్: ఈ క్షేత్రం మదురైకి దగ్గరలో, ఎత్తైన కొండపై ఉంటుంది. ఆ కొండ శివలింగాకారంలో ఉండడం వల్ల దాన్ని 'శివమలై' అని వ్యవహరిస్తారు. ఈ కొండ మీద తన బల్లెంతో స్వామి తీర్థాలను సృష్టించాడని, శూరపద్ముడు అనే రాక్షసుణ్ణి ఆయన వధించి, ఇంద్రుడికి క్షేమాన్ని కలిగించాడనీ, అందుకు కృతజ్ఞతగా తన కుమార్తె దేవసేనతో కుమారస్వామి వివాహాన్ని ఇంద్రుడు ఇక్కడ జరిపించాడని స్థలపురాణం చెబుతోంది.

తిరుచెందూర్: తిరునల్వేలి జిల్లాలో సముద్ర తీరాన ఉన్న విశాలమైన ఆలయం. శివుణ్ణి అభిషేకించడం కోసం సుబ్రహ్మణ్యుడు తన వేలాయుధంతో ఇక్కడ పుష్కరణిని సృష్టించాడు. పక్కనే సముద్రం ఉన్నప్పటికీ... పుష్కరణిలో నీరు తియ్యగా ఉంటుంది. శ్రీ ఆదిశంకరాచార్యులు ఈ క్షేత్రాన్ని దర్శించి, 'సుబ్రహ్మణ్య భుజంగ ప్రయాత స్తోత్రం' రచించారు.

పళని: తిరుచ్చి-మదురై మధ్యలో ఉన్న కొండపై ఉన్న క్షేత్రం ఇది. ఇక్కడ కుమారస్వామిని 'దండాయుధపాణి' అని పిలుస్తారు. కొండమీద 'శరవణపొయిగై' అనే తీర్థం ఉంది.

స్వామిమలై: తండ్రి అయిన పరమశివుడికి ప్రణవ రహస్యాన్ని సుబ్రహ్మణ్యుడు బోధించిన క్షేత్రం ఇది. అందుకే ఇక్కడ స్వామిని 'శివగురునాథుడు' అని కీర్తిస్తారు. తన సర్వశక్తులు కోల్పోయిన ఇంద్రుడు... సుబ్రహ్మణ్యుడి అనుగ్రహంతో వాటిని తిరిగి పొందాడని, అందుకు కృతజ్ఞతగా తన వాహనమైన ఐరావతాన్ని ఆయనకు బహూకరించాడనీ క్షేత్రపురాణం చెబుతోంది.

తిరుత్తణి: ఈ క్షేత్రం తిరుపతికి సమీపంలో ఉంది. ఆహ్లాదకరమైన కొండపై కొలువైన స్వామి... గిరిజనురాలైన వల్లీదేవిని ఇక్కడ వివాహం ఆడాడని ప్రతీతి. నాలుగు ప్రాకారాలు, 365 మెట్లు కలిగిన ఈ క్షేత్ర దర్శనం మరువరాని అనుభూతిని కలిగిస్తుంది.



పళముదిర్ చోలై: ఇది మదురైకి సమీపంలో ఉంటుంది. శివ దంపతుల, విష్ణు దంపతుల సమైక్య, సమన్వయ స్వరూపమైన పరబ్రహ్మమే ఇక్కడి సుబ్రహ్మణ్యుడని స్కాంద పురాణం చెబుతోంది. ఈ స్వామిని అర్చిస్తే, శివ పార్వతులను, లక్ష్మీ నారాయణులను పూజించిన ఫలం దక్కుతుందని శాస్త్రవచనం.

• ఎ.సీతారామారావు

తెలుసుకుందాం

విగ్రహాలు లేదా ప్రతిమలు మూడు రకాలు... చిత్రం, చిత్రార్ధం, చిత్రాభాసం. ఈ మూడు రూపాలు పూజకు అర్హత కలిగినవేనని శిల్ప ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి.

చిత్రం, అర్ధ చిత్రం, చిత్రాభాసం

చిత్రం: 'చిత్రం' అంటే పరిపూర్ణ విగ్రహ స్వరూపం. అన్ని అవయవాలతో, శాస్త్రం సూచించిన కొలతలతో, నియమాలను అనుసరిస్తూ చేసిన సంపూర్ణ విగ్రహాన్నే 'చిత్రం' అంటారు. కేవలం విగ్రహం ముందు భాగాన్నే కాకుండా... వెనుక భాగాన్ని కూడా ప్రామాణికంగా మలచుతారు. సాధారణంగా మనం చూసే విగ్రహాలన్నీ ఈ కోవలోనికే వస్తాయి. ఈ ప్రతిమా రూపాలను ఆరాధిస్తే... వాటి ద్వారా కలిగే ఫలితాలు కూడా సంపూర్ణంగా లభిస్తాయి. అందుకే వీటిని 'పూర్ణ చిత్రాలు' అని కూడా అంటారు.

అర్ధ చిత్రం: ఏదైనా బండరాతిమీద, గోడ మీద... ప్రతిమ తాలూకు ముందు భాగాన్ని మాత్రమే శిల్పంగా చెక్కిన విగ్రహాలను 'చిత్రార్ధం' లేదా 'అర్ధ చిత్రం' అంటారు. అంతే కాదు, విడిగా తయారు చేసిన విగ్రహాలలో కూడా... వెనుక భాగం కనిపించకుండా, చదరంగా ఉండేలా లేదా ఆకారం లేకుండా తయారు చేసే వాటిని 'చిత్రార్ధం' అంటారు. ఈ రకం ప్రతిమలను ఆరాధిస్తే... అర్ధ ఫలితమే లభిస్తుంది.

చిత్రాభాసం: వస్త్రాల మీద, గోడల మీద, బండరాళ్ళ మీద, శిలా ఫలకాల మీద, కొయ్యల మీద, కాగితాల మీద రేఖామాత్రంగా రూపొందించేవాటిని 'అభాస చిత్రాలు' లేదా 'చిత్రాభాసాలు' అంటారు. మందమైన కాగితాన్ని గానీ, వస్త్రాన్ని కానీ గోటితో నొక్కుతూ రూపకల్పన చేసిన బొమ్మలు, వివిధ రకాల రంగులతో, వివిధ మాధ్యమాల మీద గీసిన బొమ్మలు ఈ కోవలోకి వస్తాయి. సాధారణంగా వీటిని 'చిత్ర పటాలు' అంటారు. శాస్త్ర ప్రకారం ఈ ప్రతిమలు కూడా ఆరాధనీయాలే. అయితే ఫలితాలు సాధారణంగా ఉంటాయి.

సాకార స్వరూపంలోని భగవంతుణ్ణి ఆరాధించడానికి పవిత్రమైన దేహ సంస్కారం, ప్రశాంతమైన చిత్తం, ప్రగాఢమైన సంకల్పశుద్ధి ప్రధానమైనవి. ఇవి కలిగిన భక్తులకు శీఘ్రంగా సంకల్ప సిద్ధి కలగడానికి ప్రతిమా ఆరాధన దోహదం చేస్తుంది.



• దగ్గుపాటి నాగవరప్రసాద్, స్థపతి, 9440525788


సహజయోగ

శ్రీ ఆది శంకరులను ఆయన గురువు గోవింద భగవత్పాదులు "నీవు ఎవరు?" అని అడిగిన ప్రశ్నకు సమాధానం... ఆత్మాష్టకం. అందులో ఆత్మ గురించి, ఆత్మ స్వరూపం గురించి శ్రీ శంకరులు చాలా లోతుగా వివరించారు. "మీ ఆత్మ గురించి తప్పకుండా తెలుసుకోవాలి" అని ఎందరో అవతారపురుషులు చెప్పారు. ఎందుకంటే... మనిషి తన ఆత్మ గురించి తెలుసుకోకుండా పరమాత్మ గురించి తెలుసుకోలేడు. ఆత్మ అనేది మన హృదయంలో ఉన్న పరమాత్మకు ప్రతిబింబం. అది నీటిలో కనిపించే సూర్యుడి ప్రతిబింబంలా ఉంటుంది. నీటిలో మనం సూర్యుణ్ణి ప్రతిబింబ రూపంలో చూస్తున్నప్పటికీ... ఆయన ఆ నీటిలో ఉండడు. ఎక్కడో ఆకాశంలో ఉంటాడు. అదే విధంగా ఆత్మ కూడా చిన్నదే అయినా... దాని మూలం అన్నిటికీ అతీతమైనది, అపరిమితమైనది. దాన్ని భగవంతుడు మన సూక్ష్మ శరీర వ్యవస్థలో, హృదయ స్థానంలో అంతర్గతంగా ఏర్పాటు చేశాడు.

పరమాత్మకు ప్రతిబింబమే ఆత్మ

ఆ వెలుగులలో...

భగవంతుడు తన సంకల్పంతో కుండలినీ శక్తిని కూడా మనలో ఏర్పాటు చేశాడు. అది మన వెన్నెముక చివరి భాగాన... త్రికోణాకారంలో ఉండే ఎముక లోపల నిక్షిప్తమై ఉంటుంది. మనం మనలో ఉన్న ఆత్మ తాలూకు ప్రతిబింబాన్ని తెలుసుకొనేలా చేసేది ఆ కుండలినీ శక్తే. సహజయోగంలో కుండలినీ ఉత్థానం చాలా సులువైనది, అది తక్షణమే జరుగుతుంది. మన గత జన్మ పాపకర్మల ప్రభావాన్ని తుడిచేసుకోవడానికి, పూర్వం నుంచి మనలో పోగు చేసుకున్న మురికిని వదుల్చుకొని స్వచ్ఛంగా ఉండడానికి అది సహాయపడుతుంది. కలియుగపు చీకటి ఛాయలు సమస్త ప్రపంచాన్నీ చుట్టుముడుతున్న ఈ సమయంలో... మన ఆత్మజ్యోతి ఉన్నతంగా ప్రజ్వలిస్తుంది. ఆ వెలుగులో మనం పవిత్రతను, ఆనందాన్ని, సౌభాగ్యాన్ని పొందగలుగుతాం. ఆ వెలుగుతోనే ప్రపంచంలోని చీకటిని పారద్రోలగలుగుతాం. ఇది చాలా మహత్తరమైన కార్యం. దీనికోసం మనలోని ఆత్మజ్యోతిని పరిశుభ్రంగా ఉంచుకోవడం అవసరం. దానివల్ల మన పాపాలు, గత జన్మ కర్మలు, అహంకారం... ఇలా అన్నీ తుడిచిపెట్టుకుపోతాయి.



మరణం ఒక మజిలీ...

ఈ లోకంలో మానవుడి తీరును అర్థం చేసుకోవడం కష్టం. దానికన్నా భగవంతుణ్ణి అర్థం చేసుకోవడం చాలా సులువు. ఎందుకంటే ఆయన ఎప్పుడూ ఒకేలా ఉంటాడు. ఆయనకు ద్వంద్వ వైఖరులు లేవు. మానవులలో ద్వంద్వ వైఖరే కాదు... అనేక విచిత్రమైన లక్షణాలు ఉన్నాయి. అవి మనని అరిషడ్వర్గాలకు బానిసలుగా చేస్తాయి. ఆ స్థితిని అధిగమించి, ఆత్మావలోకనం చేసుకున్నప్పుడు... మన ఆత్మకు మూలమైన పరమాత్మను కనుక్కోగలుగుతాం. "మానవుడి ఉనికి ఆత్మ. జననం నుంచి మరణం వరకూ శరీరం ఒక్కొక్క దశ నుంచి ఎలా ప్రయాణిస్తుందో... ఆత్మ కూడా అదే విధంగా ఒక దేహం నుంచి మరో దేహానికి వెళుతుంది. వివేకవంతులు జననం, మరణం అనే మాయలో పడకుండా సత్యాన్ని గ్రహించాలి. బాహ్య శరీరంమీద మనకు ఉన్న మమకారం వల్ల బాధ పుడుతోంది. అనంతమైన ఆత్మకు మరణం అనేది ఒక మజిలీయే కానీ అంతం కాదు" అని అర్జునుడికి శ్రీకృష్ణుడు హితవు చెప్పాడు. ఆత్మ నిత్యమనీ, నాశనం లేనిదనీ, అన్నిటికీ అతీతమనీ, కాబట్టి ఆత్మ తత్త్వాన్ని తెలుసుకొని బంధవిముక్తి పొందాలనీ సూచించాడు. గీతోపదేశం ద్వారా అర్జునుడి దృష్టిని ఆత్మ వైపు మరల్చి, ఆత్మసాక్షాత్కారం కలిగేలా చేశాడు శ్రీకృష్ణుడు.

నిర్మల చిత్తంతోనే సాధ్యం

'య నేతి నేతి వచనే నిగమ అగోచ...' అని చెబుతున్నాయి ఉపనిషత్తులు. "ఇది బుద్ధి కాదు, వివేకం కాదు, పంచభూతాలు కాదు, చిత్తం కాదు, ఇంద్రియాలు కాదు, దుఃఖం కాదు, సుఖం కాదు... వివిధ ఆలోచనలు, బంధాలతో సతమతం అవుతున్న మన మనసుకు 'ఇది కాదు, ఇది కాదు' అని ప్రతిదానికి చెప్పుకొంటూ పోతే... ఆలోచనలతో నిండిన పాత్ర ఖాళీ అయిపోతుంది. అప్పుడు ఆత్మ స్వరూపాన్ని గ్రహించగలుగుతాం" అని దాని అర్థం. యోగం అంటే... మనలో ఉన్న కుండలినీ శక్తి మన ఆత్మను ప్రకాశవంతం చేస్తూ... సహస్రార చక్రంలో పరమాత్మను కలవడమే. అటువంటి యోగం పొందాలన్న సద్బుద్ధి జన్మజన్మల పుణ్యఫలం వల్ల వస్తుంది. ఈ జన్మలో కలిగే నిర్మలమైన చిత్తం ద్వారానే అది సాధ్యం. అలాంటి సద్బుద్ధి ఉన్నవారే నిజమైన సత్యసాధకులు. శాంతి అనేది ఉపన్యాసాల వల్ల, ఉపవాసాల వల్ల రాదు. సహజంగా యోగాన్ని పొందడం ద్వారానే, అంటే పరమాత్మతో మనం ఐక్యం అయితేనే... ఆ శక్తి మనలో ప్రసరించి, మనకు ఆనందాన్ని శక్తిని కలుగజేస్తుంది. కుండలిని ఉత్థానం చెంది, ఆ శక్తి ఊర్ధ్వముఖంగా ప్రయాణించి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించుకొని, సహస్రార చక్రాన్ని చేరుకున్నప్పుడు... సాధకునిలో ఆత్మ ప్రకాశిస్తుంది. అదే ఆత్మసాక్షాత్కారం. దాన్ని పొందిన వ్యక్తి... తాను శరీరం, బుద్ధి, రూపం... ఇలా ఏదీ కాదనీ, కేవలం ఆత్మను మాత్రమేననే వాస్తవాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. నిరంతర ధ్యానం ద్వారా కులమతాలకు, రాగద్వేషాలకు అతీతుడిగా ఉంటూ... ఆత్మస్వరూపునిగా వ్యక్తం కావడానికి కృషి చేస్తూ ఉంటాడు.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

ఆహ్వాన సన్నాహం

ఒక ఊరుకు ఎవరైనా ప్రముఖుడు రాబోతున్నారంటే... అక్కడ ఉండే అధికారులు, గ్రామ పెద్దలు ముందుగానే ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. ఊరు ఊరంతా ఆయనను స్వాగతించడానికి సంసిద్ధం అవుతుంది. అదే విధంగా... ఏసు ప్రభువు ఉద్భవించబోతున్నట్టు దీర్ఘదర్శులు ముందుగానే చూచాయగా చెప్పారు. ప్రవక్తలు ఆయనకోసం పడిగాపులు కాశారు, తపోదీక్షల్లో, ప్రార్థనల్లో మునిగిపోయారు. ఆయన ద్వారా తాము ఆశించినవన్నీ నెరవేర్చుకోవడానికి సిద్ధమయ్యారు. క్రీస్తు రాబోతున్నాడని గొప్పగా ప్రకటించి, ఆయన మార్గాన్ని సిద్ధం చేసినవారిలో ఇద్దరు ప్రధానంగా కనిపిస్తారు. వారిలో ఒకరు యెషయా ప్రవక్త. ఏసు రాక గురించి 700 ఏళ్ళ క్రితమే తెలియజేశాడు. రెండో వ్యక్తి... ఏసుకు సమకాలీకుడైన యోహాను ప్రవక్త.

"దావీదు వంశం పతనమై ఎండిన వృక్షంలా కనిపిస్తుంది. ఆ మోడు నుంచి ఒక పచ్చని చిగురు పుట్టుకువస్తుంది. ఆ చిగురు ఆవిర్భావం అంటే ఏసు జననం" అని ప్రవచించిన యెషయా... ప్రభువు రాకకోసం ఎదురుచూసి, ఎదురుచూసి, నిరాశతో ప్రాణాలు విడిచాడు. ఆయన పేరిట బైబిల్‌లో ఒక పెద్ద అధ్యాయమే ఉంది. అందులో యూదులకు, ఇశ్రాయిలీలకు శాంతి హెచ్చరికలను కూడా ఆయన చేశాడు.

యోహాను క్రీస్తుకన్నా ఆరు నెలలు పెద్దవాడు. అతను ప్రజల కోసం ఒక ప్రకటన చేస్తూ... "నేను మీకు నీళ్ళతో మాత్రమే బాప్తిస్మం (బాప్టిజం) ఇస్తున్నాను. కానీ రాబోయే మహనీయుడు అగ్నితో బాప్తిస్మం ఇస్తాడు. అదిగో... ఆయన అడుగుల చప్పుడు వినిపిస్తోంది. ఆయన పాద రక్షలు మోయడానికి కూడా నాకు అర్హత లేదు" అని చెప్పాడు.

దైవమార్గం



అతను ప్రభువుకు బాప్తిస్మం ఇచ్చాడు. అందుకే అతనికి 'బాప్తిస్మ యోహాన్' అనే పేరు స్థిరపడిపోయింది. ఇర్మియా లాంటి ప్రవక్తలు ఎందరు ఉన్నప్పటికీ... ఎన్నో ఏళ్ళ ముందు యెషయా, దగ్గరగా ఉండి స్వాగతించిన యోహాను ఆయన రాకను ఊహించినవారుగా ప్రసిద్ధులయ్యారు. ఆయన వచ్చే మార్గంలో ఇరువైపులా నిలబడి ఆహ్వానానికి సన్నాహాలు చేస్తున్నవారుగా ఆ ఇద్దరూ కనిపిస్తారు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

గీతాసారం

రెండు దారులు

ఎవరైనా తమ శక్తి యుక్తులను శత్రుత్వాల కోసం, ద్వేషం కోసం వినియోగిస్తూ ఉన్నంతకాలం తాము నష్టపోతారు, తమ శత్రువులకు రెట్టింపు నష్టం కలిగిస్తూ ఉంటారు. అందుకే వదలాల్సింది ద్వేషాన్ని కాని కర్మను కాదని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. మనకు కాలం, శక్తి పరిమితంగా ఉంటాయి కాబట్టి వాటిని తెలివిగా ఉపయోగించుకోవాలి

మానవులు అనుసరించే రెండు భిన్నమైన మార్గాల గురించి శ్రీకృష్ణుడు వివరిస్తూ... "వాటిలో ఒకటి తిరిగి వెనక్కి, రానక్కరలేని ప్రకాశవంతమైన మార్గం. రెండోది మళ్ళీ తిరిగి వచ్చే చీకటి దారి. ప్రకాశవంతమైన మార్గం మన శక్తిని బ్రహ్మాన్ని చేర్చే అంతర్గత ప్రయాణం వైపు నడిపిస్తుంది. చీకటి దారి మన శక్తిని బహిర్గతమైన వాటివైపు, అంటే భౌతికతవైపు తీసుకు వెళుతుంది. దీనిప్రకారం ఫలాపేక్షతో కర్మలను చేసే కర్మయోగులు మరణించిన తరువాత మళ్ళీ జన్మిస్తున్నారు. ప్రతిఫలం ఆశించకుండా కర్మలు చేసేవారు జన్మరాహిత్యాన్ని పొందుతున్నారు" అని స్పష్టం చేశాడు. ఈ మార్గాల గురించి వివరించేటప్పుడు వేర్వేరు పేర్లను, గుణాలను ప్రస్తావించాడు. చీకటి మార్గాన్ని చావు, పుట్టుకలు అనే ధ్రువాల మధ్య ఊగిసలాడే లోలకం (పెండ్యులం) లాంటిదైతే, ప్రకాశవంతమైన మార్గం ... ఆ లోలకం తాలూకు ఇరుసును చేరుకోవడం లాంటిది. అది ధ్రువాలను అధిగమిస్తుంది. అది చేరుకొనేది ఒక్క బ్రహ్మాన్ని... అంటే పరమాత్మను మాత్రమే. ఈ మార్గాలను అర్థం చేసుకున్నవారు మోహానికి గురికాబోరని, యజ్ఞాలద్వారా, తపస్సు ద్వారా, దానాల ద్వారా ఎలాంటి పుణ్యఫలాలు లభిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయో... వాటన్నిటినీ అధిగమించి అత్యున్నతమైన బ్రహ్మాన్ని అంటే మోక్షాన్ని అటువంటి యోగులు పొందుతారని గీతాచార్యుడు తెలిపాడు.





కె. శివప్రసాద్

బిజినెస్

విజయవాడ ● శుక్రవారం 21 నవంబరు 2025

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,690	1,14,300	1,73,000
విజయవాడ	1,26,500	1,17,500	1,60,000
విశాఖపట్నం	1,26,800	1,14,450	1,73,000
రాజమండ్రి	1,24,250	1,13,900	1,58,000
ప్రొద్దుటూరు	1,24,800	1,14,820	1,60,000
ముంబై	1,22,560	1,12,270	1,54,110

రూపాయి మారకానికి లక్ష్యమేమీ పెట్టుకోలేదు

డాలర్ డిమాండ్ వల్లే క్షీణత

- ఆర్థిక స్థిరత్వానికే ప్రథమ ప్రాధాన్యం
- క్రిప్టోలు, స్టేబుల్ కాయిన్స్‌తో ముప్పెక్కువ
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



న్యూఢిల్లీ: రూపాయి మారకం విలువకు ఎలాంటి లక్ష్యాన్నీ నిర్దేశించలేదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఈ మధ్యకాలంలో రూపీ మారకం విలువ క్షీణించడానికి డాలర్లకు డిమాండ్ పెరగడమే ప్రధాన కారణమన్నారు. "అమెరికాతో భారత్ సానుకూలమైన వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందన్న విశ్వాసం ఉంది. ఆ డీల్ రూపాయిపై ఒత్తిడిని తగ్గిస్తుందని ఆశిస్తున్నాం. అమెరికా సుంకాలు, వాణిజ్య సంబంధ కారణాలతోనే ఈ మధ్య రూపాయి విలువ గణనీయంగా క్షీణించింది" అని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో గురువారం జరిగిన వీకేఆర్‌వీ రావు స్మారకోపన్యాస కార్యక్రమంలో మల్హోత్రా అన్నారు. ఈ ఏడాదిలో ఆసియా కరెన్సీల్లోకెల్లా రూపాయి అధికంగా క్షీణించింది. ఇప్పటివరకు రూపాయి మారకం విలువ 3.6% పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% సుంకాలు, యూఎస్‌తో వాణిజ్యపరమైన ఇబ్బందులు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ఇందుకు ప్రధాన కారణం.

మల్హోత్రా ఇంకా ఏమన్నారంటే..

- ఆర్‌బీఐ వద్ద విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు భారీగానే ఉన్నాయి. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
- ఆర్థిక స్థిరత్వమే ఆర్‌బీఐ ప్రథమ ప్రాధాన్యత. వ్యవస్థ రక్షణకు ఎలాంటి భంగం కలుగకుండా నిబంధనలను సరళీకరిస్తున్నాం.
- త్వరలో భారత్‌కు చెందిన మరిన్ని బ్యాంక్‌లు ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్యాంక్‌ల జాబితాలో చేరతాయని ఆశిస్తున్నాం. ఆర్థిక విస్తరణ, బ్యాంకింగ్ రంగంలో వేగవంత వృద్ధి ఇందుకు దోహదపడనున్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి ఎస్‌బీఐ (43వ స్థానం), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (73వ స్థానం) మాత్రమే ఈ లిస్ట్‌లో ఉన్నాయి.
- క్రిప్టోకరెన్సీలు, స్టేబుల్ కాయిన్స్‌తో ముప్పు ఎక్కువ. అందుకే వాటి విషయంలో ఆర్‌బీఐ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అయితే, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఈ- లెండింగ్ వంటి డిజిటల్ ఆవిష్కరణలను సమర్థించడంతో పాటు ప్రోత్సహించాం.
- బ్యాంకింగ్ రంగంలో సైబర్ మోసాలను కట్టడి చేయడమే లక్ష్యంగా నకిలీ ఖాతాల ఏరివేత కోసం ప్రవేశపెట్టిన మ్యూల్‌హంటర్.ఏఐ టూల్ ఆశించిన ఫలితాలనిస్తోంది. ప్రతినెలా 20,000 వరకు నకిలీ ఖాతాను గుర్తిస్తోంది.

మల్హోత్రా కర్మ సిద్ధాంతం..

ఆర్‌బీఐ గవర్నర్ కావాలంటే ఏం చేయాలంటూ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ విద్యార్థులు మల్హోత్రాను అడిగారు. అందుకు ఆయన "మీ కర్మను (విధిని) ఇష్టంతో, ఉత్సాహంతో చేయండి.. ఫలితం దానంతట అదే వస్తుంది" అన్నారు.



మార్కెట్‌లోకి హోండా 'ఎలివేట్ ఏడీవీ'

ఎక్స్ షోరూమ్ ధర రూ.16.66 లక్షలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హోండా కార్స్ ఇండియా సరికొత్త ఎస్‌యూవీ 'ఎలివేట్ ఏడీవీ' ని మార్కెట్లో ప్రవేశపెట్టింది. యువతను ఆకట్టుకునేలా దీనికి అనేక అధునాతన ఫీచర్లు జోడించినట్టు మార్కెటింగ్ అండ్ సేల్స్ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ చెప్పారు. రెండు వెర్షన్లలో లభించే ఈ కారు ఎక్స్ షోరూమ్ ధర హైదరాబాద్‌లో రూ.15.20 లక్షల నుంచి రూ.16,66,800 వరకు ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలు తమకు అత్యంత కీలక మార్కెట్లని తెలిపారు. తమ మొత్తం అమ్మకాల్లో ఈ 2 రాష్ట్రాల వాటా ఏడు శాతం వరకు ఉంటుందన్నారు.

వచ్చే ఏడాది అల్ఫా ఈవీ: వచ్చే ఆర్థిక సంవత్సరం అల్ఫా ఈవీ కారును భారత్‌లోనూ విడుదల చేయబోతున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే చార్జింగ్ పాయింట్ ఆపరేటర్లతో చర్చిస్తున్నట్టు కునాల్ చెప్పారు. ఈ ఈవీ కారును భారత్‌లో తయారుచేసి జపాన్‌తో సహా అనేక దేశాలకు ఎగుమతి చేయబోతున్నట్టు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన ర్యాలీ

26,100 పాయింట్ల పైన నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ లాభాల బాట పట్టింది. ప్రధాన సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ ఒక దశలో 52 వారాల గరిష్ఠ స్థాయిలను తాకాయి. సెన్సెక్స్ చివరికి 446.21 పాయింట్ల లాభంతో 85,632.68 వద్ద ముగిసింది. నిఫ్టీ చివరికి 139.50 పాయింట్ల లాభంతో 26,192.15 వద్ద క్లోజయింది. ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లు, ఎంపిక చేసిన కొన్ని ఫైనాన్సియల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు గురువారం దేశీయ స్టాక్ మార్కెట్‌ను లాభాల బాట పట్టించాయి. ఎఫ్‌పీఐలు తిరిగి కొనుగోళ్లకు దిగడం, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవడం కూడా ఇందుకు కలిసి వచ్చింది. పెద్ద అడ్డంకులేమీ లేకపోతే ఈ ఏడాది చివరికల్లా సెన్సెక్స్ 91,500 పాయింట్లకు చేరవచ్చునన్నది టెక్నికల్ విశ్లేషకుల అంచనా.

దూసుకుపోయిన రిలయన్స్ మార్కెట్ క్యాప్ : గురువారం రిలయన్స్ షేర్లు రేసుగుర్రంలా పరిగెత్తాయి. ఒక దశలో బీఎస్ఈలో షేరు ధర 2.42% లాభంతో రూ.1,550.90ని తాకడంతో మార్కెట్ క్యాప్ రికార్డు స్థాయిలో రూ.21 లక్షల కోట్లకు చేరింది. చివరికి 2.01 శాతం లాభంతో రూ1,549.10 వద్ద ముగిసింది. దీంతో షేర్ల మార్కెట్ విలువ రూ.20.96 లక్షల కోట్ల వద్ద ముగిసింది.

పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ రుణ సేకరణ పరిమితి పెంపు

పవర్ మెక్ ప్రాజెక్ట్స్ తన రుణ సేకరణ పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.7,500 కోట్లకు పెంచుకోవాలని భావిస్తోంది. ఇందుకు అవసరమైన తీర్మానానికి ఈ-ఓటింగ్ ద్వారా సేకరిస్తోంది. వాటాదారులు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 20 వరకు ఈ-ఓటింగ్ ద్వారా ఈ తీర్మానానికి తమ ఆమోదం లేదా తిరస్కరణ తెలపవచ్చునని పేర్కొంది.

2031 నాటికి 5 జీ యూజర్లు 100 కోట్లు

ఎరిక్సన్ మొబిలిటీ అంచనా



న్యూఢిల్లీ: భారత్‌లో 5జీ వినియోగదారులు వేగంగా పెరుగుతున్నారని, 2031 చివరినాటికి దేశంలో 5జీ యూజర్లు 100 కోట్లు మించిపోనున్నారని అంచనా వేసింది. ఈ ఏడాది చివరినాటికి 5జీ కస్టమర్లు 39.4 కోట్లకు చేరుకోవచ్చని, మొత్తం మొబైల్ వినియోగదారుల్లో వీరి వాటా 32 శాతంగా ఉండనుందని ఎరిక్సన్ పేర్కొంది. దేశంలో డిజిటలీకరణలో 5జీ ఇప్పటికే కీలక మౌలిక వసతిగా మారిందని ఎరిక్సన్ ఇండియా ఎండీ నితిన్ బన్సల్ అన్నారు.

డేటా సెంటర్ వ్యాపారంలో రూ.18,000 కోట్ల పెట్టుబడి

పీఈ సంస్థ టీపీజీతో టీసీఎస్ జట్టు

ముంబై: ఐటీ సర్వీసుల దిగ్గజం టీసీఎస్ తాను ఏర్పాటు చేయబోయే ఏఐ డేటా సెంటర్ వ్యాపారంలో సహకారానికి పీఈ కంపెనీ టీపీజీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ డేటా సెంటర్‌పై ఉభయ సంస్థలు రూ.18,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. హైపర్‌వాల్ట్‌గా నామకరణం చేసిన ఈ డేటా సెంటర్‌లో టీపీజీ రూ.8870 కోట్లు ఇన్వెస్ట్ చేయడం ద్వారా 27.5 నుంచి 49% మధ్యలో వాటా కలిగి ఉంటుంది. ఈ తరహా డేటా సెంటర్ ద్వారా కస్టమర్లు, భాగస్వాములకు సంపూర్ణంగా ఏఐ సొల్యూషన్లు అందించగలుగుతామని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అన్నారు.

బయోలాజికల్-ఇ వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్-ఇ తయారుచేసిన న్యూమోకోకల్ కాంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ) న్యూబెవాక్స్ 14కి (బీఈ-పీసీవీ-14) ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు లభించింది. డబ్ల్యూహెచ్ఓ నుంచి బీఈ ప్రీ క్వాలిఫికేషన్ సాధించిన 11వ వ్యాక్సిన్ ఇది. 14 రకాల స్ట్రెప్టోకోకస్ న్యుమోనియా, మెదడువాపు, సెప్సిస్ వ్యాధుల నుంచి న్యూబెవాక్స్ రక్షణ కల్పిస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆరు వారాల వయసు గల పిల్లలకు దీన్ని వేయవచ్చు. ఈ గుర్తింపుతో ప్రపంచ దేశాలకు అత్యున్నత నాణ్యత గల పీసీవీ వ్యాక్సిన్లను సరఫరా చేసే అవకాశం తమకు కలిగిందని బయోలాజికల్-ఇ ఎండీ మహిమ దాట్ల అన్నారు.

కొండెక్కిన కోడి గుడ్ల ధర

100 గుడ్ల ధర రూ.673.. రిటైల్ ధర రూ.7 పైనే

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో కోడి గుడ్ల ధర కొండెక్కింది. చిత్తూరు జిల్లా హోల్‌సేల్ మార్కెట్లో 100 గుడ్ల ధర రికార్డు స్థాయిలో రూ.673కు చేరింది. విశాఖ, హైదరాబాద్ మార్కెట్లలోనూ 100 గుడ్ల ధర రూ.635కు (శుక్రవారం విక్రయించే ధర) చేరింది. విజయవాడ ప్రాంతంలోనూ హోల్‌సేల్ మార్కెట్‌లో ధర రూ.660కి చేరింది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ రూ.639 పలుకుతోంది. దీంతో రిటైల్ మార్కెట్లో ఒక్కో గుడ్డు ధర ఏడు రూపాయలు దాటిపోయింది. ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఉత్తర భారతంలో చలితో గుడ్ల వినియోగం బాగా పెరిగింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అక్కడికి ఎగుమతులు భారీగా పెరిగాయి. దీనికి తోడు ఇటీవల ఏపీ, తెలంగాణలో వ్యాధులతో పెద్ద మొత్తంలో కోళ్లు చనిపోయి గుడ్ల ఉత్పత్తి తగ్గింది. దీంతో కోడి గుడ్ల ధర కొండెక్కిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గుడ్ల ధర కొండెక్కినా కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.226కు తగ్గడం విశేషం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	635	విజయవాడ	660
వరంగల్	637	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	112	విజయవాడ	106
వరంగల్	112	గుంటూరు	108
కరీంనగర్	112	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	105	అనంతపురం	109
గోదావరి	106		

హైదరాబాద్‌లో మరో రెండు అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మరో రెండు అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలు నెలకొల్పాయి. వాటిలో సొనోకో ప్రోడక్ట్స్ , ఈబీజీ గ్రూప్ ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అత్యాధునిక ఐటీ పెర్ఫార్మెన్స్ హబ్‌ను ప్రారంభించిన సొనోకో ఇప్పుడు శాశ్వత భవనంలోకి మారింది. హైదరాబాద్‌లో ఫైనాన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు చేయనున్నట్టు కూడా కంపెనీ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి రాజీవ్ అంకిరెడ్డిపల్లి ప్రకటించారు.

◆ వెల్‌నెస్, మొబిలిటీ, టెక్నాలజీ, రియల్టీ, లైఫ్‌స్టైల్ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈబీజీ గ్రూప్ హైదరాబాద్‌లోని డల్లాస్ సెంటర్‌లో ఈబీజీ పవర్ హౌస్‌ను ప్రారంభించింది. రాబోయే రెండేళ్ల కాలంలో ఈ సెంటర్‌పై 70 లక్షల డాలర్లు (రూ.6,160 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది.

స్పోర్ట్స్



నిఖత్ పసిడి పంచ్

9 స్వర్ణాలు కొల్లగొట్టిన భారత్ ● మొత్తం 20 పతకాలతో అదుర్స్



ప్రీతి పవార్ నూపుర్ మీనాక్షి అరుంధతి

వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్

గ్రేటర్ నోయిడా: వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. మొత్తం 20 మంది బరిలోకి దిగితే.. అందరికీ పతకాలు లభించాయి. మనోళ్లు ఏకంగా 9 స్వర్ణాలతో అదరగొట్టారు. మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్ (51 కిలోలు), మీనాక్షి హుడా (48 కి), ప్రీతి పవార్ (54 కి), జాస్మిన్ లంబోరియా (57 కి), పర్వీన్ (60కి), అరుంధతి చౌదరి (70 కి), నూపుర్ షెరాన్ (80+ కి)తోపాటు సచిన్ (60 కి), హితేష్ (70 కి) పసిడి కాంతులీనారు. మొత్తంగా భారత్ (9 బంగారు, 6 రజత, 5 కాంస్య) 20 పతకాలు సాధించింది. గురువారం జరిగిన ఫైనల్లో నిఖత్ 5-0తో గువా యి గ్జువాన్ (చైనీస్ తైపీ)ని మట్టికరిపించింది. పారిస్ ఒలింపిక్స్ రౌండ్-16లో ఓటమి తర్వాత వరల్డ్ చాంపియన్ నిఖత్ తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకుంది. వేగంగా కదులుతూనే పవర్ పంచ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రతి రౌండ్‌లోనూ సాంకేతికంగా మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ఈ పోటీల్లో నిఖత్ ఆడింది 2 బౌట్లు మాత్రమే. బై లభించడంతో ఆమె నేరుగా సెమీస్‌లో తలపడింది. ఇక మీనాక్షి 5-0 తో ఆసియా చాంపియన్ ఫర్జోనా ఫొటిలోవా (ఉజ్బెకిస్థాన్)పై, అరుంధతి 5-0తో జొకిరోవా (ఉజ్బెకిస్థాన్)పై, ప్రీతి 5-0తో సిరిన్ చర్రా బి (ఇటలీ)పై, నూపుర్ 3-2తో సోతిమ్‌బయేవా (ఉజ్బెకిస్థాన్)పై, వరల్డ్ చాంపియన్ జాస్మిన్ 4-1తో పారిస్ ఒలింపిక్స్ పతక విజేత ఉ షి (చైనీస్ తైపీ)పై, పర్వీన్ 3-2తో అయాక తగుచి (జపాన్)పై గెలిచి స్వర్ణాలు నెగ్గారు. అయితే, 80 కిలోల విభాగంలో కజ్మర్‌స్కా (పోలెండ్) చేతిలో ఓడిన పూజారాణి రజతానికే పరిమితమైంది. పురుషుల విభాగం ఫైనల్లో సచిన్ 5-0తో సీట్‌బెక్ (కిర్గిస్థాన్)పై, హితేష్ 3-2తో నూర్‌బెక్ (కజకిస్థాన్)పై నెగ్గి స్వర్ణాలు సాధించారు. జాదుమణి (50 కి), పవన్ బర్త్వాల్ (55 కి), అవినాష్ (65 కి), అంకుష్ (80), నరేందర్ (90+ కి) తుది పోరులో ఓడి రజతాలు దక్కించుకొన్నారు.

ప్రతి ఒక్కరికీ పతకం: భారత్‌నుంచి మహిళలు, పురుష విభాగాల్లో పదేసి మంది చొప్పున 20 మంది దిగారు. వీరిలో ప్రతిఒక్కరూ పతకం సాధించారు. మహిళలకు 7 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు లభించాయి. పురుషులు 2స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకున్నారు.

టాప్ బాక్సర్లు దూరం..

అగ్రశ్రేణి బాక్సర్లు చాలా మంది ఈ ఈవెంట్‌కు దూరం కావడంతో టోర్నీ కళతప్పింది. బాక్సింగ్ పవర్‌హౌస్‌లైన కజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లు తృతీయ శ్రేణి జట్లను బరిలోకి దించడంతో మనోళ్లకు పెద్దగా పోటీ ఎదురుకాలేదు.

మళ్లీ ఒలింపిక్స్ రేసులోకి..

దాదాపు ఇరవై నెలల తర్వాత అంతర్జాతీయ బాక్సింగ్ రింగ్‌లో నిఖత్ జరీన్ గర్జించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఓటమి తర్వాత కొద్ది కాలం గాయాలతో.. ఆ తర్వాత వెయిట్ విభాగంలో మార్పులతో ఒడిదుడుకులకు లోనైన నిఖత్.. వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో స్వర్ణం సాధించి మరోసారి సత్తా చాటుకుంది. ఈ విజయానంతరం 'ఆంధ్రజ్యోతి'తో నిఖత్ పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే...



సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ పోటీల్లో పసిడి పతకం సాధించడం సంతోషంగా ఉంది. ఈ విజయం నన్ను తిరిగి ఒలింపిక్స్ రేసులోకి తీసుకొచ్చింది. పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్‌లో ఓడిన తర్వాత తేరుకోవడానికి చాలా సమయం పట్టింది. ఈ విజయం నాలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ ఉత్సాహంతో త్వరలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ సత్తా చాటుతా. వచ్చే ఒలింపిక్స్‌కు రెట్టింపు ఉత్సాహంతో ఇప్పటినుంచే సన్నాహకాలు మొదలుపెడతా. ఇందుకోసం వచ్చే రెండేళ్లు అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణించాల్సి ఉంది.

హైదరాబాద్‌లో సరైన సదుపాయాలు లేవు..

హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగిన విధంగా బాక్సింగ్‌లో సాధన చేసేందుకు అకాడమీలు, సదుపాయాలు లేవు. నేను కూడా పటియాల, బళ్లారి వంటి ప్రాంతాలకు వెళ్లి సాధన చేయాల్సి వస్తోంది. నగరంలో మంచి బాక్సింగ్ అకాడమీని నెలకొల్పేందుకు గతంలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించాను. ఆయన సానుకూలంగా స్పందించారు. బాక్సింగ్‌లో నా లాంటి అమ్మాయిలు తెలంగాణ నుంచి మరింత మంది రావాలంటే రాష్ట్రంలో బాక్సింగ్ మౌలిక సదుపాయాలు మెరుగుపడాల్సి ఉంది. ఇందుకోసం అకాడమీ ఏర్పాటుపై ముఖ్యమంత్రిని మరోసారి కలిసి చర్చిస్తాను.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

గిల్ సంగతేంటి?

ప్రాతినిధ్యంపై అనిశ్చితి.. నేడు ఫిట్‌నెస్ టెస్టు

ఆ తర్వాతే స్పష్టత.. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు



గువాహటి: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో స్పిన్ ఉచ్చులో పడిన టీమిండియా ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి జరిగే ఆఖరిదైన రెండో టెస్టులో గెలిచి తీరాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఈ కీలక పోరులో శుభ్‌మన్ గిల్ ఆడతాడా? లేదా? అనే విషయమై టీమ్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టత లేదు. ప్రస్తుతం జట్టుతో పాటు గువాహటికి వెళ్లిన గిల్ ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడు. ఈడెన్ టెస్టులో అతను మెడ నొప్పితో బ్యాటింగ్ మధ్యలోనే క్రీజును వీడాల్సి వచ్చింది. గువాహటి టెస్టులో ఆడేదీ లేనిదీ శుక్రవారం గిల్ ఫిట్‌నెస్‌ను పరీక్షించాక తేలుతుందని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టం చేశాడు. ఏదేమైనా గిల్‌పై అనవసర రిస్క్ తీసుకోవద్దన్న ఆలోచనలో బోర్డు ఉంది.

సాయికే బెర్త్!: కెప్టెన్ గిల్ ఫిట్‌నెస్ టెస్టులో విఫలమైతే అతడి స్థానంలో ఎవరిని ఆడిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కీపర్ రిషభ్ పంత్‌కు జట్టు పగ్గాలు అప్పజెప్పనుండగా.. సాయి సుదర్శన్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఇప్పటికే వన్‌డౌన్‌లో సుందర్ మెరుగ్గానే ఆడుతుండడంతో జురెల్‌ను నాలుగు, సాయిని ఆరో నెంబర్‌లో పంపవచ్చు. తుది జట్టులో స్థానం కోసం స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్, పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ మధ్య కూడా పోటీ నెలకొంది. కానీ పిచ్ పరిస్థితిని బట్టి వీరిద్దరిలో ఒకరు రెండో టెస్టులో ఆడనున్నారు. ఎర్ర మట్టితో చేసిన పిచ్ కావడంతో పేస్, బౌన్స్ లభిస్తుంటుంది. ఆ దిశగా ఆలోచిస్తే.. నితీశ్‌ను తీసుకుంటే ముగ్గురు పేసర్లతో జట్టు ముందుకెళ్లినట్టవుతుంది.

దీక్ష.. స్వర్ణ చరిత్ర

మహిత్‌కు రజతం.. బధిర ఒలింపిక్స్



టోక్యో : బధిర ఒలింపిక్స్‌లో భారత గోల్ఫర్ దీక్షా డాగర్ చరిత్ర సృష్టించింది. గురువారం జరిగిన మహిళల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లే ఫైనల్ రౌండ్‌లో 24 ఏళ్ల దీక్ష అద్భుత ప్రదర్శనతో స్వర్ణం దక్కించుకుంది. 2021 బధిర ఒలింపిక్స్‌లో పసిడి పతకం సొంతం చేసుకున్న దీక్షా డాగర్ ఈసారి ఆ పతకాన్ని నిలబెట్టుకోవడం ద్వారా కొత్త చరిత్ర లిఖించింది. షూటింగ్ మహిళల 50 మీ. ప్రోన్ ఫైనల్లో మహిత్ సంధూ 246.1 పాయింట్లు స్కోరు చేసి రజత పతకం చేజిక్కించుకుంది. ఈ ఒలింపిక్స్‌లో మహిత్ సంధూకిది మూడో పతకం. క్వాలిఫికేషన్‌లో సంధూ ప్రపంచ రికార్డు సృష్టించింది.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

- ప్రణయ్, తరుణ్, శ్రీకాంత్ ఓటమి
- ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్

సిడ్నీ : టాప్ సీడ్ సాత్విక్/చిరాగ్ జోడీ, సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్స్‌లోకి అడుగుపెట్టారు. అయితే ప్రణయ్, తరుణ్, కిడాంబి శ్రీకాంత్ రెండో రౌండ్‌లోనే వెనుదిరిగారు. గురువారం జరిగిన డబుల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి 21-18, 21-11తో తైపీ జంట సు చింగ్ హెంగ్/వు గువాన్ జున్‌పై నెగ్గారు. ఆయుష్ షెట్టి 21-17, 21-16తో నాలుగో సీడ్ కొడాయ్ నరోకా (జపాన్)కు షాకిచ్చాడు. లక్ష్యసేన్ 21-17, 13-21, 21-13తో చి యు జెన్ (తైపీ)పై పోరాడి నెగ్గాడు. క్వార్టర్ ఫైనల్లో ఆయుష్-లక్ష్యసేన్ అమీతుమీ తేల్చుకోనున్నారు. ఇక ప్రణయ్-ఫర్హాన్ అల్వీ (ఇండోనేసియా) చేతిలో, శ్రీకాంత్ 20-22, 16-21తో షోగో ఒగావా (జపాన్) చేతిలో, తరుణ్ మన్నేపల్లి 13-21, 21-19, 10-21తో లిన్ (తైపీ) చేతిలో ఓటమితో టోర్నీ నుంచి తిరుగుముఖం పట్టారు.

ఇంగ్లండ్ కల నెరవేరేనా?

నేటి నుంచి యాషెస్ సిరీస్



పెర్త్: ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల మధ్య ప్రతిష్ఠాత్మక యాషెస్ టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఐదు టెస్టుల్లో భాగంగా శుక్రవారం నుంచి పెర్త్ స్టేడియంలో తొలి మ్యాచ్ జరుగనుంది. బెన్ స్టోక్స్ సేన ఆసీస్ గడ్డపై 15 ఏళ్లుగా యాషెస్ కోసం ఎదురుచూస్తున్నా నిరాశ తప్పట్లేదు. అటు గాయం కారణంగా ఆసీస్ కెప్టెన్ కమిన్స్, పేసర్ హాజెల్‌వుడ్ తొలి టెస్టుకు దూరం కానున్నారు. ఆసీస్ తాత్కాలిక కెప్టెన్‌గా స్మిత్ వ్యవహరించనున్నాడు.

భారత ఫుట్‌బాల్..6 మెట్లు కిందికి

న్యూఢిల్లీ: 'ఫిఫా' ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఆరు స్థానాలు దిగజారి 142వ ర్యాంకుకు చేరింది. మంగళవారం బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోవడం భారత్ ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. 2016 తర్వాత మన జట్టు ఇంత తక్కువ ర్యాంకుకు పడిపోవడం ఇదే తొలిసారి.

రో-కోకు పొగబెట్టారు!

మనోజ్ తివారీ



న్యూఢిల్లీ: భారత జట్టు మేనేజ్‌మెంట్‌పై మాజీ ఆటగాడు మనోజ్ తివారీ నిప్పులు చెరిగాడు. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను బలవంతంగా టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలిగేలా చేశారని ఆరోపించాడు. కృత్రిమమైన సందిదశను సృష్టించి వారిద్దరినీ ఇబ్బందులకు గురి చేశారన్నాడు. వాస్తవంగా రో-కో రెడ్ బాల్ క్రికెట్‌లో మరికొన్ని రోజులు కొనసాగాలనుకొన్నారని తివారీ చెప్పాడు. కానీ, వారిద్దరూ ఇమడలేని పరిస్థితులు సృష్టించారన్నాడు. 'నా దృష్టిలో సందిదశ అనేది భారత్‌కు వర్తించదు. మన దేశవాళీ క్రికెట్‌లో అవకాశాలకోసం ఎదురుచూస్తున్న ఎంతో మంది ప్రతిభావంతులున్నార'ని తివారీ చెప్పాడు. కోల్‌కతా టెస్ట్ ఓటమి తర్వాత ఆటగాళ్లను కోచ్ గంభీర్ విమర్శించడాన్ని కూడా తివారీ తప్పుబట్టాడు. బ్యాటర్ల టెక్నిక్‌లో లోపముందని గుర్తించినప్పుడు.. కోచ్ ఎందుకు సరిదిద్దలేదని ప్రశ్నించాడు.

లిట్టన్, ముష్ఫికర్ శతక మోత

ఐర్లాండ్‌తో బంగ్లా టెస్టు

మీర్పూర్ : లిట్టన్ దాస్ (128), ముష్ఫికర్ రహీమ్ (106) శతక మోత మోగించగా, బౌలర్లు కూడా సత్తా చాటడంతో ఐర్లాండ్‌తో రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ పూర్తిగా పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 292/4తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 476 రన్స్‌కు ఆలౌటైంది. వందో టెస్ట్‌లో ముష్ఫికర్ శతకం సాధించడం విశేషం. స్పిన్నర్ మెక్‌బ్రిన్ ఆరు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఐర్లాండ్.. బంగ్లా స్పిన్నర్ల ధాటికి రెండో రోజు చివరకు 98/5తో కష్టాల్లో పడింది.

లంకకు జింబాబ్వే షాక్

రావల్పిండి : ముక్కోణపు టీ20 టోర్నీలో శ్రీలంక జట్టుకు జింబాబ్వే షాకిచ్చింది. గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో 67 పరుగులతో లంకను చిత్తు చేసింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 162/8 స్కోరు చేసింది. బెన్నెట్ (49), కెప్టెన్ సికిందర్ రజా (47) సత్తా చాటారు. హసరంగ మూడు, ఇషాన్ మలింగ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ షనక (34), రాజపక్ష (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఇవాన్స్ మూడు, ఎన్ గవారా రెండు వికెట్లు తీశారు.

ఇఫీ వేడుకలో బాలకృష్ణకు సన్మానం



గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో హీరో నందమూరి బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. గురువారం నిర్వహించిన ప్రారంభ వేడుకలో బాలకృష్ణను సత్కరించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, గవర్నర్ అశోక్ గజపతి రాజు, కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్, బాలకృష్ణకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. సినీ పరిశ్రమలో కథానాయకుడిగా 50 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆయన అద్భుత నట ప్రస్థానానికి గుర్తింపుగా ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ "నా సుదీర్ఘ నట జీవితంలో భాగమైనవారందరికీ ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో నా భార్య వసుంధర సహకారం మరువలేనిది. 'సినిమాల్లోకి వచ్చే 50 ఏళ్లు అవుతుందంటే, అసలు నీ వయసెంత?' అని మాత్రం నన్ను అడగొద్దు" అంటూ చమత్కరించారు. కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ మాట్లాడుతూ 'బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానం భారతీయ సినిమా చరిత్రలో ఒక మైలురాయి, ఆయన తన అద్భుతమైన నటన, ప్రజాదరణతో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించార'ని కొనియాడారు.

అలాంటి సినిమాకు దర్శకత్వం వహిస్తా

\- అల్లరి నరేశ్



'ఎప్పట్నుంచో నాకు దర్శకత్వం వహించాలనే కోరిక ఉంది. సమయం కోసం వేచి ఉన్నా. తప్పకుండా ఒక సినిమాకు డైరెక్షన్ చేస్తా. అది డీడీఎల్‌జే(దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే)లా గుర్తుండిపోయే సినిమా కావాలనేది నా కోరిక' అని తన మనసులో మాట బయటపెట్టారు హీరో అల్లరి నరేశ్. ఆయన కథానాయకుడిగా నాని కాసరగడ్డ తెరకెక్కించిన చిత్రం '12ఎ రైల్వే కాలనీ'. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నరేశ్ విలేకరులతో ముచ్చటించారు. 'నేను కొత్త జానర్‌లో చేసిన సినిమా ఇది. హైదరాబాద్‌లో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. ఇందులో మూడు, నాలుగు కథలు సమాంతరంగా సాగుతుంటాయి. వీటి మధ్యన చాలా మైండ్ గేమ్ ఉంటుంది. ఇలాంటి స్క్రీన్‌ప్లేతో తెలుగులో చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. అందరికీ కనెక్టింగ్‌గా ఉంటుందనే ఈ చిత్రానికి రైల్వే కాలనీ అని పేరు పెట్టారు. కామాక్షి తెలుగమ్మాయి. మంచి ఆర్టిస్టు. యాక్టింగ్‌తోపాటు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో కూడా పనిచేశారు. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ ఈ ప్రాజెక్టును ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నారు. చాలా ప్యాషన్‌తో పనిచేశారు. నాకు ఒక హారర్, ఒక మూకీ సినిమా చేయాలనుంది. డైలాగ్ లేకుండా నవ్వించాలనేది నా కోరిక' అని అన్నారు.

వినోదం, భావోద్వేగాల సమ్మేళనం

\- ప్రియదర్శి



"ప్రేమంటే' సినిమాలో వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలూ ఉంటాయి' అని చెప్పారు హీరో ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా దర్శకుడు నవనీత్ శ్రీరామ్ తెరకెక్కించిన చిత్రమిది. రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. నేడు విడుదలవుతున్న సందర్భంగా ప్రియదర్శి సినిమా విశేషాలు పంచుకున్నారు. 'ప్రేమ ఎంత అద్భుతంగా ఉంటుందనే విషయాన్ని మన కవులు తమ రచనల ద్వారా, గొప్ప దర్శకులు తమ సినిమాల ద్వారా ప్రపంచాని తెలియజేశారు. అదంతా సిద్ధాంతపరమైనది. నిజమైన ప్రేమంటే ఏమిటో పెళ్లి ద్వారానే అర్థమవుతుంది. ప్రేమంటే ఇంత బాగుంటుంది అని అనుకోవడం దగ్గరనుంచి ఇలా కూడా ఉంటుందని ఈ సినిమాలో చూపించాం. అందుకే ఈ చిత్రం అందరినీ అలరిస్తుంది. నవనీత్ చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. కథని అద్భుతంగా రాశాడు. జేమ్స్ సినిమాకు కావాల్సిన విధంగా మ్యూజిక్ ఇచ్చారు. నేను విలక్షణమైన కథలు చేస్తాననే గుర్తింపును ప్రేక్షకులు ఇచ్చారు. ఆ బాధ్యతతోనే సినిమాలు చేస్తున్నాను' అని అన్నారు.

క్లైమాక్స్ చూసి షాక్ అవుతారు

\-కిరణ్ అబ్బవరం



'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం క్లైమాక్స్ గురించి విన్నప్పుడు షాక్‌కు గురయ్యాను. థియేటర్లలో మీరూ అలాగే ఫీల్ అవుతారు' అని కిరణ్ అబ్బవరం అన్నారు. అఖిల్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రమిది. వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథిగా హాజరై సనిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. 'ఇది నా మనసుకు బాగా దగ్గరైన సినిమా' అని వంశీ నందిపాటి అన్నారు. 'ఇది అందరి కథ. ఈ సినిమా చూశాక ప్రతి అమ్మాయి తండ్రీ ఆలోచనలో పడతారు' అని వేణు ఉడుగుల అన్నారు. 'కొన్ని సినిమాలు వినోదాన్ని అందిస్తే మరికొన్ని భావోద్వేగాలను అందిస్తాయి. ఈ సినిమా ఆ రెండింటినీ సమంగా ఇస్తుంది' అని రాహుల్ మోపిదేవి తెలిపారు.

సేవతో శాంతి.. ఆనందం

సత్యసాయి సేవలకు వెల కట్టలేం

- నరుడి సేవయే నారాయణ సేవ అన్న మాటలను అందరూ ఆచరించాలి
- ఆకలితో ఉన్నవారికి ఆధ్యాత్మికత కంటే ఆహారమే ముఖ్యం: కేంద్ర మంత్రి గడ్కరీ
- పుట్టపర్తిలో 11వ అంతర్జాతీయ సదస్సు
- 45 దేశాల నుంచి 2500 మంది ప్రతినిధుల హాజరు

పుట్టపర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇతరులకు అవసరమైన సేవలు అందించినప్పుడే మనకు ఆనందం, శాంతి చేకూరుతాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఆకలితో ఉన్న వారికి ఆధ్యాత్మికత కంటే ఆహారమే ముఖ్యమని, వారికి ఆహారం అందించి నరుడి సేవయే నారాయణ సేవ అని సత్యసాయి చెప్పిన మాటలను అందరూ ఆచరించాలని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి శత జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. గురువారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో శ్రీసత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు రత్నాకర్, చక్రవర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయి సంస్థల విద్యార్థుల వేద పఠనంతో కార్యక్రమం మొదలైంది. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి గడ్కరీ మొదట సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం సదస్సులో ప్రసంగించారు. మనిషికి ఆశ పెరిగినప్పుడు అశాంతి నెలకొంటుందని, సామాజిక స్పృహ, సేవాభావంతో జీవనం సాగిస్తే సంతోషం వెల్లివిరుస్తుందని అన్నారు. సత్యసాయి ప్రేమ, సేవ అనన్యమని, తన బోధనలతో కోట్లాది మంది భక్తులకు ఆరాధ్యదైవం అయ్యారని అన్నారు. "సత్యసాయి జీవితం, బోధనలు, విలువలు, ప్రేమతత్వం, మానవాళిని శాంతిజీవనం వైపు నడిపిస్తున్నాయి. ప్రతి వ్యక్తి జీవితంలో శాంతి ముఖ్యం. శాంతి ఉన్నచోట సమస్యకు సహజ పరిష్కారం దొరుకుతుంది. భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న ఆందోళన పెంచుకుంటే అశాంతి పెరుగుతుందే తప్ప శాంతి దొరకదు. అవసరమైన సేవలు అందించడమే సేవకు పరమార్థం. ప్రతి వ్యక్తి తన జీవితాన్ని ఆనందంగా మార్చుకోవడానికి గురువు మార్గదర్శకం అయినట్లే.. సముద్రాల్లోకి వృథాగా పోతున్న నీటిని గురువు లాంటి డ్యామ్ ద్వారా ఉపయోగించుకోవాలి. సత్యసాయి అందించిన విద్య, వైద్యం, తాగునీటి సేవలకు వెల కట్టలేం. సత్యసాయి ప్రారంభించిన సేవలను మరింత పారదర్శకంగా కొనసాగిస్తున్న ట్రస్టు ప్రతినిధుల కృషి అభినందనీయం. నేను బోధించడానికి ఇక్కడికి రాలేదు. ఇక్కడున్న భక్తి, విలువలు, సేవాభావాన్ని చూసి మరింత ఎక్కువగా మంచి పనులు, సేవలు చేయాలన్న ప్రేరణ పొందడానికి వచ్చాను" అని అన్నారు. సదస్సు అనంతరం నితిన్ గడ్కరీని ట్రస్టు ప్రతినిధులు సత్కరించారు. సాయి కుల్వంత్ హాల్‌లో భక్తులు సంగీత కచేరి నిర్వహించారు. అంతర్జాతీయ సదస్సులో ట్రస్టు సభ్యులు డాక్టర్ మోహన్, ప్రసాద్, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, సవిత తదితరులు పాల్గొన్నారు. 45 దేశాల నుంచి 2500 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

రేపు మరోసారి పుట్టపర్తికి సీఎం

- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో కలిసి పలు కార్యక్రమాలకు హాజరు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మరోసారి పుట్టపర్తి వెళ్లనున్నారు. శనివారం ఉదయం 8.15 గంటలకు విజయవాడ నుంచి పుట్టపర్తి వెళ్లనున్న చంద్రబాబు.. అక్కడ 10.30 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు స్వాగతం పలుకుతారు. అనంతరం సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవానికి హాజరవుతారు. ఆదివారం ఉదయం సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొని, మధ్యాహ్నం బయల్దేరి అమరావతి చేరుకుంటారు.



ప్రశాంతి నిలయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర మంత్రులు సవిత, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేశ్ తదితరులు

వెబ్‌సైట్‌లో సత్యసాయి స్మారక నాణెం



పుట్టపర్తి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రధాని మోదీ ఆవిష్కరించిన సత్యసాయి స్మారక రూ.100 నాణేన్ని సొంతం చేసుకోవాలని భక్తులు ఆరాటపడుతున్నారు. అయితే ఈ నాణేన్ని ఎక్కడ, ఎలా..? పొందాలని వివిధ బ్యాంకుల్లో ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నాణేలను ప్రభుత్వ అధికారిక www.indiagovtmint.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని బ్యాంకు అధికారులు తెలిపారు. నాణెం ధర, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

కేరళ ప్రభుత్వంపై బీజేపీ చీఫ్ మాధవ్ ఫైర్

- శబరిమల పోలీసులపై చర్యలకు డిమాండ్



అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప ఆలయ ప్రాశస్త్యాన్ని కేరళలోని నాస్తిక ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం దురుద్దేశంతోనే దెబ్బ తీస్తోందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. అయ్యప్ప భక్తులకు సరిపడా ఏర్పాట్లు చేయలేక పోలీసులతో భక్తులపై దాడులు చేయించడం సిగ్గు చేటని మండిపడ్డారు. భక్తుల పట్ల కేరళ పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గమని ఓ ప్రకటనలో మండిపడ్డారు.

జగన్ జైలుకు వెళ్లడం ఖాయం: సత్యకుమార్

ధర్మవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమ ఆస్తుల కేసుల్లో వైసీపీ అధినేత జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. 'జగన్ నిస్సిగ్గుగా బలప్రదర్శనకు దిగడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని, ప్రజాబలం ఉందని చెప్పుకోవడానికి పెయిడ్ ఆర్టిస్టులతో ర్యాలీ నిర్వహించారని మండిపడ్డారు. "విచారణకు హాజరయ్యేవారు వినయంగా వ్యవహరిస్తారు. కానీ జగన్‌రెడ్డిలో పశ్చాత్తాపమే కనిపించడంలేదు. తన తండ్రి సీఎం పదవిని అడ్డు పెట్టుకుని రూ.వేల కోట్ల ఆస్తులను జగన్ అక్రమంగా సంపాదించారు.' అని ధ్వజమెత్తారు.

జగన్ బెయిలు రద్దుకోరుతూ పిటిషన్ వేస్తా: బుద్దా

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'కోర్టుకు హాజరయ్యే సమయాన్ని జగనే స్వయంగా ప్రకటించడం, మందీ మార్బలంతో కోర్టు వద్ద హడావిడి చేయడం, రప్పా రప్పా పోస్టర్లతో కిరాయి మనుషులను పెట్టుకోవడం... ఇవన్నీ కోర్టులను అవమానించడం... న్యాయాధికారులను శాసించాలని అనుకోవడమే' అని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. న్యాయవాదులతో మాట్లాడి జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ వేస్తానని తెలిపారు.

జగన్ తీరు జుగుప్సాకరం: వర్ల రామయ్య

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కోర్టువద్ద జగన్‌రెడ్డి వ్యవహరించిన తీరు జుగుప్సాకరంగా ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్లరామయ్య అన్నారు."జగన్ సృష్టించిన అలజడి సీబీఐ కోర్టును ప్రభావితం చేసేలా ఉంది. తాను కోర్టుకు వచ్చేవిషయాన్ని అన్ని రకాలుగా ప్రచారంచేసుకుని, తనకార్యకర్తలను, అభిమానులను బేగంపేట ఎయిర్‌పోర్టుకు రప్పించడం వెనుక దురుద్దేశం ఉంది" అని వర్ల అన్నారు.

'అన్నదాత సుఖీభవ'పై అవాస్తవాలు రాస్తారా

- జగన్ పత్రికపై మంత్రి అచ్చెన్న ఫైర్



అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంపై అవాస్తవాలు రాస్తారా అంటూ జగన్ పత్రికపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై అవాస్తవాలు రాస్తూ, ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ గురువారం ఓ ప్రకటనతో మండిపడ్డారు. "అన్నదాత దుఃఖీభవ- కర్షకుడికి మోసం అంటూ గురువారం నాడు పూర్తి అవాస్తవాలతో సాక్షిలో కల్పిత కథనం ప్రచురించారు. సూపర్‌సిక్స్ హామీల్లో చెప్పినట్లుగానే పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ. 20 వేలు ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. ఈ పథకం కింద ఇప్పటికే రెండు విడతల్లో అటవీ భూమి సాగుహక్కుదారులతో సహా 46.86 లక్షల రైతు కుటుంబాలకు రూ.6,309 కోట్లు అందించాం. భూమి లేని సాగుదారులందరికీ 20వేలు చొప్పున ఇస్తాం. ఈ-పంట ప్రక్రియ పూర్తికాగానే కౌలురైతులకు లబ్ధి చేకూర్చుతాం." అని అచ్చెన్న వివరించారు.

సీఎం ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలి

- పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి కొండపల్లి

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలను చైతన్యపరిచి పారిశ్రామికాభివృద్ధిపై అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్‌లోని సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు, 26 జిల్లాల జనరల్ మేనేజర్లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తరచూ ప్రాంతీయ స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చేవిధంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానం చేసి పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలను పెట్టుబడిదారులకు అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, సిబ్బంది ప్రతి శనివారం కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, డైరెక్టర్ శుభం బన్సాల్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొనగా.. 26 జిల్లాల ఉన్నతాధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

వక్ఫ్ ఆస్తుల్లో మెగా అభివృద్ధి పనులు: అబ్దుల్ అజీజ్

రాష్ట్ర వ్యాప్తంగా పలు వక్ఫ్ స్థలాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు బోర్డు అంగీకరించిందని, వాటికి సంబంధించి రూ20 కోట్లకుపైగా మెగా డెవలప్‌మెంట్ ప్లాన్స్ వివరాలను, ప్రతిపాదనలను ఎన్సీపీఈ సంస్థ బోర్డు సభ్యులకు వివరించిందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఆ ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వం అనుమతి, సహకారంతో ముందుకు వెళ్తామని చెప్పారు. ఈ ప్రణాళికలు అమల్లోకి వస్తే వక్ఫ్ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని, ముస్లిం సమాజం బాగుపడుతుందని చెప్పారు. గురువారం విజయవాడలో జరిగిన బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒక వక్ఫ్ సంస్థ నిధులను రుణంగా తీసుకుని, మరొక వక్ఫ్ సంస్థ ఆస్తుల అభివృద్ధికి ఉపయోగించేలా తీర్మానించామన్నారు. పలు మేనేజింగ్ కమిటీలు, ముతవల్లీలను నియమించారు. సమావేశానికి ముందు.. ఇటీవల సౌదీ అరేబియాలో మృతి చెందిన 42 మందికి సంతాపంగా దువా ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి వెనుక కథేంటి?

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ఫైళ్లను మీ పీఏ అప్పన్న ఎందుకు చూశారు? అంత అధికారం మీరెందుకు ఇచ్చారు? వేలల్లో జీతం తీసుకునే ఆయనకు కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయి?.... అంటూ వైఎస్ జగన్ బాబాయ్, టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. కల్తీ నెయ్యి కేసులో దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ అధికారులు గురువారం హైదరాబాద్‌లో వైవీ సుబ్బారెడ్డి నివాసంలోనే ఆయనను ప్రశ్నించారు. సుమారు ఏడుగంటలపాటు ఈ విచారణ ప్రక్రియ జరిగింది. ఈ కేసులో 24మందిపై కేసు నమోదు చేసిన 'సిట్' వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్న అప్పన్న సహా తొమ్మిది మందిని అరెస్టు చేసింది. టీటీడీ మాజీ ఇన్‌చార్జి ఈవో ధర్మారెడ్డితోపాటు చిన్న అప్పన్న ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వైవీని ప్రశ్నించారు. ఆయన వైసీపీ హయాంలో 2019 నుంచి 2023వరకూ రెండు విడతల్లో నాలుగేళ్లు టీటీడీ చైర్మన్‌గా ఉన్నారు. తిరుపతిలోని సిట్ కార్యాలయానికి రావాలంటూ గతంలో నోటీసులు ఇచ్చినా.... అనారోగ్య కారణాలతో రాలేక పోతున్నానని, మీరే వస్తే విచారణకు సహకరిస్తానని సిట్ అధికారులకు వైవీ బదులిచ్చారు. ఈ నేపథ్యంలో... సీబీఐ, ఏపీ పోలీసులతో ఉమ్మడిగా ఏర్పడిన సిట్ అధికారులు హైదరాబాద్‌లో వైవీ నివాసానికి వెళ్లారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి అవసరమైన నెయ్యి టెండర్లు కుదుర్చుకోవడంలో చేసిన మార్పులు, సరఫరాదారుల ఎంపికలో జరిగిన ఉల్లంఘనలు, సంబంధిత టెండర్ ఫైళ్ల చైర్మన్ కాకుండా ఆయన పీఏ చూడటం వెనకున్న కారణాలు, నాణ్యత తనిఖీల్లో లోపాలు, ఆడిట్ ప్రాసెసింగ్ విధానం, మరీ ముఖ్యంగా... మైసూర్ ల్యాబ్ నివేదిక తర్వాత కూడా భోలే బాబా నుంచి నెయ్యి కొనుగోలు చేయడంపై ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. టీటీడీకి అప్పటిదాకా కర్ణాటక పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్యకు చెందిన 'నందిని' సంస్థను ఎవరి సిఫారసు మేరకు పక్కన పెట్టి... భోలేబాబాను తెరపైకి తెచ్చారని అడిగినట్లు సమాచారం. పలు ప్రశ్నలకు వైవీ సుబ్బారెడ్డి సూటిగా సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్లు తెలిసింది. నాణ్యత తనిఖీల్లో వచ్చిన సందేహాలతోపాటు లడ్డూ పోటు సిబ్బంది అభిప్రాయాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని అడగ్గా... అవన్నీ అధికారులు చూసుకోవాలి అంటూ దాటవేసినట్లు సమాచారం. "మీ పీఏ అప్పన్నను పలువురు కాంట్రాక్టర్లు తరచూ సంప్రదించడం వెనుక మీరు పొందిన లబ్ధి ఏంటి? ఆడిట్ నివేదికలు బోర్డు ముందు ఎందుకు ఉంచలేదు?" అని కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రీమియర్ డెయిరీ నుంచీ చిన్న అప్పన్న హవాలా రూపంలో రూ.50 లక్షలు తీసుకున్న విషయం తెలుసా అని ప్రశ్నించినట్టు సమాచారం. గతంలో ఏ బోర్డూ తీసుకోని రీతిలో నెయ్యి సేకరణ టెండర్ల నిబంధనలో... 'పాలతో తయారు చేసిన నెయ్యి' అనే చోట 'పాలు' అన్న పదాన్ని వైవీ హయాంలో బోర్డు ఎలా తొలగించిందని ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై వైవీ సుబ్బారెడ్డి సమాధానాలు, స్పందనలను 'సిట్' అధికారులు రికార్డు చేసుకున్నారు. తమకు అందుబాటులో ఉండాలని, అవసరమైతే మరోమారు సంప్రదిస్తామని సుబ్బారెడ్డికి చెప్పినట్లు తెలిసింది. విచారణ అనంతరం వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. సిట్ విచారణలో అన్నీ వాస్తవాలే చెప్పానని అన్నారు.

విచారణకు సహకరించని అప్పన్న: సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న సిట్ విచారణకు సహకరించడం లేదని తెలిసింది. 5రోజుల కస్టడీలో గురువారంతో 4రోజులు గడిచిపోయాయి. సిట్ అధికారులు అడిగిన ప్రశ్నల్లో 90% వాటికి సమాధానం ఇవ్వకుండా మౌనం వహించినట్టు తెలిసింది.

పక్కా కసరత్తుతో...

వైవీ సుబ్బారెడ్డిని ప్రశ్నించేందుకు సీబీఐ వైజాగ్ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలోని 'సిట్' బృందం తిరుపతి నుంచి హైదరాబాద్ చేరుకుంది. గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 దాకా విచారణ జరిగింది. ఈ సందర్భంగా వైవీ నివాసంలో టీటీడీకి చెందిన పలు డాక్యుమెంట్లు, ఆయన బ్యాంకు పాస్ బుక్కులు స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆయన మొబైల్ ఫోన్ నుంచీ డేటా కాపీ చేసుకున్నట్లు సమాచారం. చిన్న అప్పన్న ఎలా పరిచయం అన్న ప్రశ్నతో మొదలుపెట్టి.. ఆయనను పీఏగా పెట్టుకోవడం, తర్వాత ఢిల్లీ ఏపీ భవన్‌లో ఉద్యోగిగా నియమించడం... ఆ నిర్ణయాల వెనుక ఉద్దేశాల గురించి ప్రశ్నించినట్లు సమాచారం. చైర్మన్‌గా పాలనా వ్యవహారాలు, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడమే తన బాధ్యత అని... నెయ్యి నాణ్యత తనకేం సంబంధం అని ప్రశ్నించినట్టు తెలిసింది. తనకు వెంకటేశ్వరస్వామి అంటే విపరీతమైన భక్తి అని, తనే అడిగి మరీ టీటీడీ చైర్మన్ పదవి తీసుకున్నానని చెప్పినట్టు తెలిసింది.

కొనుగోళ్లలో అవినీతికి చెక్

- టీటీడీ మార్కెటింగ్ విభాగం ప్రక్షాళనకు చర్యలు
- రెండేళ్లకే ఉద్యోగుల తప్పనిసరి బదిలీలు
- అత్యవసరం పేరుతో కొనేవాటికి అడ్డుకట్ట
- స్థానిక ప్రాంతాల నుంచే శాలువాల సేకరణ
- నిబంధనల్లో పలు మార్పులు.. త్వరలో అమలు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)



తిరుమల తిరుపతి దేవస్థానముల(టీటీడీ)లో అత్యంత కీలకమైన మార్కెటింగ్ విభాగం ప్రక్షాళనకు ధర్మకర్తల మండలి పూనుకుంది. ఏటా దాదాపు రూ. 700 కోట్లకుపైగా కొనుగోళ్లు చేసే ఈ విభాగంలో అవినీతి మీద తరచూ విమర్శలు వస్తుంటాయి. ఈ విభాగంలో అధికారులు, సిబ్బంది కక్కుర్తి పడితే నాణ్యతలేని సరుకులు టీటీడీకి సరఫరా అయ్యే అవకాశం ఉంటుంది. పైగా ధరల్లోనూ తేడాలుంటాయి. టెండర్ల నిబంధనల్లోనే సడలింపులు ఇచ్చి మాయ చేయొచ్చు. గతంలో మార్కెటింగ్ విభాగంలో కొందరి అవినీతి, విచ్చలవిడి కొనుగోళ్లు బోర్డు దృష్టికి వచ్చింది. విజిలెన్స్ విచారణ ఆధారంగా ఇప్పటికే అవినీతికి పాల్పడిన కొందరిని బదిలీ కూడా చేశారు. రూ. 350 నుంచి రూ. 400 విలువ చేసే శాలువాలను రూ. 1,300 చొప్పున కొనుగోలు చేసి కోట్లాది రూపాయాల అవినీతికి పాల్పడ్డారంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కూడా బహిరంగంగా ప్రకటించారు.

అక్రమాలకు తావులేకుండా...

భవిష్యత్తులో అక్రమాలకు తావులేకుండా గట్టి నిబంధనలు పెట్టాలని బోర్డు భావిస్తోంది. మార్కెటింగ్ విభాగంలో అధికారులు, సిబ్బంది రెండేళ్లకు మించి పనిచేయకూడదన్నది ఇందులో ప్రధానమైనది. రెండేళ్ల తర్వాత తప్పనిసరి బదిలీ చేయాలని నిర్ణయించారు. మార్కెటింగ్ విభాగంలోకి తీసుకునే ముందే ఉద్యోగుల గత పనితీరు, ఏవైనా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారా వంటి వ్యక్తిగత వివరాలు విజిలెన్స్ విభాగం ద్వారా తెలుసుకోవాలనే మరొక నిబంధన పెడుతున్నారు. ఇక కొనుగోళ్ల విషయంలోనూ కొన్ని మార్పులు చేయాలని భావిస్తున్నారు. కొన్ని ముడిసరుకులు, వస్తువులను పది, పదిహేను రోజులకోసారి కొనుగోలు చేస్తున్నారు. దీంతో హడావుడిగా అనుమతులు పొందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్పడం లేదని ఆయా విభాగాల అధికారులు చెబుతున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఇకపై మూడునెలలకోసారి కొనుగోళ్లు చేయాలని భావిస్తున్నారు. సరుకుల నిల్వకు తగిన గోదాములు సిద్ధం చేసుకోవాలని బోర్డు కూడా సూచన చేసిందని తెలిసింది. అలాగే శాలువాల మంగళగిరి వంటి స్థానిక ప్రాంతాల నుంచి టీటీడీ నేరుగా కొనుగోలు చేసే అంశం పరిశీలించాలని కూడా అధికారులకు బోర్డు సూచించింది. త్వరలోనే మార్కెటింగ్ విభాగంలో ఈ నిబంధనలు అమలు కానున్నాయి.

కేటీఆర్ విచారణకు అనుమతి

- ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏసీబీకి టీ- గవర్నర్ పచ్చజెండా

హైదరాబాద్,నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏ1గా ఉన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్‌ను విచారించేందుకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం అనుమతి ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఇప్పటికే పలుమార్లు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఈ క్రమంలో కేటీఆర్, ఇతర నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయడానికి ఏసీబీ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. నాడు మంత్రి హోదాలో నిర్ణయాలు తీసుకున్న కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతించాలంటూ ఏసీబీ నుంచి వచ్చిన వినతిని సెప్టెంబరు 9న రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపింది. దీనిపై న్యాయనిపుణుల సలహాలు తీసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. తాజాగా ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చారు. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ (డీవోపీటీ) కూడా అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే డీవోపీటీకి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విజిలెన్స్ కమిషనర్.. అర్వింద్‌కుమార్ విచారణకు అనుమతి ఇచ్చారు. ఇక డీవోపీటీ అనుమతి కోసం ఏసీబీ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఈ కేసులో ఏ3గా ఉన్న హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన విచారణకు విజిలెన్స్ అనుమతి సరిపోతుంది. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి గత ఏడాది ఏసీబీ కేసు నమోదు చేసిన తర్వాత ఈడీ సైతం మనీలాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. గత ప్రభుత్వంలో పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ మంత్రివర్గం అనుమతి లేకుండా, సచివాలయ నిబంధనలకు విరుద్ధంగా డబ్బు విడుదలకు అనుమతి ఇవ్వడంతో హెచ్ఎండీఏకు రూ.54.88 కోట్ల నష్టం జరిగిందంటూ ఐఏఎస్ అధికారి దానకిశోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డితో పాటు గ్రీన్‌కో కంపెనీ యాజమాన్యాన్ని, ఫార్ములా-ఈ కారు రేసు సీఈవోను పలుమార్లు విచారించారు

యాలకుల టెండర్ రద్దు

తిరుపతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టెండర్లలో తప్పులను టీటీడీ సరిదిద్దుకుంటోంది. నకిలీ వే బిల్లులతో జీడిపప్పు సరఫరా టెండర్లలో పాల్గొన్న చెన్నైకు చెందిన క్రిస్టీ క్వాలిటీ ఫుడ్స్, ఫంక్షనల్ అండ్ ఇన్నోవేటివ్ ఫుడ్స్ సంస్థలపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఆ రెండు సంస్థలను డీబార్ చేస్తూ రెండేళ్ల పాటు బ్లాక్ లిస్టులో పెడుతూ ఆదేశాలు జారీ చేసినట్టు టీటీడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 'టీటీడీలో అవే తప్పులు.. జీడిపప్పు టెండర్లలో నకిలీ వే బిల్లులు..' అన్న శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై టీటీడీ స్పందించింది. 1.20 లక్షల కిలోల జీడిపప్పు సేకరణ కోసం టెండర్లు ఆహ్వానించి సెప్టెంబరు 3న టెక్నికల్ బిడ్ తెరిచామని, టెండర్లలో ఆరు సంస్థలు పాల్గొన్నాయని తెలిపింది. పరిశీలనలో క్రిష్టీ క్వాలిటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఫంక్షనల్ అండ్ ఇన్నోవేటివ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలు సమర్పించిన పత్రాలు నకిలీవని గుర్తించి ఆ సంస్థలపై అనర్హత వేటు వేసినట్టు తెలిపింది. ఆ సంస్థల నుంచీ ఏ దశలోనూ కొనుగోళ్లు జరగలేదంది. కాగా, అర్హత పొందని టెండరుదారుడు చెల్లించిన ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ)ను ఆపి ఉంచే ప్రక్రియ టీటీడీ చేతిలో లేదని మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్ జీఎం ఉమాశంకర్ తెలిపారు. యాలకుల టెండర్లలో పాల్గొనవద్దని ఆ సంస్థలకు చెప్పినప్పటికీ వినలేదన్నారు. దీంతో టెండరును రద్దుచేశామని, త్వరలో కొత్తగా పిలుస్తామని చెప్పారు. బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే చర్యలకోసం గురువారం జీఎస్టీ శాఖకు లేఖ రాశామన్నారు. కాగా ప్రారంభదశలోనే ఈఎండీని వాపస్ ఇవ్వకుండా ఉండేందుకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్), టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగానికి మధ్య సమన్వయలోపం కనిపిస్తోందని టీటీడీ పేర్కొంది.

రైతన్నా.. మీ కోసం

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించారు. రైతన్నా.. మీకోసం' పేరుతో కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం స్పష్టం చేశారు. ఇందులో రైతు సేవా కేంద్రాల సిబ్బంది కీలక భూమిక పోషించాలన్నారు. '17 నెలలుగా రైతుల్ని, వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. ఇప్పటికే 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' కింద దాదాపు 46.86 లక్షల రైతు కుటుంబాలకు రూ.14 వేలు జమ చేశాం. రెండు విడతల్లో రూ.6,310 కోట్లు అందించాం. బిందు సేద్యానికి ప్రాధాన్యమిస్తున్నాం. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం కూడా చేస్తున్నాం. ఇలాంటి వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు ఇంకా మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను అమలు చేయబోతున్నాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే ఐదు అంశాలపై రైతులనే కాకుండా.. వారి కుటుంబాలనూ చైతన్యపరచాలి. వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా, పట్టు, పాడి రైతులతో పాటు పౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులకూ అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాలను రైతు సేవా కేంద్రాల సిబ్బంది ముందుండి నడిపించాలి. దీంతో పాటు వర్క్‌షాపులు నిర్వహించాలి. ప్రతి రైతు సేవా కేంద్రంలో కార్యాచరణ ప్రణాళిక అమలుచేయాలి' అని స్పష్టం చేశారు.

ప్రకృతి సేద్యంతో లాభాలను వివరించాలి..

రైతులకు వ్యవసాయం గిట్టుబాటయ్యేందుకు ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. 'శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటవుతుంది ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాం. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ చేస్తున్నాం. రైతుబజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రమోట్ చేయాలి. కడపలో ప్రకృతి సాగును పరిశీలించాను. ఆ రైతులు చాలా సంతృప్తిగా ఉన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల కంటే గ్రోమోర్ కేంద్రాల్లో ఎరువుల ధర తక్కువగా ఉంది. రైతుల పెట్టుబడి ఖర్చు తగ్గాలి. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే.. ఉత్పత్తులకు మేలు జరుగుతుంది. రైతులు ఏ పంట సాగు చేశారు.. వారికి ఎటువంటి సాయం కావాలనేది నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగు మందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను రైతులకు అర్థమయ్యేలా స్పష్టంగా వివరించాలి. దీంతో పాటు తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలు, సేంద్రియ సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఏ స్థాయిలో ఉందో తెలియజెప్పాలి. పూర్తి నీటి యాజమాన్యం ద్వారా రిజర్వాయర్లను నింపగలిగాం. అలాగే సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలు రైతులకు చెప్పాలి' అని ఆదేశించారు.

ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

దూరదృష్టి కలిగిన నాయకులు

- పీవీకి దక్కాల్సిన ఘనత మన్మోహన్‌కు దక్కింది
- ఐర్లాండ్‌లో భారత రాయబారి అఖిలేశ్ మిశ్రా

(డబ్లిన్ నుంచి ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇరువురు దూరదృష్టి ఉన్న నాయకులని ఐర్లాండ్‌లో భారత రాయబారి అఖిలేశ్‌మిశ్రా అన్నారు. గురువారం తనను కలిసిన ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి కృష్ణారావుతో మాట్లాడుతూ.. టెక్నాలజీని వినూత్నంగా ఉపయోగించిన ఘనత వారిద్దరికే దక్కుతుందన్నారు. అభివృద్ధికీ, ప్రజలకూ అనుకూలమైన విధానాలు చేపట్టడంలో వారు విలువైన పాత్ర పోషించారని చెప్పారు. తన కెరీర్ తొలి దశలో గుంటూరులో పనిచేసిన రోజులను మిశ్రా గుర్తు చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు చేపట్టకపోతే ఇవాళ దేశంలో జరుగుతున్న పెనుమార్పులు సంభవించేవి కావని ఆయన చెప్పారు. పీవీకి దక్కాల్సిన ఘనత మన్మోహన్‌సింగ్‌కు దక్కిందన్నారు. పీవీపై అద్భుతమైన పుస్తకం రాశారని ఆయన కృష్ణారావును ప్రశంసించారు.

టెట్‌కు 1,97,823 దరఖాస్తులు

- వారిలో ఇన్‌సర్వీస్ టీచర్లు 17,883 మంది
- పురుషుల కంటే మహిళల నుంచి రెట్టింపు సంఖ్యలో వచ్చిన దరఖాస్తులు
- రెండు రోజుల్లో ముగియనున్న గడువు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 1,97,823 దరఖాస్తులు వచ్చాయి. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్న నేపథ్యంలో కొత్తగా ఉపాధ్యాయ విద్య పూర్తిచేసిన వారికి అవకాశం కల్పించే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఇటీవల టెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈసారి 17,883 మంది ఇన్ సర్వీస్ టీచర్లు కూడా టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఈ నెల 23తో దరఖాస్తుల గడువు ముగియనుంది. మొత్తం దరఖాస్తుల్లో 66,104 పురుషుల నుంచి, 1,31,719 మహిళల నుంచి వచ్చాయి. పురుషులతో పోలిస్తే మహిళలు దాదాపుగా రెట్టింపు సంఖ్యలో టెట్‌కు దరఖాస్తు చేశారు. ఇదిలా ఉండగా, ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరి అయినప్పటికీ మినహాయింపు లభిస్తుందనే ఆశతో ఎక్కువమంది దరఖాస్తు చేసుకోలేదు. 2011నుంచి టెట్ అమల్లోకి వచ్చింది. అంతకుముందు నుంచి టీచర్లుగా ఉన్నవారు కూడా ఇప్పుడు టెట్ అర్హత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ ప్రకారం రాష్ట్రంలో దాదాపు లక్ష మంది టీచర్లు ఈ పరీక్ష రాయాల్సి ఉంది. కానీ ఇప్పుడు అందులో 25శాతం మంది కూడా దరఖాస్తు చేసుకోలేదు. టెట్ అర్హత సాధించేందుకు ఇన్ సర్వీస్ టీచర్లకు రెండేళ్ల సమయం ఉంది. మరోవైపు చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని సుప్రీంలో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. దానిపై విచారణ కొనసాగుతోంది. కేంద్రం కూడా మినహాయింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన నేపథ్యంలో పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదని టీచర్లు భావిస్తున్నారు.

రాష్ట్రంలో వినూత్న విద్యా సంస్కరణలు

- ఫిన్‌లాండ్ విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వినూత్న విద్యా సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. విద్యారంగంపై అధ్యయనానికి ఆ శాఖ అధికారులు ఇటీవల ఫిన్‌లాండ్ పర్యటనకు వెళ్లొచ్చారు. దీనిపై బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పర్యటనలో భాగంగా ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్, ఆల్టో యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ హెల్సింకి, యూనివర్సిటీ ఆఫ్ టర్కు, హెల్సింకి సెంట్రల్ లైబ్రరీలను సందర్శించినట్లు వివరించారు. ఫిన్‌లాండ్ బోధన విధానం, పాఠశాలల్లో తనిఖీలు, మూల్యాంకనాన్ని పరిశీలించామన్నారు. ప్రిన్సిపాల్‌కు పూర్తి పరిపాలనా అధికారాలు ఇవ్వడంవల్ల ఆ దేశంలో విద్యారంగం విజయవంతమైందని అభిప్రాయపడ్డారు. విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్‌గుప్తా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేష్ కుమార్ ఫిన్‌లాండ్ వెళ్లిన బృందంలో ఉన్నారు.

వలస వెళ్లినా.. చదువు ఆగదు!

పనుల నిమిత్తం వలస వెళ్లిన కుటుంబాల్లోని పిల్లలకు సర్కారు రక్ష

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


ప్రత్యేక పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్లు

పొట్టకూటి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి. ఉన్న ఊర్లో చేయడానికి పనుండదు. దీంతో రాష్ట్రంలో ప్రతి ఏటా.. వేలాది కుటుంబాలు వలసబాట పడుతున్నాయి. సీజన్ల వారీగా జిల్లాలు, రాష్ట్రాలు దాటి తాత్కాలిక వలస జీవనం సాగిస్తున్నాయి. అయితే, ఈ వలసబాట కారణంగా ఆయా కుటుంబాల్లోని పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోంది. వలస వెళ్తున్న కుటుంబాలు.. స్థానికంగా తమ పిల్లలను ఉంచే మార్గం లేక, చదివించే దారిలేక తమతోనే తీసుకెళ్తున్నారు. ఫలితంగా ఏటా 3, 4 నెలలపాటు ఆ చిన్నారులు బడికి దూరమై.. భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అలాంటి చిన్నారుల భవితకు భరోసా కల్పించాలని సంకల్పించింది. ఈ క్రమంలో గతంలో కంటే మెరుగ్గా సీజనల్ హాస్టళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 236 సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. ఆయా హాస్టళ్లలో వలస కుటుంబాల పిల్లలకు ఆశ్రయం కల్పించడంతోపాటు వారు విద్యను కొనసాగించేలా పర్యవేక్షిస్తుంది. ఈసారి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి.. కేవలం రాష్ట్రానికి చెందిన విద్యార్థులనే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పనుల నిమిత్తం వలస వచ్చే వారి పిల్లలకూ చదువు.. అదికూడా వారి మాతృభాషలోనే చెప్పించే ప్రణాళికను రూపొందించింది.

కేంద్రం సహకారం!

సీజనల్ హాస్టళ్లకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం మేరకు నిధులు ఇస్తోంది. ఈసారి రాష్ట్రానికి అత్యధికంగా హాస్టళ్లు వచ్చేలా సమగ్ర శిక్ష అధికారులు చేసిన ప్రయత్నం ఫలించింది. వలస కుటుంబాల్లో 11,842 మంది విద్యార్థులు ఉంటారని అధికారులు అంచనా వేశారు. వారికోసం 236 హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కుటుంబాల పిల్లలను కూడా పరిగణనలోకి తీసుకుని వీరందరికీ సీజనల్ హాస్టళ్లలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. సగటున ఒక్కో హాస్టల్‌లో 50 మంది విద్యార్థులు ఉన్నారని అధికారులు తెలిపారు.

నెలకు రూ.80 వేలు

సీజనల్ హాస్టళ్లలో ప్రతి విద్యార్థికీ రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నారు. వారి కోసం ఒక వంట మనిషి, ఒక హెల్పర్, ఒక టీచర్, ఒక కేర్ టేకర్‌ను నియమించారు. ఒక్కో విద్యార్థికీ ఆహారం కోసం నెలకు రూ.వెయ్యి ఖర్చు చేస్తున్నారు. మొత్తంగా ఒక్కొక్క హాస్టల్‌కు నెలకు రూ.80 వేలు ఖర్చు చేస్తున్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో ఈ హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం రూ.11.63 కోట్లు కేటాయించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులకు వారికి అలవాటైన ఆహారమే అందిస్తున్నారు.

గుంటూరులో 1,875 మంది బిహారీలు

గుంటూరు జిల్లాలో మిర్చి కోతలకు కర్నూలు ఇతర జిల్లాల వాసులు వస్తుంటారు. కానీ, మిర్చి యార్డుల్లో పనులకు బిహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ కూలీలు వస్తారు. ఆయా కుటుంబాల్లోని చిన్నారుల బాల్యమంతా మిర్చి యార్డుల్లోనే మగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తొలిసారి యార్డుల సమీపంలోనే హాస్టళ్లు ఏర్పాటు చేసింది. అక్కడ కేవలం వసతి మాత్రమే కాకుండా బయటి రాష్ట్రాల వారి కోసం తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా కూలీలతో అధికారులు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారులతోపాటు కూలీకి వెళ్లే పిల్లల్ని కూడా హాస్టళ్లలో తరగతులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో ఒక్క గుంటూరు జిల్లాలోనే 1,875 మంది బిహార్‌కు చెందిన పిల్లలు చదువుకుంటున్నారు. ప్రస్తుతం గుంటూరులో 2,196 మంది, కృష్ణాలో 1,821, కర్నూలులో 4,020, ఎన్టీఆర్‌లో 1,723 మంది హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. వారిలో ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులున్నారు. సీజనల్ హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అదనపు ఎస్పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి చెప్పారు.

వారి భాషలోనే చదువు

"తల్లిదండ్రులు వలస వెళ్లినా పిల్లల చదువుకు బ్రేక్ పడకూడదనేది ప్రభుత్వం లక్ష్యం. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశాం. ఈసారి కొత్తగా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు వారి మాతృభాషలోనే బోధించే విధానం తీసుకొచ్చాం. స్థానికంగా ఆయా భాషలు తెలిసిన వారిని వలంటీర్లుగా నియమించి వారి ద్వారా బయటి రాష్ట్రాల పిల్లలకు విద్యను అందిస్తున్నాం. పదేళ్ల వయసు దాటిన పిల్లలు కూడా కూలి పనులకు వెళ్లకుండా తరగతులకు హాజరవుతున్నారు. అలాగే రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస వెళ్లే కుటుంబాల పిల్లలు అంతరాయం లేకుండా చదువుకునే అవకాశం కల్పించాం."

- బి. శ్రీనివాసరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్

ఏపీలో పని చేస్తాం!

మహిళలు పనిచేయాలని కోరుకునే రాష్ట్రాల జాబితాలో నాలుగో స్థానం

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు పనిచేసేందుకు ఇష్టపడే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది. ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ మంగళవారం విడుదల చేసిన 'ఇండియా స్కిల్స్..' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2026ను ప్రమాణంగా తీసుకుని దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించగా, ఏపీలో పనిచేసేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపారని ఆ నివేదిక తెలిపింది. రాజస్థాన్, కేరళ, తెలంగాణ తర్వాత నాలుగో స్థానంలో ఏపీ ఉంది. మన తర్వాత పంజాబ్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు, యూపీ, కర్ణాటక ఉన్నాయి. అదే పురుషులైతే యూపీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్‌ల్లో పనిచేసేందుకు ఆసక్తి చూపించారు. ఉపాధి, ఉద్యోగాల్లో మహిళలు పురుషులను దాటిపోయారు. దేశవ్యాప్తంగా 2026 నాటికి 51.5శాతంమంది పురుషులు, 54శాతం మంది మహిళలు పనిచేసే పరిస్థితి ఉందని అంచనా వేసింది. కాగా, దేశవ్యాప్తంగా ఉపాధి కల్పన 54.81శాతం నుంచి 56.35శాతానికి పెరిగింది. దేశంలో శాశ్వత ప్రాతిపదికన (ఫుల్ టైమ్ జాబ్) ఉద్యోగులే (72శాతం) ఎక్కువగా ఉన్నారు. అసైన్‌మెంట్ ఆధారంగా లేదా థర్డ్ పార్టీ వర్క్ విధానంలో 16శాతం మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో 70.15శాతం మంది ఉద్యోగాలు పొందుతున్నారు. ఎంబీఏ గ్రాడ్యుయేట్లలో 72.76శాతం ఉద్యోగాలు పొందుతున్నా, గతేడాది అది 78శాతంగా ఉందని నివేదిక తెలిపింది.

జనవరి నుంచి కాగ్నిజెంట్!

- తాత్కాలిక భవనంలో 800 మందితో ప్రారంభం?
- రాష్ట్రవాసులను విశాఖకు బదిలీ చేయాలని నిర్ణయం
- ఉద్యోగుల అభిప్రాయం కోసం సర్వే
- అభిప్రాయాలు తెలిపేందుకు నేటి వరకే గడువు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రముఖ ఐటీ కంపెనీ 'కాగ్నిజెంట్' వచ్చే ఏడాది జనవరి నుంచి విశాఖపట్నంలో కార్యకలాపాలు నిర్వహించడానికి సన్నాహాలు చేసుకుంటోంది. ఈ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కాపులుప్పాడలో 21.33 ఎకరాలు కేటాయించగా, అందులో రూ.1,583 కోట్లతో అతిపెద్ద కార్యాలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం 8వేల మందికి దశల వారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. కాపులుప్పాడలో శాశ్వత భవన నిర్మాణం పూర్తికాకముందే తాత్కాలిక భవనంలో డెలివరీ సెంటర్ ప్రారంభించాలని ఏర్పాట్లు చేస్తోంది. దీనిని 2026 జనవరిలో ప్రారంభించాలని భావిస్తోంది. దేశవ్యాప్తంగా కాగ్నిజెంట్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో రాష్ట్రానికి చెందిన కొందరిని విశాఖపట్నం తరలించాలని యాజమాన్యం నిర్ణయించింది. దీనిపై ఆయా ఉద్యోగుల అభిప్రాయం తెలుసుకోడానికి సర్వే చేస్తోంది. 'విశాఖ సెంటర్‌లో పనిచేయడానికి మీకు ఆసక్తి ఉందా?' అంటూ లేఖలు పంపుతోంది. ఈ సర్వేను ఈనెల 21(శుక్రవారం)తో ముగిస్తామని, ఆరోజు సాయంత్రానికి అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. అందరి అభిప్రాయాలు తీసుకున్నాక తాము నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

ఉద్యోగుల ఆసక్తిని బట్టే..

విశాఖలో డెలివరీ సెంటర్‌ను 800 మందితో ప్రారంభించాలని కాగ్నిజెంట్ భావిస్తున్నట్టు ఐటీ వర్గాల సమాచారం. విశాఖ రావడానికి ఎంత మంది ఆసక్తి చూపిస్తారో చూసుకొని, అందుకు తగిన వసతులున్న భవనాన్ని ఐటీ హిల్స్‌లో ఎంపిక చేసుకుంటారని ఐటీ ప్రతినిధి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రుషికొండ ఐటీ హిల్స్‌లోని నంబరు-2, 3లలో అనేక భవనాలు ప్లగ్ అండ్ ప్లేతో ఖాళీగా ఉన్నాయి. కాగ్నిజెంట్ వంటి సంస్థ లీజుకు అడిగితే ఎవరూ కాదనరు. కాబట్టి తాత్కాలిక భవనం ఎంపిక పెద్ద సమస్య కాదని భావిస్తున్నారు.

రేపటి నుంచి సాగర్-శ్రీశైలం 'లాంచీ ప్రయాణం'

- ఏర్పాట్లు పూర్తి చేసిన పర్యాటక శాఖ

నాగార్జునసాగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఒడిలో, ప్రకృతి పచ్చదనంతో కప్పేసిన ఎత్తయిన కొండల మధ్య సాగే సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణానికి సర్వం సిద్ధమైంది. నల్లమల అటవీ ప్రాంతంలో 110 కిలోమీటర్ల దూరం ఆరు గంటల పాటు సాగే ప్రయాణాన్ని ఈ నెల 22 నుంచి ప్రారంభించేందుకు పర్యాటకశాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంతటి ఆహ్లాదకరమైన ప్రయాణాన్ని నాగార్జున సాగర్ జలాశయంలో సరైన నీటిమట్టం ఉన్నప్పుడే ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది ఆగస్టులోనే సాగర్ నీటి మట్టం 550అడుగులు దాటడంతో లాంచీ ప్రయాణానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రతి శనివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నుంచి ఉదయం 10 గంటలకు ఈ ప్రయాణం ప్రారంభమై, సాయంత్రం 4గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. అక్కడి నుంచి పర్యాటకులు త మ సొంత ఖర్చుతో ప్రైవేటు వాహనాల్లో 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం దేవస్థానానికి చేరుకోవాలి. రెండు రోజుల పాటు సాగే లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ రెండు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించింది. ఒక వైపు లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2000, పిల్లలకు రూ.1,600గా నిర్ణయించింది. ఇక, సాగర్ నుంచి శ్రీశైలానికి వెళ్లి తిరిగి వచ్చేందుకు పెద్దలకు రూ.3,250, పిల్లలకు రూ.2,600లుగా అధికారులు టికెట్ ధరలు ఖరారు చేశారు. మరిన్ని వివరాలకు హైదరాబాద్‌లోని పర్యాటక శాఖ ఫోన్ నంబర్ 9848540371, సాగర్ లాంచీ స్టేషన్ నంబరు 7997951023 నంబరును సంప్రదించాలని తెలిపారు. పర్యాటక శాఖ వెబ్‌సైట్ (https://www.tgtdc.in)లో టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

రైతు ద్రోహి జగన్: ఎంఏ షరీఫ్

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రైతులకు ఇవ్వాల్సిన రూ.58వేల కోట్లలో రూ.39 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, రైతులను కష్టాల్లోకి నెట్టేసిన వ్యక్తి జగన్ అని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '84,724 మంది రైతులకు చెల్లించాల్సిన రూ.1,674.47 కోట్ల ధాన్యం బకాయిలను జగన్ ప్రభుత్వం చెల్లించకుండా ఎగ్గొట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని చెల్లించి రైతుకు భరోసా ఇచ్చింది. జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేవలం రూ.3,000 ఇచ్చింది. వాటిని కేంద్రం ఇచ్చిన పీఎం కిసాన్ నిధులతో కలిపి రూ.13,500 మాత్రమే ఇచ్చి అబద్ధపు ప్రచారం చేసుకుంది. 64 లక్షల మందికి ఇస్తామని చెప్పి, చివరికి 52 లక్షల మందికే రైతు భరోసా ఇచ్చిన రైతుద్రోహి జగన్. కూటమి ప్రభుత్వం సొంతంగా రూ.14 వేలు అన్నదాత సుఖీభవ కింద ఇస్తోంది. కేంద్రం సాయంతో కలిపి రూ.20 వేలు రైతులకు ఇస్తోంది' అని షరీఫ్ తెలిపారు.

'నల్లమల సాగర్'తో సమ్మిళితాభివృద్ధి: లంకా

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు ఎంతో ప్రయోజనకరమైనదని 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. ఈ ప్రాజెక్టుతో వెనుకబడిన ప్రాంతాల సమ్మిళిత అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు సరఫరాతో ప్రజలకు ఆరోగ్య రక్షణ కలుగుతుందన్నారు. చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

టెక్ శంకర్ మృతదేహానికి పోస్టుమార్టం

- మరో ముగ్గురు మావోయిస్టులకు కూడా..

రంపచోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ సహా నలుగురు మావోయిస్టుల మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. మిగిలిన ఏడుగురి మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. కాగా, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, నిబంధనలు ద్వారా శాస్త్రీయంగా పోస్టుమార్టం నిర్వహించడం వల్ల మావోయిస్టుల అప్పగింతలో జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. ఇవే ఎన్‌కౌంటర్లలో మరణించిన హిడ్మా, ఆయన భార్య మృతదేహాలకు ఇప్పటికే పోస్టుమార్టం పూర్తయింది. హిడ్మా స్వస్థలం ఛత్తీస్‌గఢ్‌లోని పువర్తిలో అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి.

నెల్లూరు జైలుకు నలుగురు మావోయిస్టులు

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల పోలీసులకు పట్టుబడిన మావోయిస్టుల్లో నలుగురిని నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో మంగళవారం అరెస్టయిన 50 మంది మావోయిస్టులను బుధవారం విజయవాడ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో నలుగురు మావోయిస్టులను పోలీసులు నెల్లూరు తరలించారు.

న్యాయ విచారణకు వామపక్షాల డిమాండ్

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి వరుస ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్), ఎంసీపీఐ(యూ), లిబరేషన్, ఎస్‌యూసీఐ(సి), ఫార్వర్డ్‌బ్లాక్, ఆర్‌ఎస్పీ రాష్ట్ర నాయకులు గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. హిడ్మా సహా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 13మంది మావోయిస్టులను పోలీసులు ముందుగానే నిర్బంధించి.. ఆ తర్వాత కాల్చి చంపారనే సందేహాలున్నాయని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ముఖ్యనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సహా అరెస్టు చేసిన మావోయిస్టులందరినీ వెంటనే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు.

జనజీవనంలో కలవకుంటే నిర్మూలనే..

- మావోయిస్టులను మళ్లీ హెచ్చరిస్తున్నాం
- ఏపీలో నక్సల్స్ ఉనికిని నిర్వీర్యం చేస్తాం
- మార్చి వరకు 'ఆపరేషన్ సంభవ్'
- ఆ గడువులోగా మావోయిస్టు రహిత రాష్ట్రం
- రంపచోడవరంలో డీజీపీ గుప్తా వెల్లడి

రంపచోడవరం, నవంబరు 20 (ఆంధ్రప్రదేశ్): ఏపీని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో 2026 మార్చివరకు 'ఆపరేషన్ సంభవ్'ను కొనసాగిస్తామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు రాష్ట్రంలోనూ మావోయిస్టు నిర్మూలనా చర్యలు చేపడుతున్నామని వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లిలో వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో గురువారం ఆయన రంపచోడవరంలో పర్యటించారు. రెండు ఎన్‌కౌంటర్లలో 13 మంది మృతి చెందగా, ఘటనా స్థలాల్లో లభ్యమైన ఆయుధాలు, పేలుడు సామగ్రిని ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మా ట్లాడారు. "రాష్ట్రాన్ని హింసకు దూరంగా ఉంచాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నాం. ఇందులో భాగంగానే మావోయిస్టులకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాం. రాష్ట్రంలో ఎక్కడా మా వోయిస్టుల అలజడిని అనుమతించబోం. అందులో భాగమే మారేడుమిల్లి ఎన్‌కౌంటర్లు" అని వివరించారు. దేశవ్యాప్తంగా తీవ్ర నేర స్వభావిగా గుర్తింపు పొందిన మావోయిస్టు నేత హిడ్మా సహా ఆరుగురిని ఒకరోజు, సాంకేతికతను ఉపయోగించి అనేక దుశ్చర్యలకు పాల్పడిన టెక్ శంకర్‌తోపాటు ఏడుగురిని రెండోరోజు ఎదురుకాల్పుల్లో నిర్మూలించామన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగానే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న 50 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని, లేనిపక్షంలో నిర్మూలనా చర్యలను చేపడతామని ఈ ఏడాది జూన్‌లో మన్యం ఎన్‌కౌంటర్ సందర్భంగా హెచ్చరించామని, మావోయిస్టుల నుంచి స్పందన లేనందునే ఆపరేషన్లు కొనసాగిస్తున్నామని డీజీపీ వివరించారు. సాయుధ ఉద్యమాన్ని వదిలి బయటకు రావడానికి మావోయిస్టులకు మరోసారి అవకాశం ఇస్తున్నామని డీజీపీ తెలిపారు.


నక్సల్స్ ఎన్‌కౌంటర్ తర్వాత పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు



దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసుల దగ్గరున్నారా?

అందుకు ఆధారాలున్నాయా..!

- పిటిషనర్లకు హైకోర్టు ప్రశ్న
- వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు నేటి వరకూ గడువు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి(దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డిలను కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన హేబియస్ కార్పస్ పిటిషన్‌పై గురువారం హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. వారు ఇరువురూ పోలీసులు వద్ద ఉన్నారని నిరూపించేందుకు ఆధారాలు ఏమైనా ఉంటే, వాటిని కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశించింది. ఇలాంటి వ్యాజ్యాలలో తాము జోక్యం చేసుకోవాలంటే ప్రాథమిక ఆధారాలు ఉండాలని ధర్మాసనం గుర్తు చేసింది. పిటిషనర్ అభ్యర్థన మేరకు పోలీసు ఉన్నతాధికారులు మీడియాతో మాట్లాడిన వీడియోను కోర్టు ముందు ఉంచేందుకు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ జి.తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి(దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డిలను కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దేవ్‌జీ తమ్ముడు తిప్పిరి గంగాధర్, రాజిరెడ్డి కుమార్తె స్నేహలత హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫు న్యాయవాది యు.జైభీమారావు వాదనలు వినిపిస్తూ... ఈనెల 18న మావోయిస్టులు-పోలీసులు మధ్య కాల్పులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా దేవ్‌జీ, రాజిరెడ్డిలను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారన్నారు. వారిద్దరినీ కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)టి.విష్ణుతేజ స్పందిస్తూ... మావోయిస్టులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి పోలీసుల అదుపులో లేరన్నారు. పోలీసులు అరెస్టు చేసిన మొత్తం 50 మంది మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చామన్నారు. పిటిషనర్ల వాదనలో వాస్తవం లేదన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'దేవ్‌జీ, రాజిరెడ్డి ఇద్దరూ పోలీసుల నిర్బంధంలో ఉన్నారని ఎలా చెబుతున్నారు? అందుకు సంబంధించి మీ దగ్గర ఏమైనా ఆధారాలు ఉన్నాయా?' అని ప్రశ్నించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు కొనసాగిస్తూ.. 'దేవ్‌జీ, రాజిరెడ్డి సెక్యూరిటీ గార్డులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు మీడియాతో మాట్లాడుతూ 9 మంది కీలక నేతలు తమ అదుపులో ఉన్నారని ప్రకటన చేశారు. ఆ వీడియోను కోర్టు ముందు ఉంచుతాం' అని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వారిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నారని చెప్పేందుకు ఉన్న ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.


ఒకే పాడెపై హిడ్మా దంపతుల అంతిమయాత్ర, భారీగా తరలివస్తున్న ఆదివాసీలు. (ఇన్‌సెట్‌లో) ఒకే చితిపై దహనమవుతున్న మృతదేహాలు

హిడ్మా అంత్యక్రియలు పూర్తి

పువర్తికి భారీగా తరలివచ్చిన ఆదివాసీలు

చింతూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు హిడ్మా, రాజే దంపతులది ప్రేమ వివాహం. నమ్మిన సిద్ధాంతం కోసం కలిసి జీవించారు. కలిసే మరణించారు. చివరకు వారిని ఒకే పాడిపై మోసి, ఒకే చితిపై ఉంచి ఎర్రని వస్త్రాలు కప్పి దహనం చేశారు. పోస్టుమార్టం అనంతరం హిడ్మా దంపతుల మృతదేహాలను గురువారం వారి స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ సుక్మా జిల్లాలోని పువర్తికి తరలించారు. ఈ సందర్భంగా గిరిజనుల కన్నీళ్లతో పువర్తి తడిసి ముద్దైంది. కడసారి చూపు కోసం పరిసర ప్రాంతాల ఆదివాసీలు తండోపతండాలుగా కిలోమీటర్ల కొద్ది కాలినడకనే పువర్తికి చేరుకున్నారు. ఇళ్లకు తాళాలు వేసి చిన్నారులను, వృద్ధులను వెంటబెట్టుకొని అంతా తరలివచ్చారు. పాడె మోసేందుకు, చితిని పేర్చేందుకు గిరిజనులంతా పోటీపడ్డారు. కొడుకును కడసారి చూసుకొని హిడ్మా తల్లి వెక్కివెక్కి ఏడ్చారు. హిడ్మా చిన్నతనంలో ఇంట్లో వినియోగించిన సామగ్రిని కూడా అదే చితిపై దహనం చేశారు. కాగా, గురువారం తెల్లవారుజాము నుంచే పువర్తి జవాన్లతో నిండిపోయింది. నిఘా నేత్రాలు వెంటాడాయి.

ఆ నక్సల్స్‌లో ఇద్దరు బాలలు

- న్యాయాధికారి ఆదేశాలతో పరీక్ష.. వయసు నిర్ధారణ
- నేడు జువెనైల్ కోర్టుకు తరలింపు

విజయవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఇటీవల అరెస్టు చేసి కోర్టుకు తీసుకువచ్చిన మావోయిస్టుల్లో నలుగురి వయస్సుపై న్యాయాధికారి వ్యక్తం చేసిన సందేహం నిజమైంది. వారిలో ఇద్దరు మైనర్లు అని నిర్ధారణ అయింది. విజయవాడలోని పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో ఓ భవనంలో ఆశ్రయం పొందిన 28 మంది మావోయిస్టులను పోలీసులు విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరుపరిచిన విషయం తెలిసిందే. ఇందులో నలుగురు మావోయిస్టుల వయస్సుపై న్యాయాధికారి లెనిన్‌బాబు అనుమానం వ్యక్తం చేశారు. ఆ నలుగురు పిల్లల్లా కనిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. వారికి వయస్సు నిర్ధారణ పరీక్షలు చేయించాలని ఆదేశాలు ఇచ్చారు. గురువారం వైద్య పరీక్షలు చేయించి వారిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ నలుగురిలో మడకం హంగు (ఏ7), దోడి వాకాడ్ (ఏ10) మేజర్లని వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరు మైనర్లని ధ్రువీకరించారు. ఈ నలుగురిని పోలీసులు కోర్టులో హాజరుపరచగా, హంగు వాకాడ్‌కు వచ్చే నెల రెండో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి లెనిన్‌బాబు ఉత్తర్వులు ఇచ్చారు. వారిని రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారానికి తరలించారు. మిగిలిన ఇద్దరు మైనర్లను శుక్రవారం జువెనైల్ కోర్టులో హాజరుపరచాలని ఆదేశాలిచ్చారు.

మీరేమైనా చెప్పదలచుకున్నారా?

జగన్‌కు సీబీఐ కోర్టు జడ్జి ప్రశ్న.. ఏమీ లేదన్న ఏ-1



గురువారం హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద వైసీపీ శ్రేణుల హంగామా

- యూరప్ పర్యటన వ్యవహారంలో కోర్టుకు హాజరైన మాజీ సీఎం
- రికార్డు చేసుకున్న న్యాయస్థానం
- కోర్టు హాలులో 25 నిమిషాలు గడిపిన జగన్
- ఎదురుపడినా పలుకరించుకోని అన్నాచెల్లెలు

హైదరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడి(ఏ-1)గా ఉన్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గురువారం నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి కోర్టులో ఉదయం 11.50 నిమిషాలకు ఆయన అడుగుపెట్టారు. దాదాపు 25 నిమిషాలు ఉన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో న్యాయవాదులు, ఇతరులు కోర్టులోకి రావడంతో విపరీతంగా తోపులాట జరిగింది. న్యాయవాదులు, ఇతరులు అధిక సంఖ్యలో రావడంతో లోపల కోర్టు హాలు, బయట కారిడార్లు కిక్కిరిసిపోయాయి. వారందరినీ అదుపు చేయడం పోలీసులకు కష్టంగా మారింది. కేసులు లేని న్యాయవాదులు బయటకు వెళ్లాలని కోర్టు సిబ్బంది పదే పదే విజ్ఞప్తి చేసినా హాలు నుంచి ఎవరూ వెళ్లలేదు. ఆ పరిస్థితుల్లోనే జగన్ అక్రమాస్తులకు సంబంధించిన దాల్మియా సిమెంట్స్ కేసులో కొద్దిసేపు వాదనలు జరిగాయి. ఆ తర్వాత జగన్‌కు సంబంధించిన అప్లికేషన్ విచారణకు రావడంతో ఆయన న్యాయాధికారి టి.రఘురాం ఎదుటకు వచ్చారు. ఈ సందర్భంగా 'మీరేమైనా చెప్పదలచుకున్నారా' అని న్యాయాధికారి ఆయన్ను ప్రశ్నించారు. ఏమీ లేదని జగన్ సమాధానం ఇచ్చారు. ఆయన వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావడాన్ని న్యాయాధికారి రికార్డు చేశారు. యూరప్ పర్యటనకు సంబంధించిన అప్లికేషన్‌లో విచారణను ముగించారు. అనంతరం జగన్ కోర్టు హాలు నుంచి నిష్క్రమించారు. ఇటీవల యూరప్ ట్రిప్‌కు వెళ్లడానికి జగన్‌కు అనుమతి ఇచ్చిన కోర్టు.. తిరిగి వచ్చాక వ్యక్తిగతంగా రావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే తాను వస్తే భద్రతాపరమైన ఇబ్బందులు వస్తాయని.. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని జగన్ దరఖాస్తు చేయగా కోర్టు అంగీకరించలేదు. కోర్టుకు రావలసిందేనని స్పష్టంచేసింది. దీంతో దాదాపు ఆరేళ్ల తర్వాత సీబీఐ కోర్టులో ఆయన అడుగుపెట్టారు.

పలకరించుకోని జగన్, సునీత

కాగా.. కోర్టు హాలులో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. జగన్ విజిటర్స్ కుర్చీల వైపు కూర్చోగా.. ఎదురుగా సీబీఐ న్యాయవాదులు కూర్చునే చోట.. హత్యకు గురైన ఆయన చిన్నాన్న, మాజీ మంత్రి వివేకానంద రెడ్డి కుమార్తె, ఆయన చెల్లెలు నర్రెడ్డి సునీతారెడ్డి కూర్చున్నారు. ఆ తర్వాత జగన్ జడ్జి ముందుకు వచ్చినప్పుడు.. ఎదురుగా కూర్చున్న సునీతను చూశారు. అయినా ఇద్దరూ ఒకరినొకరు పలకరించుకోలేదు.



బేగంపేట విమానాశ్రయంలో వైసీపీ శ్రేణులను అదుపు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్‌లోనూ 'రప్పా రప్పా'

(మొదటి పేజీ తరువాయి)

సీపీ జోయెల్ డేవిస్, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ ఆనంద్, అబిడ్స్ సబ్ డివిజన్ ఏసీపీ ప్రవీణ్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లి కోర్టు రెండువైపులా దారులను బారికేడ్లతో మూసివేశారు. కోర్టులో విచారణ సుమారు అర గంటకు పైగా జరిగింది. 12.10 గంటలకు రెండో గేటు నుంచి పోలీసులు జగన్ కాన్వాయ్‌ను బయటకు పంపించారు.

రోడ్లపై నానా హంగామా

గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో గురువారం ఉదయం 11 గంటలకు జగన్ బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఆయన వెంట మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్నినాని, విడదల రజని ఉన్నారు. విమానాశ్రయం వెలుపలకు రాగానే అప్పటికే అక్కడకు చేరుకున్న జగన్ అభిమానులు ఆయనకు మద్దతుగా నినాదాలు చేశారు. ఒకదశలో పోలీసులను నెట్టుకుంటూ జగన్‌ను కలిసేందుకు కొందరు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. అభిమానులకు అభివాదం చేస్తూ కారులో నాంపల్లి కోర్టుకు బయలుదేరారు. నాంపల్లి సీబీఐ కోర్టుకు వెళ్లే మార్గంలో ఎక్కడి చూసినా వైసీపీ నాయకులు, కార్యకర్తలు గుంపులు గుంపులుగా వచ్చి రోడ్లపై హడావుడి చేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం నాంపల్లి, బజార్‌ఘాట్, రెడ్‌హిల్స్ ప్రాంతాల్లో హంగామా సృష్టించారు. వైఎస్ జగన్ ఫొటోలతో కూడిన ప్లకార్డులను పట్టుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోడ్లమీద వెళ్లే సామాన్యులను సైతం ఇబ్బందులకు గురిచేశారు. వైసీపీ శ్రేణులను కట్టడి చేసేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు భారీ బందోబస్తును, ప్రత్యేకంగా రోప్ పార్టీలను ఏర్పాటు చేశారు. గుంపులు గుంపులుగా వచ్చిన వారిని ఎక్కడికక్కడ కట్టడి చేశారు. బజార్‌ఘాట్ మీదుగా కోర్టు వైపు జగన్ వెళుతున్న సమయంలో పోలీసులను తోసుకుంటూ పార్టీ శ్రేణులు వెళ్లే ప్రయత్నం చేశారు. భారీగా మోహరించిన పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసిన జగన్ ఉన్న ఒక కారుతో పాటు మరో కారును మాత్రమే వెళ్లేందుకు అనుమతించారు. బజార్‌ఘాట్ వైపు నుంచి నాంపల్లి సీబీఐ కోర్టుకు వెళ్లే మార్గంలో నివాసం ఉండే స్థానికులు, వ్యాపార సంస్థల నిర్వాహకులను పోలీసులు అడ్డుకున్నారు. గుర్తింపు కార్డులు చూపిస్తేనే లోపలికి పంపించారు. కొంత మంది దగ్గర గుర్తింపు కార్డులు లేకపోవడంతో అడ్డుకున్నారు. దీంతో వారు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 2-3 గంటల పాటు నాంపల్లి, బజార్‌ఘాట్ ప్రాంతాల్లో స్థానికులతో పాటు వ్యాపారులు, ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కోర్టు బయట గందరగోళం

జగన్ నాంపల్లి కోర్టుకు వస్తున్న సమయంలో పార్టీ శ్రేణులు 'రప్పా రప్పా' ప్లకార్డులు ప్రదర్శించారు. 2029లో కాబోయే సీఎం జగన్, జై జగన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆయన కాన్వాయ్ వైపు దూసుకువచ్చే ప్రయత్నం చేశారు. వైసీపీ శ్రేణులను పోలీసులు లాగేయడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో సుమారు అర కిలోమీటరు వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వైసీపీ శ్రేణులు అతి చేయడంపై పలువురు వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటలకు పైగా ఆ ప్రాంతంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఒక దశలో ఏసీపీ ప్రవీణ్‌పైకి కార్యకర్తలు దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులను వెనక్కినెట్టే ప్రయత్నం చేయగా, పోలీసులు గట్టిగా అడ్డుకుని నిలువరించారు. కొద్దిసేపు పోలీసులు, పార్టీ శ్రేణుల మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. ఒక దశలో పోలీసులు అక్కడ భారీ సంఖ్యలో గుమిగూడిన పార్టీ శ్రేణులను తరిమికొట్టే ప్రయత్నం చేశారు. కాగా కొందరు భయంతో ముందుగానే షాపులు మూసివేశారు. అంతకుముందు పోలీసులు సైతం షాపులు తెరవద్దని సూచించారు. జగన్ కోర్టు హాల్‌ను వీడుతున్న సందర్భంగా కూడా విపరీతమైన తోపులాట జరిగింది. కోర్టు హాల్‌ను వీడి కారిడార్లలో ప్రవేశించగానే ఒక్కసారిగా జనం మీదపడ్డారు. కొంతమంది న్యాయవాదులు ఆ తోపులాటకు కిందపడిపోయారు. పోలీసులు అదుపు చేయకపోయి ఉంటే మరింతగా తొక్కిసలాట జరిగేదని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. కొంత మంది అత్యుత్సాహంతో కోర్టు హాల్‌లోనే సెల్ఫీలు తీసుకోవడం ఇబ్బందికరంగా మారింది. 1:15 గంటలకు బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 లోటస్ పాండ్‌లోని నివాసానికి వచ్చారు. జగన్ రాక గురించి తెలియడంతో వైసీపీ నాయకులు, జగన్ అభిమానులు అక్కడికి చేరుకున్నారు. జగన్ పలువురు వైసీపీ నాయకులతో ఇంట్లో చర్చలు జరిపారు. అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్టుకు మధ్యాహ్నం 2 గంటల తర్వాత బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరు వెళ్లారు. జగన్ వెంట ఎంపీ మిథున్ రెడ్డి ఉన్నారు.

నవ్విపోదురు గాక..!

- పొరుగు రాష్ట్రంలోనూ జగన్ బలప్రదర్శన
- తీరు మార్చుకోని వైసీపీ అధినేత
- గతంలో చావు, తుఫాను పరామర్శల్లోనూ ఇదేవరస

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పరామర్శలకు వెళ్లినా, తుఫాను ప్రాంతాల పర్యటనలకు వెళ్లినా, చివరికి అక్రమాస్తుల కేసులో కోర్టుకు హాజరైనా సరే... పార్టీ శ్రేణులతో బలప్రదర్శనగా నానా హడావుడి చేసేయడం! వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ తీరు ఇదీ! తాజాగా హైదరాబాద్‌లో ఇదే దృశ్యం కనిపించింది. అక్రమాస్తుల కేసులో జగన్ ఆరేళ్ల తర్వాత గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరయ్యారు. బేగంపేట విమానాశ్రయంలో జగన్ కాలు పెట్టినప్పటి నుంచి నాంపల్లి కోర్టుకు చేరుకునేంత వరకూ నానా హడావుడి చేశారు. జగన్ కారులో కూర్చుని రోడ్డు పక్కన తెచ్చిపెట్టుకున్న జనాన్ని చూస్తూ రెండు చేతులూ పైకెత్తి దండం పెడుతూ ర్యాలీగా వెళ్లారు. జగన్ విమానం ఖర్చు లక్షలాది రూపాయలు అయినట్టు తెలుస్తోంది.

సందర్భం ఏదైనా హంగామా

ఇటీవల చనిపోయినవారి కుటుంబాలను పరామర్శించేందుకు జగన్ వెళ్లిన సందర్భంలోనూ భారీ సమీకరణతో ఊరేగింపుగా వెళ్తున్నారు. వైసీపీ ముందస్తుగా అందించిన 'జగన్ 2.0 రప్పా రప్పా' పోస్టర్లను ప్రదర్శిస్తున్నారు. సంతాపం తెలిపే సమయంలో కూడా జగన్‌కు జై కొడుతూ నినాదాలు చేయిస్తున్నారు. పరామర్శల సమయంలో సీఎం.. సీఎం అంటూ నినదిస్తుంటే జగన్ వద్దని వారించకుండా చిరునవ్వులు చిందించడంపై విమర్శలు వస్తున్నాయి. సత్తెనపల్లి పర్యటన సమయంలో తన కారు కింద కార్యకర్త పడి నలిగిపోయినా పట్టించుకోలేదు. శబరిమలలో అయ్యప్ప దర్శనానికి వెళ్లే సమయంలోనూ వైసీపీ శ్రేణులు జగన్ ఫొటోను మెడలో వేసుకుని 'జగన్ 2.0 రప్పా రప్పా' అంటూ నినదించడంపై అయ్యప్ప భక్తులు విస్తుపోతున్నారు.

కొసమెరుపు

చిత్రమేమిటంటే.. జగన్ మీద ప్రేమతో హైదరాబాద్‌లో బలప్రదర్శనకు జనం వచ్చారని వైసీపీ నేతలు నమ్మబలుకుతున్నారు. అదే నిజమైతే.. ఆయన వెంట జనం చివరి దాకా ఉండాలి. అయితే న్యాయస్థానం నుంచి లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసానికి వెళ్లినప్పుడు.. అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లేందుకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నప్పుడు జనం పలుచగా కనిపించారు. అంటే.. ఉదయానికి ఉన్న అభిమానం మధ్యాహ్నానికి కరిగిపోయిందా అని రాజకీయవర్గాలు అంటున్నాయి.

జనసమీకరణ.. బలప్రదర్శన

కోర్టు వద్ద ఉద్రిక్త వాతావరణం సృష్టించి, జగన్ వ్యక్తిగతంగా హాజరైతే ఎలాంటి పరిణామాలు ఉంటాయో తెలియజేసేలా వైసీపీ శ్రేణులు నానా హంగామా చేశారు. నాంపల్లి కోర్టుకు వచ్చే దారుల్లో ముందుగానే జన సమీకరణ చేసి బలప్రదర్శనకు దిగారు. లక్డీకపూల్, రవీంద్రభారతి, నాంపల్లి, బజార్‌ఘాట్, రెడ్‌హిల్స్ ప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీలు, కటౌట్లతో జగన్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాట్లు చేశారు. సామాన్య ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలిగేలా ఎక్కడికక్కడ రోడ్లపై దుకాణాల ముందు కార్లు, ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేశారు. '2029లో వైసీపీ అధికారంలోకి రాగానే రప్పా.. రప్పా పొట్టేళ్ల నరికినట్టు నరుకుతాం' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నాంపల్లి సిగ్నల్ వద్ద ఫ్లెక్సీలు పట్టుకొని హంగామా చేశారు.

పోలీసులతో మాజీ మంత్రుల వాగ్వాదం: నాంపల్లి క్రిమినల్ కోర్టు సముదాయం ప్రధాన ద్వారం వద్ద మాజీ మంత్రి పేర్ని నాని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. జగన్ వెంట కేవలం ఆయన న్యాయవాదులకే అనుమతి ఉందని, ఇతరులకు ప్రవేశం లేదని పోలీసులు చెప్పారు. అయినా వినకుండా పేర్ని నాని వాగ్వాదానికి దిగారు. నాంపల్లి కోర్టు సిగ్నల్ వద్ద మరో మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్ తన అనుచరులతో కలిసి ఒకింత దూకుడుగా పోలీసుల భద్రతా వలయాన్ని దాటుకొని దూసుకెళ్లడానికి ప్రయత్నించారు. రోప్ పార్టీ ఆయన్ను అడ్డుకుంది. తమను కోర్టులోకి ఎందుకు అనుమతించరని సురేశ్ కూడా పోలీసులతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు.

కోర్టు ప్రాంగణంలో నినాదాలు సబబు కాదు: కోర్టు సముదాయంలోని నాలుగో అంతస్తులో ఉన్న సీబీఐ కోర్టు వద్ద న్యాయవాదులు కాని వ్యక్తులు చాలా మంది గుమిగూడి జై జగన్.. జై జగన్ అంటూ నినాదాలు చేసినట్టు మా దృష్టికి వచ్చింది. కోర్టు కారిడార్‌లో నినాదాలు చేయడం సబబు కాదు. ఇలాంటి హైప్రొఫైల్ కేసుల విచారణ సాధ్యమైనంత వరకు సాయంత్రం 4 గంటల తర్వాత లేదా శనివారం పెట్టుకుంటే ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి.

- రవి కిషోర్, నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

సునీతారెడ్డిది వితండవాదం!



- తదుపరి దర్యాప్తు కోరడంపై భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఆక్షేపణ
- ఆమె పిటిషన్ కొట్టేయాలని కోర్టుకు వినతి

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు కోరుతూ ఆయన కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి వితండ వాదం చేస్తున్నారని నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, దేవిరెడ్డి శివ శంకర్‌రెడ్డి ఆరోపించారు. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు చేస్తేనే అసలు వ్యక్తులు బయటకు వస్తారని.. చాలా అంశాలపై ఇంకా విచారణ జరగాలని ఆమె దాఖలుచేసిన పిటిషన్‌పై నాంపల్లి సీబీఐ కోర్టులో గురువారం విచారణ కొనసాగింది. నిందితుల తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. పిటిషనర్ సునీతారెడ్డి పరస్పర విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని.. ఓ వైపు వేగంగా ట్రయల్ చేపట్టాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని.. మరోవైపు తదుపరి దర్యాప్తు అవసరమంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. ఒకవేళ సీబీఐ తదుపరి దర్యాప్తు చేపడితే ట్రయల్ ఎలా ముందుకు సాగుతుందని ప్రశ్నించారు. ట్రయల్ ఆలస్యమవుతోందని ఆరోపిస్తూనే అది ముందుకు సాగకుండా చేస్తున్నారని తెలిపారు. అలాగే హత్య జరిగింది పులివెందులలో కాబట్టి తదుపరి దర్యాప్తు కోసం కడప కోర్టుకే వెళ్లాల్సి ఉంటుందన్నారు. అమాయకులైన తమ క్లయింట్లను నిందితులుగా చేర్చారని.. నిందితులు, నిందితులంటూ పదే పదే మీడియాలో రావడం వల్ల వారి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో సునీతారెడ్డి పిటిషన్‌ను కొట్టేసి.. వేగంగా ట్రయల్ చేపట్టాలని కోరారు. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

రెండు రోజుల పోలీసు కస్టడీకి భాస్కర్‌రెడ్డి

- అసభ్య పోస్టుల కేసులో కోర్టు ఉత్తర్వులు

విజయవాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): లండన్‌లో ఉంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టిన వైసీపీ నేత మాలెంపాటి భాస్కర్‌రెడ్డిని రెండు రోజుల పాటు విచారించేందుకు పోలీస్ కస్టడీకిస్తూ కోర్టు గురువారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఈనెల 22, 23 తేదీల్లో పోలీసు కస్టడీకి అనుమతించింది. భాస్కర్‌రెడ్డి ప్రస్తుతం నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

రెస్టోబార్ల విషయంలో చట్టప్రకారం చర్యలు

- జీవీఎంసీకి ధర్మాసనం ఆదేశం... ఆరు వారాలకు విచారణ వాయిదా

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతి సమీపంలో నిర్మించిన కాంక్రీట్ గోడను కూల్చివేయగా మిగిలి ఉన్న నిర్మాణాన్ని తొలగించేందుకు అయ్యే ఖర్చు రూ.31.97 లక్షలను కూడా జీవీఎంసీకి చెల్లించామని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ గురువారం హైకోర్టుకు నివేదించాయి. అలాగే అక్రమ కాంక్రీట్ నిర్మాణాలతో ప్రకృతికి రూ.17.46 కోట్ల నష్టం జరిగిందని కేంద్ర అటవీ-పర్యావరణ మంత్రిత్వశాఖ కమిటీ ఇచ్చిన నివేదికపై తమ అభ్యంతరాలను ఎంవోఈఎఫ్ ముందు ఉంచామన్నారు. మరోవైపు సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను రెండు వారాల్లో తొలగించాలని రెస్టోబార్లకు ఉత్తర్వులు ఇచ్చామని జీవీఎంసీ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి కోర్టుకు తెలిపారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం... అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పీ సమర్పించిన అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులోగా ఓ నిర్ణయం తీసుకోవాలని ఎంవోఈఎఫ్‌కు సూచించింది. రెస్టోబార్ల విషయంలో రెండు వారాల అనంతరం చట్ట నిబంధనల ప్రకారం నడుచుకోవచ్చని జీవీఎంసీకి స్పష్టం చేసింది. తదుపరి విచారణను 6వారాలకు వాయిదా వేసింది.

'సాక్షి' ఎడిటర్, చీఫ్ రిపోర్టర్‌కు

హైకోర్టు షాక్



- ప్రివిలేజ్ కమిటీ విచారణ నిలిపివేతకు హైకోర్టు నిరాకరణ
- షోకాజ్ నోటీసు దశలో ఉత్తర్వులివ్వలేమని స్పష్టీకరణ

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శాసనసభ పట్ల ప్రజల్లో తప్పుడు అభిప్రాయాన్ని కలిగించేలా కథనాన్ని ప్రచురించిన 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్ ఫణికుమార్‌కు హైకోర్టు గట్టిషాక్ ఇచ్చింది. 'కోట్లు ఖర్చు-శిక్షణ తుస్సు' అనే శీర్షికతో ప్రచురించిన కథనంపై శాసనసభ ప్రివిలేజ్ కమిటీ జరుపుతున్న విచారణ ప్రక్రియను నిలిపివేసేందుకు నిరాకరించింది. షోకాజ్ నోటీసు దశలో ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అదనపు మెటీరియల్ సమర్పించేందుకు వీలుగా సమయం ఇచ్చేందుకు అభ్యంతరం లేదన్న సెక్రెటరీ జనరల్, ప్రివిలేజ్ కమిటీ తరఫు న్యాయవాది వాదనను నమోదు చేసింది. అదనపు మెటీరియల్‌ను ప్రివిలేజ్ కమిటీ ముందు ఉంచేందుకు జగన్ పత్రిక ఎడిటర్, చీఫ్ రిపోర్టర్‌కు రెండు వారాలు సమయం ఇచ్చింది. వార్తా కథనానికి సంబంధించి సాక్ష్యం ఇచ్చేందుకు ఈనెల 21న ప్రివిలేజ్ కమిటీ ముందు హాజరు కావాలని ఎడిటర్, చీఫ్ రిపోర్టర్‌లకు సెక్రెటరీ జనరల్ లేఖ పంపిన నేపథ్యంలో వారి ఇద్దరి హాజరును ధర్మాసనం వాయిదా వేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరి 22, 23 తేదీలలో ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహణ వాయిదా పడడంతో రూ.కోట్లు వృథా అయ్యాయని పేర్కొంటూ 'కోట్లు ఖర్చు-శిక్షణ తుస్సు' అనే శీర్షికతో సాక్షి పత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని, ప్రచురణ వెనుక దురుద్దేశం ఉందంటూ ఎమ్మెల్యే జి.జయసూర్య ఫిబ్రవరి 25న శాసనసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాన్ని స్పీకర్ ప్రివిలేజ్ కమిటీకి రిఫర్ చేశారు. దీంతో కమిటీ సాక్షి పత్రికకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కథనం ప్రచురణపై వివరణ కోరుతూ శాసనసభ సెక్రెటరీ జనరల్ జూన్ 3న సాక్షి యాజమాన్యం, ఎడిటర్, ప్రింటర్, పబ్లిషర్‌కు లేఖ రాశారు. వీటిని సవాల్ చేస్తూ ఆ పత్రిక ఎడిటర్ రక్కసి ధనంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్ బి.ఫణికుమార్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఇటీవల విచారణ జరిపిన సింగిల్ జడ్జి అపరిపక్వదశలో కోర్టును ఆశ్రయించారని పేర్కొంటూ వ్యాజ్యాలను కొట్టివేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ వారిద్దరూ ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. గురువారం అప్పీళ్లు విచారణకు రాగా వీరి తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. శాసనసభ వ్యవహారాల ముఖ్య కార్యదర్శి తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... సహజ న్యాయసూత్రాలు పాటించాలనే ఉద్దేశంతోనే ఈనెల 21న హాజరుకావాలని ఎడిటర్, చీఫ్ రిపోర్టర్లను కోరామన్నారు.

విశ్రాంత ఎంఈవోపై సైబర్ వల..!

- రిటైర్మెంట్ సొమ్ము సహా 34.6 లక్షలు స్వాహా
- ముమ్మిడివరం పీఎస్‌లో కేసు నమోదు

ముమ్మిడివరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయన విద్యాశాఖలో పనిచేసి రిటైరైన ఎంఈవో. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని రూ.34.60 లక్షలు మోసపోయారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో ఈ సంఘటన జరిగింది. ఈ కేసు వివరాలను ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలాసాగర్ గురువారం వెల్లడించారు. విశ్రాంత ఎంఈవో బొజ్జా రమణశ్రీకి ఈనెల 8న సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. 'బెంగళూరులోని ఒక ఫోన్ నంబర్‌కు మీ ఆధార్ కార్డు లింక్ అయి ఉంది. ఆ నంబర్‌పై ఒక కేసు ఉంది. అది నిజమని తేలితే మిమ్మల్ని అరెస్టు చేయాల్సి ఉంటుంది' అని బెదిరించారు. రమణశ్రీ.. ఆ నంబరు తనది కాదని చెబుతున్నా వినకుండా.. దీని నుంచి బయటపడాలంటే బెంగళూరు పోలీస్‌స్టేషన్ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని చెప్పి మరో నంబర్ ఇచ్చారు. రమణశ్రీ ఆ నంబరకు ఫోన్ చేయగా.. అవతలి వారు వాట్సాప్ కాల్‌లోకి వచ్చి 'ఇది చాలా రహస్యంగా విచారించాల్సిన కేసు. మీరు ఇంట్లోనే ఉంటూ మమ్మల్ని సంప్రదించాలి' అని సూచిస్తూ ఆధార్ వివరాలు తీసుకున్నారు.

పోలీస్ యూనిఫాంలో బెదిరించి...

కొంత సమయానికి వీడియో కాల్ చేసి.. మీ ఆధార్ నంబర్‌పై మహారాష్ట్రలోని కెనరా బ్యాంకులో ఏటీఎం కేసు ఉందని.. రూ.3కోట్ల స్కాం కేసులో మీకు రూ.75 లక్షలు ముట్టాయని, ఆ మొత్తం మీ ఖాతాలో జమయ్యాయని చెప్పారు. కేసు నుంచి బయటపడాలంటే పోలీసులతో మాట్లాడాలన్నారు. వెంటనే పోలీస్ యూనిఫాంలో ఉన్న వేరొకరు వీడియోకాల్‌లో లైన్‌లోకి వచ్చి.. 'ఇంకా అతనితో ఎందుకు మాట్లాడుతున్నావ్.. ఇంటికి వెళ్లి ఎందుకు అరెస్టు చేయలేదు' అని కోపం ప్రదర్శిస్తూ దూషించాడు. భయపడిపోయిన రమణశ్రీ తన ఖాతాలో అంత సొమ్ము లేదని.. తన రిటైర్మెంట్ సమయంలో వచ్చిన రూ.15 లక్షలు ఉన్నాయని చెప్పారు. దీంతో నేరగాళ్లు తాము చెప్పిన ఖాతాకు ఆర్టీజీఎస్ చేయాలని.. రిజర్వ్ బ్యాంకుకు పంపి పరిశీలిస్తామని.. అవి మీవేనని తేలితే మీ సొమ్ము వెనక్కు ఇచ్చేస్తామని నమ్మించారు. దాంతో 10న రమణశ్రీ రూ.15 లక్షలు వారు చెప్పిన ఖాతాకు పంపించారు. తర్వాత సైబర్ నేరగాళ్లు మళ్లీ ఫోన్ చేసి మీకు ముట్టిన రూ.75 లక్షల్లో కనీసం సగమైనా ఆర్టీజీఎస్ చేస్తేగానీ పూర్తి వివరాలు తెలియవని చెప్పారు. దీంతో ఈ నెల 12న రూ.9.8 లక్షలు, 15న మరో రూ.9.8లక్షలు వారి ఖాతాలో జమచేశారు. కాగా, ఆ సొమ్ము మొత్తం తమకు చేరిందని, వాటిని పరిశీలించి తిరిగి మీ ఖాతాకు జమ చేశామంటూ ఈ నెల 15నే నేరగాళ్లు రమణశ్రీకి మెసేజ్ చేశారు. ఆయన బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా.. డబ్బులేమీ పడలేదు. వెంటనే వారికి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో మోసపోయినట్టు గుర్తించిన ఆయన బుధవారం ముమ్మిడివరం పోలీసులను ఆశ్రయించారు. 3 ఫోన్ నంబర్లు ట్రేస్ అయ్యాయని, అవి కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వచ్చినట్టు తేలిందని పోలీసులు చెప్పారు.

ఐబొమ్మ వన్ వచ్చింది!

- రవి అరెస్టుతో ఆగని పైరసీ.. ముందే చెప్పిన సజ్జనార్, ఆనంద్
- నేనెవరినీ మోసం చేయలేదు..: పోలీస్ కస్టడీలో రవి

హైదరాబాద్ సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పైరసీ సినిమాల వెబ్‌సైట్లు ఐ బొమ్మ, బప్పం టీవీలను పోలీసులు నిలిపివేయించారు. వాటి నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. కానీ, నాలుగు రోజుల్లోనే ఐ బొమ్మ స్థానంలో ఐ బొమ్మవన్ వచ్చేసింది! రవిని అరెస్ట్ చేసిన సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో.. ఇది పైరసీకి అంతం కాదని సీపీ సజ్జనార్‌తో పాటు ఇతర అధికారులు స్పష్టంగా చెప్పారు. హ్యాకర్ల హ్యాకింగ్ కొనసాగుతూనే ఉంటుందని తెలంగాణ హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సీవీ ఆనంద్ కూడా పేర్కొన్నారు.గురువారం ఐ బొమ్మవన్ అందుబాటులోకి వచ్చింది. ఐ బొమ్మ తరహాలోనే ఐ బొమ్మవన్‌లో కూడా పైరసీ చేసిన కొత్త సినిమాలు కనిపించాయి. కాగా, ఐ బొమ్మవన్‌పై సైబర్ క్రైం అధికారులు వివరణ ఇచ్చారు. అందులో సినిమాల రివ్యూలు మాత్రమే ఉన్నాయని, సినిమాలు ఓపెన్ కావడం లేదని తెలిపారు.

ఎవరినీ మోసం చేయలేదు..: తానెవరినీ మోసం చేయలేదని రవి చెప్పాడు. సినిమాలను పైరసీ చేయలేదని, అక్రమంగా ప్రజల సొమ్ము తినలేదని పోలీసుల విచారణలో సమాధానమిచ్చాడు. సినిమా పైరసీ, బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వంటి కేసుల్లో హైదరాబాద్ సైబర్ క్రైం అధికారులు రవి ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. తొలిరోజైన గురువారం.. బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు, డబ్బు ఎలా వచ్చింది? ఎన్ని దేశాల నుంచి ఆపరేట్ చేస్తున్నాడు? సర్వర్లు ఏదేశాల్లో ఉన్నాయి? వాటిని ఎవరు నిర్వహిస్తున్నారు? అన్న విషయాలపై ప్రశ్నించారు. పోలీసు విచారణలో ఎక్కడా బెదరకుండా జవాబులిచ్చిన రవి.. కొన్ని ప్రశ్నలకు మాత్రం బదులివ్వలేదని తెలిసింది.

బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు

- మార్గదర్శకాలు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, ఉపాధ్యాయుల బాధ్యతలపై శాఖ డైరెక్టర్ విజయరామరాజు గురువారం మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లా బాల్య వివాహాల పర్యవేక్షణ సెల్‌ను డీఈవోలు ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలపై ప్రతి 15 రోజులకు నివేదికలు సమర్పించాలని సమగ్ర శిక్ష ఏపీసీలకు స్పష్టం చేశారు. మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, దుర్బల స్థితిలో ఉన్న పిల్లల వివరాలు సేకరించాలని, హైరిస్క్ మండలాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు రహస్య రిజిస్టర్ నిర్వహించాలని, పిల్లల వివాహానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఎంఈవోలు, స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా వారి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే హెచ్‌ఎంకు సమాచారం ఇవ్వాలని డైరెక్టర్ సూచించారు.

నేడు పోలవరానికి కేంద్ర డిజైన్స్ అధికారి

- డయాఫ్రం వాల్, గ్యాప్-2, 3 పనుల పరిశీలన

పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనుల పరిశీలనకు కేంద్ర జలసంఘానికి చెందిన డిజైన్స్ రీసెర్చ్ విభాగం ఎక్స్-అఫిషియో సభ్యుడు ఆదిత్య శర్మ, కేంద్ర జలశక్తి శాఖ అదనపు కార్యదర్శి సుబోధ్ యాదవ్ రాష్ట్రానికి రానున్నారు. ప్రాజెక్టు క్షేత్రంలో శుక్రవారం ఈ ఇద్దరూ.. ప్రస్తుతం జోరుగా సాగుతున్న డయాఫ్రం వాల్ పనులను పనులను పరిశీలిస్తారు. కేంద్ర జల సంఘం ఆమోదించిన డిజైన్ల ప్రకారమే అవి జరుగుతున్నాయో లేదో గమనిస్తారు. ఎక్కడైనా సాంకేతిక పరమైన లోపాలుంటే వాటిని సరిదిద్దేలా సూచనలు చేస్తారు. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం గ్యాప్-2, గ్యాప్-3 వద్ద చేపడుతున్న పనులను కూడా పరిశీలిస్తారని.. వారేమైనా సలహాలిస్తే పాటిస్తామని జలవనరుల శాఖ వర్గాలు తెలిపాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.